అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 30-01-2025
సంపుటి : 11 | సంచిక : 30 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఫార్మా, స్టీల్ రంగాలకు గడ్డుకాలం

త్వరలో ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ : పారిశ్రామిక వర్గాల ఆందోళన



న్యూఢిల్లీ : భారత్‌లోని ఔషధ, స్టీల్ రంగాలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే సంకేతాలు కనబడుతున్నాయి. అమెరికా నుంచి ఈ రంగాలు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొనే అవకాశాలు కనబడుతున్నాయి. భారత్, చైనా, బ్రెజిల్ దేశాలను అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధిక సుంకాల...13లో

నింగిలోకి జీఎస్ఎల్‌వీ-ఎఫ్15

వందో ప్రయోగం విజయవంతం

ఇస్రో చరిత్రలో మైలురాయి : ఛైర్మెన్ నారాయణన్



శ్రీహరికోట: ఇస్రో చరిత్రాత్మక వందో ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని తీసుకొని నింగిలోకి దూసుకెళ్లింది. ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. దీని బరువు 2,250కిలోలు. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు ఇది మొదటి ప్రయోగం కావడంతో.. ఆయనే స్వయంగా అన్ని ప్రక్రియలనూ పర్యవేక్షించారు. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్ సేవల కోసం ఈ ఉపగ్రహ ప్రయోగం...13లో

అది రాజ్యాంగ విరుద్ధం

నివాస ఆధారిత మెడికల్ కోటా సరికాదు

ఆర్టికల్-14ని ఉల్లంఘించటమే : రద్దుచేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం

13లో





మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ. చిత్రంలో తమ్మినేని, తదితరులు

ప్రజాసమస్యలపై పోరుబాట

శ్రామికుల దోపిడీ, సామాజిక అణచివేత, సరళీకృత విధానాలపై రాజీలేకుండా ఉద్యమిస్తాం

- వాగ్దానాల అమలు కోసం ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం
- పోరాటాలతోనే పార్టీ పునాదిని పెంచుతాం
- మనువాద అహంకారంతోనే గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు
- మతోన్మాదాన్ని నిలువరించడమే మా లక్ష్యం
- ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదుగుతాం
- వామపక్షాలను సంఘటితం చేస్తాం
- దళితున్ని కాబట్టి పదవి రాలేదు
- పార్టీని నడిపించే సామర్థ్యం ఉన్నందుకే నాకు ఈ బాధ్యత : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అధికారంలో ఎవరున్నా ఏ పార్టీ ఉన్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటూ ప్రశ్నిస్తామని చెప్పారు. శ్రామికుల దోపిడీ, సామాజిక అణచివేత, సరళీకృత ఆర్థిక విధానాలపై బలమైన ఉద్యమాలను నిర్మిస్తామని వివరించారు. బీజేపీ మతోన్మాదాన్ని ఎండగడతామనీ, నిలువరిస్తామని అన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీని, 15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని, 60 మందితో రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర హామీలేవీ అమలు కావడం లేదన్నారు. అది కూడా సరిపోయినన్ని బస్సుల్లేవని ...14లో

వర్గ పోరాటాలతోనే కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదల : తమ్మినేని



పార్టీ మహాసభల్లో 49 అంశాలపై తీర్మానాలను చేశామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం చెప్పారు. వర్గ పోరాటాలను చేయడం ద్వారానే కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదల ఆధారపడి ఉంటుందన్నారు. మతోన్మాదంపై లౌకికపోరాటం, సరళీకృత ఆర్థిక విధానాలపై ఆర్థిక పోరాటాలు, కుల వివక్షకు వ్యతిరేకంగా...14లో

సమగ్ర కులగణనపై ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్

రెండ్రోజుల్లో ముసాయిదా నివేదిక



- ఫిబ్రవరి 2న క్యాబినెట్ సబ్ కమిటీకి అందజేత
- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ : అధికారులు, ఉద్యోగులను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర కులగణనపై రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమగ్ర కులగణనపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కులగణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగ పడుతుందని సీఎం చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయన్నారు. సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందనీ, ఒకట్రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దాదాపు 96 శాతానికిపైగా కుటుంబాల వివరాల డేటా ఎంట్రీని పూర్తి చేసినట్టు తెలిపారు. కొన్ని చోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీలోగా క్యాబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్ 6న రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే 2024) మొదలైంది. అన్ని...13లో

ఫిబ్రవరిలో తెలంగాణ కొత్త టూరిజం పాలసీ

దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా రూపొందించండి : అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

13లో

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

ఫిబ్రవరి 27న ఎన్నిక...మార్చి 3న ఫలితాలు

తెలంగాణలో మూడు, ఏపీలోనూ మూడు స్థానాలు ఖాళీ

వివరాలు 13లో

గోవింద్ పన్సారే హత్యకేసులో నిందితులకు బెయిల్



వివరాలు 13లో



పథకం ప్రకారమే కులదురహంకార హత్య

ప్రేమ వివాహమే కారణం

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- కారు, కత్తి, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం : వివరాలు వెల్లడించిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నవ తెలంగాణ-సూర్యాపేట

ప్రేమ వివాహం చేసుకున్న యువకుడు కృష్ణను పథకం ప్రకారం హత్య చేసిన ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బుధవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్.. వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి కృష్ణ, పిల్లలమర్రి గ్రామానికి చెందిన కోట్ల నవీన్ స్నేహితులు. ఈ క్రమంలో నవీన్ చెల్లెలు భార్గవి, కృష్ణ ప్రేమించుకున్నారు. వారి పెండ్లికి భార్గవి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. అయినా వారు ఇరువురు కుటుంబ సభ్యులకు తెలియకుండా వివాహం చేసుకున్నారు. ఇది భార్గవి కుటుంబ సభ్యులకు ఇష్టం లేదు. దీంతో వారు కృష్ణను అంతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా అన్నదమ్ములు నవీన్, ...5లో

కుంభమేళాలో తొక్కిసలాట

30 మంది మృతి..90 మందికిపైగా గాయాలు

- మౌనీ అమావాస్య సందర్భంగా కోట్లాదిగా భక్తుల రాక
- ప్రభుత్వ వైఫల్యంపై ప్రతిపక్షాల ఆగ్రహం



ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో బుధవారం తొక్కిసలాట జరిగింది. మౌనీ అమావాస్య సందర్భంగా భక్తులు కోట్లాదిగా తరలివచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుండగా తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 30 మంది మృతి చెందారు. 60 మందికిపైగా గాయాలయ్యాయి. దీంతో మౌనీ అమావాస్య రోజున సంప్రదాయబద్ధంగా నిర్వహించే 'అమృత స్నాన్' కార్యక్రమాన్ని అఖారాలు రద్దు చేశారు. కుంభమేళాలో తొక్కిసలాట చోటుచేసుకొని ప్రాణనష్టం జరగడంపై ప్రధాని నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నానని, సహాయక చర్యలపై ఆరా తీస్తున్నానని చెప్పారు. కుంభమేళాలో జరిగిన విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలు రాష్ట్రాల నేతలు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కాగా ఘటన జరిగి చాలా సమయం గడిచినప్పటికీ అటు కేంద్రం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ మృతుల సంఖ్యపై పెదవి విప్పలేదు. పరిస్థితి అదుపులోనే ఉన్నదని, కొందరు భక్తులకు తీవ్ర గాయాలయ్యా యని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అమృత స్నానాల కోసం ఎనిమిది నుంచి పది కోట్ల మంది ప్రయాగ్‌రాజ్ వచ్చారని అంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరారు. బుధవారం తెల్లవారుజామున ...3లో



గతమెంతో ఘనం అన్నట్టు.. కొన్నేండ్లుగా పసుపు పంటకు ధర రాకపోవడంతో పెట్టుబడులు సైతం మీద పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. సంప్రదాయంగా వస్తున్న సాగును వదులుకోలేక.. ఈసారైనా ధర రాకపోదా అన్న ఆశతో రైతులు ప్రతేడాదీ పసుపు పంట సాగు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి వస్తుండటంతో పసుపు తవ్వకాలు, ఉడకబెట్టడం, పాలిషింగ్ తదితర పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుండగా.. ఆశించిన మేర ధర రాకపోవడంతో అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొంది. గతేడాది రైతులు పసుపును విక్రయించిన సమయంలో రూ. 8 వేల నుంచి 12 వేల వరకు ధర పలకగా.. వారి పంట విక్రయాలు పూర్తికాగానే ఒక్కసారిగా రూ.18 వేలకు పెరగడం గమనార్హం. ఈసారి ధర ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపునకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. పసుపు బోర్డుపై నమ్మకాలు పెట్టుకున్నారు.

పసుపు బోర్డు ఏం చేస్తుందో ?

పంట తవ్వకాల్లో రైతులు బిజీ..ఉడకబెట్టి ఆరబెట్టడంలో నిమగ్నం

- ధరపై గంపెడాశలు
- గతేడాది విక్రయాలు పూర్తయిన తర్వాత పెరిగిన ధర

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రంలో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, వికారాబాద్, వరంగల్, మహబూబాబాద్ తదితర ప్రాంతాల్లో పసుపు సాగు ఎక్కువగా ఉంటోంది. నిజామాబాద్‌లో 20,650 ఎకరాలు, జగిత్యాలలో 11,409 ఎకరాలు, నిర్మల్‌లో 7,824 ఎకరాలు, వికారాబాద్‌లో 2,020 ఎకరాల్లో సాగవుతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పసుపు సాగుకు పెట్టింది పేరు. ఇది సుమారు 9 నెలల పంట. అంతర పంటగా మొక్కజొన్న, మిరపను సాగు చేస్తుంటారు. ప్రస్తుతం పసుపు చేతికి రావడంతో తవ్వకాలు, ఉడకబెట్టి ఆరబెట్టడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఈసారి మార్కెట్‌లో మొదట సానుకూల ధరలతో సీజన్ ప్రారంభం కావడం రైతుల్లో ఆశలు నింపుతోంది. జిల్లాలో పలు రకాలైన పసుపు పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ రకం సాగు అతి తక్కువ. జిల్లాలోనే ప్రతిభ పసుపు రకాన్ని సాగు చేస్తున్నారు. తొమ్మిది నెలల కాల పరిమితి రకాలైన ఎర్ర గుంటూరు, పిటిఎస్-10 రకం, ఎసిసి-78, ఎసిసి-79 రకం పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మొత్తంలో సుమారు 70 శాతం ఎర్ర గుంటూరు రకమే.



శ్రమకు.. వచ్చే ధరకు పొంతన లేదు

పసుపు పంట పండించడానికి అనువుగా భూములను సారవంతం చేసే ప్రక్రియ నుంచి కొమ్ములను అమ్మే వరకు రైతులు పడే శ్రమ అంతా ఇంతా కాదు. ఇక్కడి రైతులు పసుపు పంటను పచ్చబంగారంగా పిలుచుకుంటారు. కొన్ని సంవత్సరాల కిందటి వరకు కూడా రైతులు తాము పండించిన పసుపు పంటను అమ్ముకొని బంగారాన్ని ఖరీదు చేసే వారట. అందువల్లనే పసుపును.. పసిడి పంటగా పిలుచుకుంటారు. అయితే, ఇప్పుడు పరిస్థితులు గతంలా లేవని రైతులు అంటున్నారు. చేసిన శ్రమకు వచ్చిన గిట్టుబాటుకు పొంతన లేకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులకు సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. పసుపు పంటకు సారవంతమైన భూమి అవసరం. ఎకరా భూమిని సారవంతం చేయాలంటే రూ. 30 వేల విలువ గల చెరువు పూడిక మట్టిని తరలించాల్సి ఉంటుంది. పేడకు రూ.45 వేల నుంచి 50వేల వరకు వెచ్చిస్తారు. విత్తనాలకు రూ.25వేల వరకు, ఎరువులకు రూ.20వేల వరకు అవుతుంది. దీంతో పాటు కూలీలకు చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులు మరో రూ.30వేల వరకు అవుతుంది. ఎకరా భూమి లో పసుపు పండించేందుకు సుమారు రూ.లక్షా 30 వేల నుంచి లక్షన్నర వరకు ఖర్చు అవుతుంది. చివరకు పంట దిగుబడి ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. అయితే, 9 మాసాల పాటు చెమటోడ్చి పంట పండిస్తే మార్కెట్ కోరిన రీతిలో పసుపును అమ్మడం కూడా తమకు భారంగా మారిందని రైతులు వాపోతున్నారు.

అందని గిట్టుబాటు ధర

పసుపు పంటను అమ్ముదామంటే మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు నాణ్యతను...13లో

రూ.34,300 కోట్లతో జాతీయ కీలక ఖనిజాల మిషన్

కేంద్ర మంత్రివర్గం ఆమోదం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రూ. 34,300 కోట్లతో 'జాతీయ కీలక ఖనిజాల మిషన్'కు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైంది. ఈ సందర్భంగా రూ. 16,300 కోట్ల వ్యయంతో జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎంఎం)ను ప్రారంభించడానికి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగం.. ఇతర సంస్థల ద్వారా రూ. 18,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. కీలక ఖనిజాల రంగంలో సవాళ్ల పరిష్కారం కోసం రెండేండ్లుగా వివిధ కార్యక్రమాలను చేపట్టింది. అలాగే, ఇథనాల్ సరఫరా సంవత్సరం (ఈఎస్‌వై) 2024-25కుగాను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ)కు ఇథనాల్ కొనుగోలు ధరను సవరించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇథనాల్ సరఫరా 2024 నవంబరు 1న ప్రారంభమై 2025 అక్టోబరు 31తో ముగియనుంది. 2024-25 ఏడాదికి (2024 నవంబరు 1 నుంచి 2025 అక్టోబరు 31 మధ్య కాలానికి) ఒక్కో లీటరుకు రూ.56.58 నుంచి రూ.57.97గా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఇంటర్ పరీక్షలకు కేంద్రాలను ఇవ్వం

- ప్రయివేటు జూనియర్ కాలేజీల సమస్యలను పరిష్కరించాలి
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి : టీపీజేఎంఏ అధ్యక్షుడు గౌరి సతీశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు కేంద్రాలను ఇవ్వబోమని తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీజేఎంఏ) ప్రకటించింది. యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. గురువారం డీఐఈవోలను కలిసి వినతిపత్రాలను సమర్పిస్తామని వివరించింది. బుధవారం హైదరాబాద్‌లో టీపీజేఎంఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీపీజేఎంఏ అధ్యక్షులు గౌరి సతీశ్ మాట్లాడుతూ వచ్చేనెల మూడు నుంచి 22 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్‌ను జారీ చేసిందని వివరించారు. కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించకపోతే వాటిపై ఎలాంటి చర్యలను ఇంటర్ బోర్డు తీసుకోవడం లేదని విమర్శించారు. కానీ ప్రయివేటు జూనియర్ కాలేజీలపై పెత్తనం చెలాయిస్తున్నదని అన్నారు. సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేయాలంటూ అధికారులు ఆదేశాలను జారీ చేస్తున్నారని చెప్పారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే తమకు ఆర్థికంగా ఇబ్బంది కలుగుతుందన్నారు. తమ కాలేజీలను ప్రాక్టికల్, వార్షిక పరీక్షా కేంద్రాలుగా ఇవ్వొద్దని కోరారు. తమ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఎక్కడ కేంద్రం వేసినా అభ్యంతరం లేదన్నారు. తమకు 2014 నుంచి ఇప్పటి వరకు ట్యూషన్ ఫీజులను పెంచలేదని చెప్పారు. ఆ ఫీజును పెంచి బకాయిలతోసహా ఇప్పించేలా ఇంటర్ బోర్డు కార్యదర్శి చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ అధికారులు ప్రజాప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నందున ప్రయివేటు జూనియర్ కాలేజీల సమస్యలపై తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న ప్రయివేటు జూనియర్ కాలేజీలను కొనసాగించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ ప్రధాన కార్యదర్శి ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు ఎ వరదారెడ్డి, నాయకులు పార్థసారథి, శ్రీనివాస్, మల్లేష్, రవికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ (ఏఐ)తో ఇందిరమ్మ ఇండ్ల పథకం

- మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి : మంత్రి పొంగులేటి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అక్రమాలకు, అవినీతికి తావులేకుండా లబ్దిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేవరకూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) వాడుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక యాప్‌ను రూపొందించి సర్వే నిర్వహించామన్నారు. నిజమైన నిరుపేదలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు.

హుస్సేన్‌సాగర్ ఘటనపై మూడు రోజుల్లో వివరాలివ్వండి

- హైదరాబాద్ సీపీకి బీసీ కమిషన్ చైర్మెన్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హుస్సేన్‌సాగర్ బోటు ప్రమాద ఘటనపై మూడు రోజుల్లో పూర్తి వివరాలు అందించాలని బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు సీపీకి ఆయన బుధవారం లేఖ రాశారు. ఈ నెల 20న జరిగిన ఘటనలో ఇద్దరు మరణించగా, 10 మందికిపైగా క్షతగాత్రులైన సంగతి తెలిసిందే. ఘటనపై సుమోటోగా విచారణ చేపట్టిన కమిషన్ సీపీ సివి.ఆనంద్‌కు లేఖ రాసింది. అలాగే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన 15 కుటుంబాలను కుల పెద్దలు బహిష్కరించిన ఘటనపె కూడా చైర్మెన్ లేఖ రాశారు. మూడు రోజుల్లో వివరాలు అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారదను లేఖలో కోరారు.

Indo Global Agri Traders

Flat No. 702, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana

Form No. URC-2

Advertisement giving notice about registration under Part I of Chapter XXI of the Companies Act,2013

[Pursuant to section 374(b) of the companies Act, 2013 and rule 4(1) of the companies (Authorised to Register) Rules, 2014)

1. Notice is hereby given that in pursuance of sub-section (2) of section 366 of the Companies Act, 2013, an application is proposed to be made after fifteen days hereof but before the expiry of thirty days hereinafter to the Registrar of Companies at Hyderabad, Telangana that a Partnership firm 'Indo Global Agri Traders' having its place of business at Flat No.702, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana may be registered as Private Limited Company under Part I of Chapter XXI of the Companies Act 2013, as a Company limited by shares.
2. The principal objects of the Company are as follows:
a. Organic Farming through innovative agriculture methods and technologies, processing through integrated units, sale and distribution of agri products, other allied merchandise goods on wholesale basis.
b. Agri Logistics through establishment of integrated warehouses, cold storages, agri and food storage and delivery points.c. Agri and food wholesale trading, E-commerce solutions through B to B and B to C models.
3. A copy of the draft memorandum and articles of association of the proposed Company may be inspected at the office at Flat No.702, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana.
4. Notice is hereby given that any person objecting to this application may communicate their objection in writing to the Registrar at Central Registration Centre (CRC), Indian Institute of Corporate Affairs (IICA), Plot No.6,7,8, Sector 5, IMT Manesar, District Gurgaon (Haryana), Pin Code-122050, within twenty one days from the date of publication of this notice, with a copy to the Company at its registered office.

For Kisaan Parivar Limited Partner Sd/-xx Director | For Indo Global Agri Traders Sd/-xx Nanavat Bhupal Partner | Sd/-xx Gargee Biswas Partner

Dated this 30th day of January, 2025

NR Traders

Flat No.708, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana

Form No. URC-2

Advertisement giving notice about registration under Part I of Chapter XXI of the Companies Act, 2013

[Pursuant to section 374(b) of the companies Act, 2013 and rule 4(1) of the companies (Authorised to Register) Rules, 2014)

1. Notice is hereby given that in pursuance of sub-section (2) of section 366 of the Companies Act, 2013, an application is proposed to be made after fifteen days hereof but before the expiry of thirty days hereinafter to the Registrar of Companies at Hyderabad, Telangana that a Partnership firm 'NR Traders' having its place of business at Flat No.708, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana may be registered as Private Limited Company under Part I of Chapter XXI of the Companies Act 2013, as a Company limited by shares.
2. The principal objects of the Company are as follows:
a. Processing, sale and distribution of agri products both on wholesale and retail basis.b. Setting up of integrated warehouses, cold storages, agri and food delivery points as part of Logistics solutions for agri and all other allied merchandise.c. Facilitating transportation of goods either on its own or through Partnerships/JVs.
3. A copy of the draft memorandum and articles of association of the proposed Company may be inspected at the office at Flat No. 708, 7th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana.
4. Notice is hereby given that any person objecting to this application may communicate their objection in writing to the Registrar at Central Registration Centre (CRC), Indian Institute of Corporate Affairs (IICA), Plot No.6,7,8, Sector 5, IMT Manesar, District Gurgaon (Haryana), Pin Code-122050, within twenty one days from the date of publication of this notice, with a copy to the Company at its registered office.

For Kisaan Parivar Limited Partner Sd/-xx Director | For NR Traders Sd/-xx Nanavat Bhupal Partner | Sd/-xx Atluri Dhanunjaydu Partner

Dated this 30th day of January, 2025

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT2)
1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/32/2024 09-01-2025

Union Bank Of India
Versus
Vijay Building Solutions and Others

To
(CD 1) Vijay Building Solutions A Proprietary Concern Rep. By Its Proprietor, Mr. G. Vijay Srinath, Plot No.806, Road No.35, Jubilee Hills, Hyderabad, Telangana-500033
(CD 2) G. Vijay Srinath, S/o. G. Subba Rao, Aged: 36 Years, Occ: Business, R/o H.No 1-7-164/1/A, Sri Sai Nilayam, South Kamala Nagar, Ecil Post, Hyderabad-500062
(CD 3) Kamareddy Sai Chand, S/o K. Venkata, Rajen Goud, Aged: Major, Occ: Business, R/o. Plot No. 8, Bhavani Nagar, Sainakapur, Hyderabad, Telangana
(CD 4) Bandi Yadagiri Goud, S/o. Bandi Jangaiah, Goud, Aged: Major, Occ: Business, R/o 7-93/12, Bandi Sattaiah Nagar, Near Badi Garden, Peerza diguda, Rangareddi,Telangana

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2) in OA/381/2020 an amount of Rs 5556687.58 (Rupees Fifty Five Lakhs Fifty Six Thousands Six Hundred Eighty Seven And Paise Fifty Eight Only) along with pendentellite and future interest @ 11.10 % Simple Interest Yearly w.e.f. 06/10/2020 till realization and costs of Rs 132710 (Rupees One Lakh Thirty Two Thousands Seven Hundred Ten Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 17-02-2025 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date 09-01-2025

Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT2)

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)

బ్రాంచ్: ఇం.నెం. 3-4-174/6, మొదటి అంతస్తు, నాగిరెడ్డి కాంప్లెక్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పైన, పిల్లర్ నెం. 142, రాజేంద్రనగర్, రంగారెడ్డి-500048, ఇ-మెయిల్: rajendranagar@canfinhomes.com, మొబైల్ నెం.: 9731451292

స్వాధీనత నోటీసు [రూల్ 8(1)] [స్థిరాస్తి కొరకు]

ఏదైతే, దిగువ సంతకందారుడు అయిన కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సదరు చట్టం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ 21-11-2024 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. పిలువబడిన రుణగ్రహీతలు శ్రీ/శ్రీమతి శశిరాజు కళ్యాణి (భర్త లేట్ శశిరాజు శంకరచారి) మరియు ఇతర చట్టబద్ధ వారసులందరు నోటీసులో పేర్కొన్న మొత్తం రూ.25,91,085/- (రూపాయలు ఇరవై ఐదు లక్షల తొంభై ఒక్క వేల ఎనభై ఐదు మాత్రమే) రియలైజేషన్ తేది వరకు ఒప్పందం రేటు వద్ద తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని తెలుపడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా అధీకృత అధికారి అతనికి అందించిన అధికారాలను అధ్యయనం చేస్తూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తిని 24, జనవరి 2025న తేదీన దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను ఆహ్వానించడమైనది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో సిహెచ్ఎఫ్ఎల్ కు రూ.25,91,085/- (రూపాయలు ఇరవై ఐదు లక్షల తొంభై ఒక్క వేల ఎనభై ఐదు మాత్రమే) దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

స్థిరాస్తి యొక్క వివరణ:

తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మండలం, రాంపల్లి శివారు, లాలన్‌గూడ వద్ద సర్వే నెం. 103 మరియు 121లోని 300 చ.గ.లలో 150 చ.గ.ల విస్తీర్ణంలోని ప్లాట్ నెం. 106 దక్షిణ భాగం యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం. 106 ఉత్తర భాగం, దక్షిణం: ప్లాట్ నెం. 93, తూర్పు: 30 వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 105.

తేది: 24-01-2025, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Sailaja Sree Traders

Flat No.1002,10th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana

Form No. URC-2

Advertisement giving notice about registration under Part I of Chapter XXI of the Companies Act, 2013

[Pursuant to section 374(b) of the companies Act, 2013 and rule 4(1) of the companies (Authorised to Register) Rules, 2014]

1. Notice is hereby given that in pursuance of sub-section (2) of section 366 of the Companies Act, 2013, an application is proposed to be made after fifteen days hereof but before the expiry of thirty days hereinafter to the Registrar of Companies at Hyderabad, Telangana that a Partnership firm 'Sailaja Sree Traders' having its place of business at Flat No.1002,10th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana may be registered as Private Limited Company under Part I of Chapter XXI of the Companies Act 2013, as a Company limited by shares.
2. The principal objects of the Company are as follows:
a. Establishment of Retail Marts, Franchise Stores for sale and distribution of organic agri products, other allied products and all other merchandise including groceries, spices, fruits and vegetables.
b. Setting up of Stores for wholesale trading on B to B and B to C as well either on its own or through Partnerships/JVs.
3. A copy of the draft memorandum and articles of association of the proposed Company may be inspected at the office at Flat No.1002, 10th Floor, B-Block Commercial, Asian Sun City, behind Sarath City Capital Mall, Kondapur, Hyderabad-500084, Telangana.
4. Notice is hereby given that any person objecting to this application may communicate their objection in writing to the Registrar at Central Registration Centre (CRC), Indian Institute of Corporate Affairs (IICA), Plot No.6,7,8, Sector 5, IMT Manesar, District Gurgaon (Haryana), Pin Code-122050, within twenty one days from the date of publication of this notice, with a copy to the Company at its registered office.

For Kisaan Parivar Limited Partner Sd/-xx Director | For Sailaja Sree Traders Sd/-xx Nanavat Bhupal Partner | Sd/-xx Meniga Diksharani Partner

Dated this 30th day of January, 2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం (ఆర్ & బి) సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIT No. 32/2024-25/EE/PA to EE/D2/DB/SBD/166 ., తేది : 28-01-2025

పని యొక్క పేరు 1 [illegible] సివిల్ మరియు పారిశుద్ధ్య మరమ్మతు పనులు, న్యాయవిహార్ కాంప్లెక్స్‌లోని [illegible] క్వార్టర్‌లో, జూబ్లీహిల్స్, హైదరాబాద్, గౌరవనీయ సి.జస్టిస్ [illegible] యొక్క అధికారిక నివాసానికి అటాచ్ చేయబడినది (టర్న్ కీ) 6వ పిలుపు ఇ.ఎం.డి రూ.62,907.00 ఇఎండి రూ.629.00 డౌన్‌లోడ్ ప్రారంభ తేది నుంచి 28-01-2025 నుంచి సా.04.00 గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం 31-01-2025 వరకు సా.04.00 గం. బిడ్ తెరిచే తేది మరియు సమయం 31-01-2025 నుంచి సా.04.15 గం. తర్వాత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) పేరు మరియు చిరునామా శ్రీ.ఎ.వి. విశ్వకుమార్ బి.టెక్, ఇ/సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్ తదుపరి వివరాలను 'ఇ-ప్రొక్యూర్‌మెంట్' మార్కెట్ ప్రదేశం https://tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O.No.9787-PP/CL/ADVT/1/2024-25, Dt: 29.01.2025

OIL COUNTRY TUBULAR LIMITED
(CIN: L26932TG1985PLC005329)
"KAMINENI', 3RD FLOOR, KING KOTI, HYDERABAD-500001

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకు అడిట్‌చేయని ఆర్థిక ఫలితాల నివేదిక (రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిదినెలలు	ముగిసిన సం.
	31-12-2024	30-09-2024	31-12-2023	31-12-2024	31-03-2024
	అడిట్‌చేయనివి	అడిట్‌చేయనివి	అడిట్‌చేయనివి	అడిట్‌చేయనివి	అడిట్‌చేసినవి
ఆపరేషన్‌ల నుండి మొత్తం ఆదాయం	4,195.77	2,305.67	606.59	9,037.60	1969.03
పన్ను తరువాత సాధారణ కార్యకలాపాల నుండి నికర లాభం/(నష్టం)	164.37	(1315.71)	(1802.21)	(2131.97)	(7044.78)
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (అసాధారణ ఐటంల తరువాత)	267.18	(993.41)	(1802.21)	(1407.43)	(4610.79)
ఈక్విటీ వాటా మూలధనం	4428.95	4428.95	4428.95	4428.95	4428.95
రిజర్వులు (రివాల్యుయేషన్ రిజర్వులు మినహా)	1261.13	(6521.82)	210.27	(5356.70)	(7178.04)
వాటా ఒక్కింటికి రాబడి:					
బేసిక్ మరియు డైల్యూటెడ్ అసాధారణ ఐటంల ముందు	0.37	(2.97)	(3.65)	(4.81)	(15.91)
బేసిక్ మరియు డైల్యూటెడ్ అసాధారణ ఐటంల తరువాత	0.37	(2.97)	(3.65)	(4.81)	(15.91)

గమనిక: 1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజిలతో దాఖలుచేసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనాకు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీల వెబ్‌సైట్లు: www.nseindia.com మరియు www.bseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.octlindia.com పై అందుబాటులో ఉన్నాయి. 2) పూర్తి ఆదాయం రూ.9037.60 లక్షలలో రూ.8856.89 లక్షల ఆపరేషనల్ ఆదాయంతోకలిపి వాంటి మరియు ఇతర ఆదాయం రూ.180.71 లక్షలు. 3) ముగిసిన తొమ్మిది నెలలకు EDITDA రూ.3,262.74 లక్షలు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 29 జనవరి, 2025

సం/- కె.సూర్యనారాయణ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

ZENOTECH LABORATORIES LIMITED
CIN: L27100TG1989PLC010122
Survey No.250-252, Turkapally (V), Shameerpet (M), Hyderabad - 500078
Phone : +91 90320 44584/585/586 Website : www.zenotechlab.com

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి స్టాండ్‌అలోన్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.లక్షల్లో, షేర్ మినహా మరియు ఈక్విటీ షేర్ డేటా ప్రకారం)

వివరాలు	ముగిసిన త్రైమాసికం			తొమ్మిది నెలలకు		ముగిసిన సంవత్సరం
	31.12.2024 అడిట్‌చేయనివి	30.09.2024 అడిట్‌చేయనివి	31.12.2023 అడిట్‌చేయనివి	31.12.2024 అడిట్‌చేయనివి	31.12.2023 అడిట్‌చేయనివి	31.03.2024 అడిట్‌చేసినవి
కార్యకలపాల నుండి పూర్తి ఆదాయం (నికర)	1,161.38	1,010.82	1,122.69	3,197.16	3,240.37	4,183.72
మినహాయింపుగల ఐటెంలు మరియుపన్నుకు ముందు నికర లాభం/(నష్టం)	248.52	100.25	380.35	553.32	976.89	1,114.14
మినహాయింపుగల ఐటెంలు	62.40	134.80	-	197.20	-	-
మినహాయింపుగల ఐటెంలు మరియు పన్ను తరువాత నికర లాభం/(నష్టం)	169.28	134.74	336.05	432.99	763.93	829.87
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (పన్ను తరువాత కాలవ్యవధి కొరకు లాభం/(నష్టం) కలిగివున్నది మరియు పన్ను తరువాత ఇతర సమగ్ర ఆదాయం)	168.60	134.06	337.07	430.95	766.55	827.15
చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	6,103.06	6,103.06	6,103.06	6,103.06	6,103.06	6,103.06
గత సంవత్సరపు ఆడిట్‌చేసిన బ్యాలెన్స్‌షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివాల్యుయేషన్ రిజర్వు మినహాయించి)	-	-	-	-	-	2,951.10
వాటా ఒక్కింటికి రాబడి/(నష్టం) (బేసిక్ & డైల్యూటెడ్) (ముఖ విలువ వాటా ఒక్కింటికి రూ.10/-)	0.28	0.22	0.55	0.71	1.25	1.36

గమనికలు:
1. పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 28 జనవరి, 2025న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
2. ఇండియాలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్ విధానాలు మరియుఅందులో జారీచేసిన సంబంధిత రూల్స్‌తో చదవగల కంపెనీల చట్టం, 2013లోనిసెక్షన్ 133 క్రింద నిర్దేశించిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ ("ఐఎన్‌డి ఏఎస్")ను అనుసరించి ఈ ఆర్థిక ఫలితాలు సిద్ధం చేయబడినవి.
3. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్‌రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజితో దాఖలుచేయబడిన ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివ[illegible] (www.bseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: (www.zenotechlab.com) [illegible] క్యూఆర్ కోడ్ స్కాన్‌చేయుట [illegible]

ప్రదేశం: ముంబయి
తేది: 28 జనవరి, 2025

By order of the Board
for Zenotech Laboratories Limited
Sd/-
Chairman of the Board meeting
Dr. Azadar Husain Khan
DIN: 01219312

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్
(CIN: L34100TG2000PLC035451)
రిజిస్టర్డ్ ఆఫీస్ : ఎస్-22, 3వ అంతస్తు, టెక్నోక్రాట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, బాలానగర్, హైదరాబాద్- 500037, తెలంగాణ
Tel:040-46989999, Email ID: Info@olectra.com - www.olectra.com

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (మొత్తాలు భారతీయ రూపాయలు లక్షల్లో)

Standalone (స్టాండ్‌అలోన్):

క్ర.సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2024 (అడిట్‌చేయనివి)	30.09.2024 (అడిట్‌చేయనివి)	31.12.2023 (అడిట్‌చేయనివి)	ముగిసిన తొమ్మిది నెలలకు 31.12.2024 (అడిట్‌చేయనివి)	31.12.2023 (అడిట్‌చేయనివి)	ముగిసినసంవత్సరం 31.03.2024 (అడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	50,683.45	51,407.28	33,194.86	132,508.95	83,583.72	111,397.16
2	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	6,087.26	6,496.64	2,992.12	15,392.82	8,283.01	9,870.61
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు అసాధారణ ఐటెంల తరువాత)	6,087.26	6,496.64	2,992.12	15,392.82	8,283.01	9,870.61
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటం తరువాత)	4,630.57	4,819.85	2,228.12	11,524.63	6,196.46	7,384.28
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు (సమీకృత లాభం/(నష్టం))(పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	4,630.57	4,819.85	2,228.12	11,524.63	6,196.46	7,382.21
6	ఈక్విటీ వాటా మూలధనం	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23
7	ఇతర ఈక్విటీ	-	-	-	-	-	88,633.34
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.4/- చొప్పున) (కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) బేసిక్:	5.64	5.87	2.71	14.04	7.55	8.97
	డైల్యూటెడ్:	5.64	5.87	2.71	14.04	7.55	8.97

Consolidated (కన్సాలిడేటెడ్):

క్ర.సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2024 (అడిట్‌చేయనివి)	30.09.2024 (అడిట్‌చేయనివి)	31.12.2023 (అడిట్‌చేయనివి)	ముగిసిన తొమ్మిది నెలలకు 31.12.2024 (అడిట్‌చేయనివి)	31.12.2023 (అడిట్‌చేయనివి)	ముగిసినసంవత్సరం 31.03.2024 (అడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	51,536.64	52,367.48	34,214.12	135,297.79	86,532.52	115,413.54
2	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	6,195.28	6,482.81	3,383.70	15,862.97	8,566.57	10,577.76
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు అసాధారణ ఐటెంల తరువాత)	6,195.28	6,482.81	3,383.70	15,862.97	8,566.57	10,577.76
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటం తరువాత)	4,661.71	4,765.29	2,711.16	11,852.32	6,376.32	7,865.42
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు (సమీకృత లాభం/(నష్టం))(పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	4,661.71	4,765.29	2,711.16	11,852.32	6,376.32	7,883.35
6	ఈక్విటీ వాటా మూలధనం	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23	3,283.23
7	ఇతర ఈక్విటీ	-	-	-	-	-	88,064.53
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.4/- చొప్పున) (కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) బేసిక్:	5.64	5.79	3.29	14.36	7.69	9.36
	డైల్యూటెడ్:	5.64	5.79	3.29	14.36	7.69	9.36

గమనికలు: సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజిలతో దాఖలుచేయబడిన అడిట్‌చేయని త్రైమాసికం ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశంపై విధంగా ఉన్నది. అడిట్‌చేయని త్రైమాసికం ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజి(ల) వెబ్‌సైట్: www.bseindia.com మరియు www.nseindia.com మరియు లిస్టెడ్ ఎంటిటీ: (www.olectra.com) పై అందుబాటులో ఉంటాయి. ఈ సమాచారాన్ని దిగువ కల్పించిన క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్‌చేయుట ద్వారా పొందవచ్చును.

తేది: 29 జనవరి, 2025
ప్రదేశం: హైదరాబాద్

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ కొరకు
సం/-
పి.హనుమాన్ ప్రసాద్
కంపెనీ సెక్రటరీ

---

pnb Housing Finance Limited Ghar Ki Baat

కార్పొరేట్ కార్యాలయం : 9వ ఫ్లోర్, అంత్రిక్ష భవన్, 22, కెజి మార్గ్, న్యూఢిల్లీ-110001.
PHONES : 011-23357171, 23357172, 23705414 WEBSITE:-www.pnbhousing.com
బ్రాంచ్ ఆఫీసు: 4వ అంతస్తు, [illegible] రోడ్ నెం.2, బంజారా హిల్స్, హైదరాబాద్-500034

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

[illegible]

తేది: 30-01-2025, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

డిమాండ్ నోటీసు

[illegible]

LAN: AP/KPL/KMPL/A000000095

తేది:30-01-2025, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT HYDERABAD
O.S. NO. 2078 OF 2023

Between:-
M/s ICICI BANK LIMITED
A body corporate, Incorporated and registered under the Indian Companies Act, 1956 and licensed as a Bank under the Banking Regulation Act, 1949 and having its registered Office at "Landmark", Race Course Circle, Vadodara- 390007 and having one of its office at ICICI Bank Ltd., Regional Processing Center, Sriram Towers, 3th Floor, Opp. Shadan College, Khairatabad, Hyderabad- 500004, ...Plaintiff
And
Shekar Goud Kommagoni ...Defendant

To,
Shekar Goud Kommagoni,
R/o. 12-13-536/11, 1st Flr, Mallareddy Nilayam, Nagarjuna Nagar, Tarnaka, Hyderabad-500007.

Take Notice that the above suit is filed against you for recovery of money. Take notice that the matter is posted on 14.02.2025 for your appearance. You are hereby informed to appear in the Court at 10:30 AM on that day either in person or through your counsel. Failing which the matter would be decided in your absence and will be heard ex-parte.

(By order of the Court)
C. V. Srinath
Advocate
Office No 403 & 404,
LEGEND COMMERCIAL COMPLEX,
BARKATPURA, HYDE-27

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Bank

బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో చెప్పబడిన నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

[illegible]

క్ర.సం.	రుణగ్రహీత(ల) పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/ భౌతిక స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	[illegible] LBHYD00006115428	[illegible]	08/02/2024 రూ. 25,46,900.00/-	హైదరాబాద్

[illegible]

తేది: జనవరి 30, 2025
ప్రదేశం: హైదరాబాద్.

సంతకం/-, అధీకృత సంతకందారు, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.





కుంభమేళాలో తొక్కిసలాట

30 మంది మృతి...90 మందికిపైగా గాయాలు

మౌనీ అమావాస్య సందర్భంగా కోట్లాదిగా భక్తుల రాక

(మొదటిపేజీ తరువాయి)

1-2 గంటల మధ్య ఈ ఘటన జరిగిందని చెప్పారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత, వీఐపీ సంస్కృతి కారణంగానే తొక్కిసలాట జరిగిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి, రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరాయి. తొక్కిసలాట జరిగిన తర్వాత కొందరు పీఠాధిపతులు, అఖారాలు త్రివేణీ సంగమానికి వచ్చి అమృత స్నానాలు ఆచరించారు. ఆ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున స్నానాలకు రావడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. కొందరు కింద పడిపోయారని, పరుగులు పెడుతున్న వారి పాదాల కింద నలిగిపోయారని చెప్పారు. పరిస్థితి అదుపు తప్పిందని, తప్పించుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని, అన్ని వైపుల నుంచి ప్రజలు తోసుకుంటూ వచ్చారని వివరించారు. పుణ్య స్నానాలు ఆచరించే తొందరలో కొందరు భక్తులు బారికేడ్లపై నుంచి దూకేందుకు ప్రయత్నించి తీవ్రంగా గాయ పడ్డారని అన్నారు. 'పలు చోట్ల తొక్కిసలాటలు జరిగాయి. కనీసం 200 మంది గాయపడ్డారు. యాభై మంది వరకూ చనిపోయి ఉండవచ్చు. నేను నా కండ్లతో వారిని చూశాను' అని ఘటనా స్థలంలో ఉన్న ఓ పారామిలటరీ అధికారి చెప్పారు. 'ప్రజలు భారీగా రావడంతో ఇవాళ స్నానాలు ఆచరించరాదని అఖారా పరిషత్, ఆచార్యులు నిర్ణయించారు. సామాన్య ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. దానికి అనుగుణంగా పుణ్య స్నానాలు ఆచరించకుండా ఉండేందుకు అఖారాలు అంగీకరించారు.

వసంత పంచమి రోజు పుణ్య స్నానాలు చేస్తాం' అని నిరంజని అఖారా అధిపతి కైలాసానంద గిరి మహరాజ్ చెప్పారు.

అధికార యంత్రాంగం సామాన్య భక్తులను పట్టించుకోకుండా వీఐపీల సేవలో తరించడం వల్లనే తొక్కిసలాట జరిగిందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'కుంభమేళాకు ఇంకా చాలా సమయం ఉంది. అనేక మహా స్నానాలు ఆచరించాల్సి ఉంది. ఈ రోజు జరిగిన విషాద ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దాలి. వీఐపీ సంస్కృతికి స్వస్తి చెప్పి సామాన్య భక్తుల అవసరాలు తీర్చాలి' అని ఆయన సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళ తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ సర్కారు ఆదుకోవాలనీ, గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తరపున అవసరమైన సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కుంభమేళకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున వచ్చే అవకాశమున్న నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఘటన కలిచివేసింది : మాజీ మంత్రి టి.హరీశ్‌రావు

ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళలో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో ప్రజలు ప్రానాలు కోల్పోయిన ఘటన కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం, యూపీ సర్కారు ఆదుకోవాలని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఏకపక్ష ఆమోదం

రాజ్యాంగ విరుద్ధం : ప్రతిపక్ష ఎంపీలు

రేపు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నివేదిక అందజేత



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముసాయిదా నివేదికను ఏకపక్షంగా ఆమోదించింది. బుధవారం పార్లమెంట్‌లో జేపీసీ సమావేశం జరిగింది. జేపీసీ తన 655 పేజీల నివేదిక.. వక్ఫ్‌సవరణ బిల్లుకు అనుకూలంగా 15 మంది ఓట్లు వేయగా, వ్యతిరేకంగా 11 మంది ఓట్లు వేశారు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, శివసేన, ఎంఐఎంతో సహా ప్యానెల్‌లోని ప్రతిపక్ష ఎంపీలు తమ అసమ్మతి నోట్లను సమర్పించారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపాదిత మార్పులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం "ముస్లింల మత విశ్వాసాన్ని దెబ్బతీశాయి" అని పేర్కొన్నారు. ముస్లింల మతపరమైన విషయాల్లో ప్రభుత్వ జోక్యాన్ని అనుమతించడంతో వక్ఫ్ బోర్డును నాశనం చేస్తుందని పేర్కొన్నారు. తుది నివేదికను సమీక్షించేందుకు తమకు తక్కువ సమయం కేటాయించారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. అలాగే ఆమోద ప్రక్రియను కూడా విమర్శించారు. ఈ ప్రక్రియ "ప్రజాస్వామ్య విరుద్ధం" అని పేర్కొన్న శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ విమర్శించారు. టీఎంసీ ఎంపీలు కళ్యాణ్ బెనర్జీ, నడిముల్ హక్, డీఎంకే ఎంపీ ఎ. రాజా, ఆప్ నేత సంజయ్ సింగ్, శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ అధికారికంగా తమ అసమ్మతిని సమర్పించారు. అలాగే ఈ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తామని, అలాగే సుప్రీం కోర్టుకు కూడా వెళ్తామని ప్రతిపక్ష సభ్యులు తెలిపారు. జేపీసీ తన నివేదికను, ప్రతిపాదిత చట్టం సవరణలను మెజారిటీ ఓటుతో ఆమోదించిందని ప్యానెల్ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ తెలిపారు. సవరించిన బిల్లును నేడు (గురువారం) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేస్తానన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వక్ఫ్ బోర్డు తన పనిని పారదర్శకంగా, సమర్థవంతంగా చేసేందుకు దోహదపడుతుందన్నారు.

స్థానిక పోరుకు సర్కారు సన్నద్ధం

'పది' పరీక్షల కంటే ముందే ఎన్నికలు నిర్వహించే యోచన

- ఫిబ్రవరి ఐదో తేదీన క్యాబినెట్ !
- మంత్రి మండలి సమావేశంలో స్పష్టత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా, ఆతృతగా ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి రంగం సిద్ధం చేయాలంటూ ముఖ్యమంత్రి నుంచి సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. ఇటీవల రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ఆ మేరకు గ్రామసభల్లో అర్హుల జాబితాలను కూడా ప్రకటిస్తున్నది. ఇవన్నీ నిరంతరం అమలయ్యే పథకాలు కాబట్టి లబ్దిదారులు ఎలాంటి ఆందోళన పడకుండా ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు అంటూ ప్రభుత్వం చెబుతున్నది. ఇవన్నీ ప్రస్తుతం తమకు సానుకూల అంశాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. అందివచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని గ్రామసీమల్లో పాగా వేయాలని కాంగ్రెస్ వ్యూహం పనున్నతున్నది. కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపిస్తే ఇప్పుడు పథకాలు అందని వారికి ఎన్నికల అనంతరం చేరేలా చూస్తామంటూ హామీనివ్వబోతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలను ప్రారంభించినట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ ఎన్నికలను కూడా మార్చి రెండు, మూడు వారాల్లోనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. అయితే, మార్చి నెలలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఉండటం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయనే సూచనలు కూడా అధికారుల నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యే మార్చి 21 వ తేదీ లోపే మూడు దశలో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వేసవిలో ఎన్నికలకు వెళ్తే మరిన్ని ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయనే ఆలోచనలో సర్కారున్నది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనకు సంబంధించిన తుది రిపోర్టు ఒకటెండ్రు రోజుల్లో క్యాబినెట్ సబ్‌కమిటీకి చేరనున్నది. ఆ తర్వాత ఫిబ్రవరి ఐదో తేదీన క్యాబినెట్ సమావేశం జరిగే అవకాశముందని ప్రచారం జరుగుతున్నది. అందులో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, బీసీ రిజర్వేషన్ల అమలు ఈ ఎన్నికల్లో తమకు సానుకూలాంశాలుగా మారనున్నాయని సీఎం భావిస్తున్నారు. ఏదిఏమైనా త్వరలో జరుగబోయే క్యాబినెట్ సమావేశంలో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశముంది.

టెన్త్ విద్యార్థులకు స్నాక్స్

- ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం
- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు మోడల్ స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మార్చి 20 వరకు 38 రోజులపాటు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తామని తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున చెల్లిస్తామని పేర్కొన్నారు. ఉడకబెట్టిన పెసర్లు, పల్లి బెల్లం, మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిగడ్డ పకోడి, ఉడకబెట్టిన శనగలు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు, జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈవో) తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నర్సిరెడ్డి, అశోక్‌కుమార్

గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ విజ్ఞప్తి

డబ్బులతో ఉపాధ్యాయులను కొనేందుకు వస్తున్న కార్పొరేట్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అలుగుబెల్లి నర్సిరెడ్డి, వై అశోక్ కుమార్ బరిలో నిలుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్), తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీలు ప్రకటించాయి. వచ్చేనెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు వై అశోక్ కుమార్‌ను గెలిపించాలని కోరాయి. బుధవారం హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రెండు సంఘాలు ఉమ్మడిగా విలేకర్ల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, ఎన్ తిరుపతి మాట్లాడుతూ నర్సిరెడ్డి, అశోక్‌కుమార్ ఇద్దరూ మూడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేశారని చెప్పారు. నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించారని గుర్తు చేశారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉందన్నారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని వివరించారు. ప్రభుత్వాలు అనుసరించిన ఉపాధ్యాయ వ్యతిరేక వైఖరిని ధైర్యంగా ప్రశ్నించారని అన్నారు. 2019 మార్చిలో నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్సిరెడ్డి గత ఆరేండ్లుగా ఆదర్శవంతమైన పనితీరును కనబరిచారని వివరించారు. ఆయనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను పూర్తిగా పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి కోసమే కేటాయించారని గుర్తు చేశారు. నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. వై అశోక్ కుమార్ టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీజేఏసీ నాయకునిగా కోదండరామ్‌తో కలిసి పనిచేశారని అన్నారు. సామాజిక స్పృహ కలిగిన ఇద్దరు అభ్యర్థులకు టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాలతోపాటు పలు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. ఉపాధ్యాయ, అధ్యాపకులు సంఘాలు, అనుబంధాలతో నిమిత్తం లేకుండా, ఏ విధమైన ప్రలోభాలకు గురికాకుండా, విలువలకు కట్టుబడి పని చేస్తున్న నర్సిరెడ్డి, అశోక్‌కుమార్‌ను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కొనేందుకు కార్పొరేట్, రియల్ వ్యాపారులతో డబ్బులతో వస్తున్నారని అన్నారు. జాగ్రత్తగా ఉండాలనీ, విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటుపడే వారిని గెలిపించాలని సూచించారు.

ఉపాధ్యాయుల గొంతుకగా పనిచేశాను : నర్సిరెడ్డి

టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్‌తోపాటు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘాలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా మద్దతు ఇచ్చారని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆరేండ్లుగా తన పనిని గమనించారని చెప్పారు. ఉపాధ్యాయుల గొంతుకగా పనిచేశానని వివరించారు. మరోసారి అవకాశమివ్వాలనీ, ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వం అనేక నిర్బంధాలను ప్రయోగించిందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం నడకయాత్ర చేశానని గుర్తు చేశారు. టెట్ సమస్యను పరిష్కరించాలని ఎన్‌సీటీఈ చైర్మెన్‌ను కలిశామన్నారు. దీంతో 20 వేలకుపైగా ఉపాధ్యాయులు పదోన్నతులు వచ్చాయనీ, 35 వేలకుపైగా బదిలీలు జరిగాయని వివరించారు. గురుకులాల్లో పదోన్నతులు, బదిలీలు జరిగాయని అన్నారు. మోడల్ స్కూళ్లలో బదిలీలు చేపట్టారని చెప్పారు. పారిశుధ్య కార్మికుల కోసం మూడేండ్లపాటు పోరాటం చేసిన ఫలితంగా నిర్వహణ గ్రాంట్‌ను ప్రభుత్వం ఇస్తున్నదని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలనీ, తరగతికొక గది, టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యకు 15 నిధులు కేటాయించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని చెప్పారు.

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్ కుమార్ మాట్లాడుతూ కామన్ స్కూల్ విద్యావిధానం కావాలని అన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గురుకులాల్లో అన్నింటికీ ఒకే సమయపాలన ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయుల గొంతుకగా ఉండేవారిని గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు కె జంగయ్య, ఎ సింహాచలం, జి తిరుపతిరెడ్డి, ఎం రవీందర్, ఎం లక్ష్మయ్య, డి రాజయ్య, ఎస్ విజయ్, ఎం ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడక 'కవచ్'

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన

ఆర్ అండ్ డీకి అరకొర నిధులపై నిలదీత

సిగ్నలింగ్ వ్యవస్థను విస్తరించాలని సూచన

ఎల్‌హెచ్‌బీ బోగీల తయారీని పెంచాలని సిఫారసు



న్యూఢిల్లీ : దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఆటోమేటిక్ ట్రాఫిక్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ లేదా కవచ్ పనితీరుపై ఇండియన్ రైల్వేస్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పరిశోధన, అభివృద్ధి విషయంలో కూడా లోపభూయిష్ట వైఖరినే అవలంబిస్తున్నారని తప్పుపట్టింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేష్ నేతృత్వంలో ఏర్పడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గత నెలలో పార్లమెంటుకు నివేదిక అందజేసింది. రైల్వేలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) నిమిత్తం 2024-25 బడ్జెట్‌లో కేవలం రూ.72.01 కోట్లు మాత్రమే కేటాయించారని నివేదిక ఎత్తిచూపింది. గత రెండు సంవత్సరాల కాలంలో కేటాయించిన నిధులను సైతం వినియోగించుకోలేకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయమని తెలిపింది.

పరిశోధన, అభివృద్ధి కోసం 2022-23లో రూ.107 కోట్లు కేటాయించగా సవరించిన అంచనాల ప్రకారం కేవలం రూ.39.12 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. 2023-24లో కూడా రూ.66.52 కోట్లు కేటాయిస్తే వాస్తవంగా ఖర్చు చేసింది రూ.28.34 కోట్లే. రైల్వేల ఆధునీకరణకు అభివృద్ధి, పరిశోధనలు దీర్ఘకాల పెట్టుబడి వంటివని, కాబట్టి వాటిపై రైల్వే శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని కమిటీ సూచించింది. కవచ్ సంబంధ పనులను సత్వరమే వేగవంతం చేయాల్సి ఉన్నదని, దేశవ్యాప్తంగా దీనిని వర్తింపజేయాలని అభిప్రాయపడింది. రైల్వేలో భద్రతను పెంచడంలో కవచ్ కీలక పాత్ర పోషిస్తుందని అంటూ అయితే దాని విస్తరణ నత్తనడక నడుస్తుండడంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది.

భారతీయ రైల్వేల తొలి ప్రాధాన్యత భద్రతేనని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలను ప్రస్తావించింది. 6,605 స్టేషన్లలో (99.4 శాతం బ్రాడ్ గేజ్ రైల్వే స్టేషన్లు) ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేస్తోందని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.4,647.28 కోట్లతో బడ్జెట్ అంచనాలు రూపొందించారని, గత సంవత్సరంలో చేసిన వ్యయంతో పోలిస్తే ఇది రూ.896 కోట్లు అధికమని వివరించింది. బ్రాడ్ గేజ్, ఇతర గేజ్ మార్గాల్లో ఉన్న మిగిలిన రైల్వే స్టేషన్లలో కూడా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. భద్రత, సౌకర్యం కోసం ఐసీఎఫ్ బోగీల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌బీ బోగీలను సిద్ధం చేసుకోవాలని సిఫారసు చేసింది.

రైల్వే శాఖ 2018 నుండే ఎల్‌హెచ్‌బీ బోగీలను తయారు చేస్తోంది. అయితే దీనికి బడ్జెట్ కేటాయింపులు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.54,113.78 కోట్లు కేటాయించారు. గత సంవత్సరంలో పెట్టిన ఖర్చు కంటే ఇది కేవలం రూ.156 కోట్లు మాత్రమే ఎక్కువ. 2023-24లో బోగీల తయారీ కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదని కమిటీ ఎత్తిచూపింది. గత సంవత్సరం మార్చి నాటికి 35,700 ఎల్‌హెచ్‌బీ బోగీలను తయారు చేయగా ప్రయాణికుల కోసం 31,670 బోగీలను ఉపయోగించారు.

కవచ్‌ను ఇప్పటి వరకూ దక్షిణ మధ్య రైల్వేలోని 1,465 రూట్ కిలోమీటర్లు, నార్త్ సెంట్రల్ రైల్వేలోని 80 రూట్ కిలోమీటర్లలో అమలు చేస్తున్నారు. ఢిల్లీ-చెన్నయ్, ముంబయి-చెన్నై సహా ఇతర ముఖ్యమైన కారిడార్లలో ఈ వ్యవస్థ ఏర్పాటు కోసం టెండర్లను ఆహ్వానించారు.

11ఏండ్లు.. 485 ప్రమాదాలు

మానవ తప్పిదాలే కారణం

రైలు ప్రమాదాలపై బోర్డ్ సర్క్యులర్

మోడీ సర్కార్ నిర్లక్ష్యమంటున్న రైల్వేశాఖ మాజీ ఉన్నతాధికారులు



న్యూఢిల్లీ : ట్రాఫిక్ విభాగంలో చోటుచేసుకుంటున్న మానవ తప్పిదాల కారణంగానే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని రైల్వే బోర్డ్ అభిప్రాయపడింది. గడచిన 11 సంవత్సరాల కాలంలో కేవలం ఇలాంటి తప్పిదాల కారణంగా 485 రైలు ప్రమాదాలు జరిగాయని తెలిపింది. ఇందుకు జోనల్ రైల్వేలే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఈ నెల 24న జారీ చేసిన సర్క్యులర్‌లో రైల్వే బోర్డ్ సభ్యుడు హితేంద్ర మల్హోత్రా ఈ విషయాలను ప్రస్తావించారు. సాధారణంగా ప్రమాదాలకు కారణమవుతున్న మానవ సంబంధమైన అంశాలను ఆయన అందులో వివరిస్తూ వాటి నివారణకు సరైన చర్యలు చేపట్టాలని సూచించారు.

2014 నుంచి భారతీయ రైల్వేలో పట్టాలు తప్పిన 224 ఘటనలు జరిగాయని మల్హోత్రా తన సర్క్యులర్‌లో తెలిపారు. పాయింట్, రూట్‌ను సరిగా నిర్ణయించకపోవడమే దీనికి కారణమని చెప్పారు. షంటింగ్ నిబంధనలను సిబ్బంది పట్టించుకోకపోవడం, బ్లాక్ రూల్‌ను ఉల్లంఘించడం కూడా ప్రమాదాలకు కారణమేనని తెలియజేశారు. సమయాన్ని ఆదా చేసేందుకు అధికారులు, సిబ్బంది షంటింగ్ సమయంలో దగ్గరి దారులు వెతుకుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఇది ఓ అలవాటుగా మారిపోయిందని అంటూ షంటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాల్సిందిగా సిబ్బందిపై ఒత్తిడి తేరాదని సూచించారు. రైళ్లు పట్టాలు తప్పడానికి, ఒక దానినొకటి ఢీకొనడానికి విధానపరమైన వైఫల్యాలు కారణమవుతున్నాయని తెలిపారు. వాస్తవానికి మోడీ సర్కార్ నిర్లక్ష్యమేనంటూ రైల్వేశాఖ మాజీ అధికారులు చెబుతున్నారు.

సంపాదకీయం

ఎంతకాలమీదాటవేత?

గతంలో ఎవరైనా ఒక కోర్కెల పత్రమిస్తే అన్నాదురై (చూద్దాం) అనేవారట! అంటే అంతే సంగతులన్నమాట! జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామంటూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పటం చూస్తే అలానే ఉంది. ఆ తగిన సమయం ఎప్పుడొస్తుందో అని చొంగకార్చుకుంటూ ఎదురుచూడాలా? ఇటీవల శ్రీనగర్ వెళ్లి జెడ్ సొరంగ మార్గాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞాపనను విలేకరులు ప్రస్తావించగా, మోడీ చేసిన ఈ వ్యాఖ్యలో చిత్తశుద్ధి కనపడలేదు. ఆ తగిన సమయమేమిటో, ఎప్పుడొస్తుందో అన్నది పెద్ద ప్రశ్నార్థకం. 'మోడీ మాట ఇచ్చాడంటే తప్పడు' అంటూ ఆ సమయంలో తనకు తాను కితాబు ఇచ్చుకున్న ప్రధాని - గతంలో మాట ఇచ్చి తప్పిన వైనాలెన్నో! విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కు తీసుకొచ్చి, ఒక్కొక్కరి ఖాతాలో రూ. పదిహేను లక్షలు జమ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఆ మాటను గంగలో కలిపారు. తెలుగు రాష్ట్రాల విభజన సమస్యల్ని పరిష్కరిస్తామని, ఏపీకి ప్రత్యేకప్యాకేజీ కేటాయిస్తామని చెప్పి కొన్నాళ్లకే తుంగలో తొక్కారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ విషయంలోనూ మోడీ ఇదే నాటకమాడుతున్నారు.

> బీజేపీ మినహా అన్ని రాజకీయ పక్షాలూ శాసనసభలో చేసిన రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక గుర్తింపులను పట్టించుకోవాలి. ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నరు రూపంలో సాగుతున్న కేంద్ర ప్రభుత్వ పెత్తనానికి తక్షణం స్వస్తి చెప్పాలి. పొరుగు దేశాలతో సరిహద్దులు కలిగి ఉన్న సున్నితమైన ప్రాంతంలో రాజకీయ క్రీడలు ప్రమాదకరం. కాబట్టి, వెంటనే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించటం ప్రజాస్వామికం.



2019 ఆగస్టు మొదటివారంలో పెద్దఎత్తున సైన్యాన్ని మోహరించి, సమాచార సాంకేతిక వ్యవస్థను స్తంభింపజేసి, జమ్మూకాశ్మీర్ రాష్ట్రహోదాను, రాజ్యాంగంలోని 370, 35 (ఎ) అధికరణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష చర్య ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కాశ్మీరీ ప్రజలు మొత్తాన్ని గంపగుత్తగా ఉగ్రవాదులన్నట్టుగా చిత్రీకరిస్తూ, నెలల తరబడి తీవ్ర నిర్బంధం విధించిన వైనం సమీప భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరగనిది. బయటికి చెప్పకున్నా మత ప్రాతిపదికన రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి, తమ రాజకీయ బలాన్ని పెంచుకోవటానికి కాషాయశక్తులు చేసిన నిర్వాకం ప్రపంచ విదితమే! చారిత్రక నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కులను తుత్తునియలు చేసి, కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలకు నిలువునా పాతరేసిన మోడీ ప్రభుత్వం .. అక్కడ వివిధ పార్టీల నాయకుల పైనా, ప్రజలపైనా నిరంకుశంగా వ్యవహరించింది. ప్రజల భూముల పరిరక్షణకు ఉన్న ప్రత్యేక చట్టాలనూ రద్దు చేసింది. కార్పొరేట్లు, ఇతర సంపన్నులూ కాశ్మీర్ భూభాగంలో సులభంగా పాగా వేసేందుకు వీలు కల్పించింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఆఖరికి సుప్రీంకోర్టు ఆదేశంతో గతేడాది సెప్టెంబర్లో శాసనసభకు ఎన్నికలు జరిపారు. ఆ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ఎన్ని పన్నాగాలు పన్నినా నేషనల్ కాన్ఫరెన్స్ - కాంగ్రెస్ కూటమికి ప్రజలు పట్టం కట్టారు. లోక్‌సభ ఎన్నికల కన్నా ఐదు శాతం ఎక్కువ పోలింగుతో తమ ఆకాంక్షను, బీజేపీ వ్యతిరేకతనూ బలంగా వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడచిపోయినా, మోడీ ప్రభుత్వం ప్రజాతీర్పు పట్ల పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తోంది.

జమ్మూకాశ్మీర్ ప్రత్యేక రక్షణ చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం - టీ 33 సొరంగమార్గంలో రైల్వేలైను వేయటాన్ని గొప్పగా చెప్పు కుంటోంది. ఇకపై దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ ఢిల్లీ మీదుగా కాశ్మీర్‌కు నేరుగా ప్రయాణం సాగించవచ్చని చెబుతోంది. ఈ రైల్వేలైనుపై జనవరి 26న వందేభారత్ రైలు తొలి ప్రయాణం చేయటానికి సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు, రైలు రవాణా సదుపాయాలను మెరుగుపర్చటం అభ్యంతరకరం కాదు గానీ, ప్రజల న్యాయబద్ధమైన హక్కులను పునరుద్ధరించకుండా రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్టు ఉపన్యాసాలు దంచటం కచ్చితంగా అసమంజసం.

జమ్మూకాశ్మీర్‌లో ప్రజలను అనుమానించే, వేధించే చర్యలు ఇప్పటికీ ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ స్వయంగా చెబుతున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన రాష్ట్రంలో ముఖ్యమంత్రికి, శాసనసభకూ ఉన్న అధికారాలు, అవకాశాలూ పరిమితం. పోలీసులను నియంత్రించే, నిర్దేశించే కనీస అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు.

ఈ నేపథ్యంలో అక్కడి బీజేపీ మినహా అన్ని రాజకీయ పక్షాలూ శాసనసభలో చేసిన రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక గుర్తింపులను పట్టించుకోవాలి. ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నరు రూపంలో సాగుతున్న కేంద్ర ప్రభుత్వ పెత్తనానికి తక్షణం స్వస్తి చెప్పాలి. పొరుగు దేశాలతో సరిహద్దులు కలిగి ఉన్న సున్నితమైన ప్రాంతంలో రాజకీయ క్రీడలు ప్రమాదకరం. కాబట్టి, వెంటనే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించటం ప్రజాస్వామికం.

యు.జి.సి నిబంధనలు-రాజ్యాంగ చిక్కులు



పి.డి.టి ఆచారి

విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే విధానానికి సవరణలు చేస్తూ యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) రూపొందించిన నిబంధనల ముసాయిదాకు బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. కొత్తగా రూపొందించిన ఈ విధివిధానాలు రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నాయనేది వాటి ప్రధాన విమర్శ. అందుకే ఈ నిబంధనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.వైస్ ఛాన్సలర్ ఎంపిక, నియామకాలకు సంబంధించి 2010 నాటి నిబంధనలకు యు.జి.సి సవరణలు ప్రతిపాదించింది. 2010 నాటి నిబంధనల ప్రకారం కనీసం పదేళ్లపాటు ప్రొఫెసర్‌గా పని చేసిన అనుభవంగల విద్యావేత్తలు ఈ పదవికి అర్హులు. తాజా సవరణ ద్వారా విద్యావేత్తలే కాకుండా పారిశ్రామిక రంగం, ప్రభుత్వ యంత్రాంగం, పబ్లిక్ పాలసీ రంగాలలో పదేళ్లకు పైగా అనుభవం ఉన్న వారినైనా వైస్ ఛాన్సలర్‌గా నియమించచ్చని ప్రతిపాదించింది. ప్రతిపాదనలు రాజ్యాంగ పరమైన అనేక చిక్కులు తెచ్చి పెడుతుంది. ప్రస్తుతం ఈ అంశం మీద రాజకీయంగా చెలరేగిన నిరసనలు, బహుశా ఈ నిరసనలకు వ్యతిరేకంగా యు.జి.సి గానీ అధికార పార్టీ గానీ రాజకీయంగా ఎలా స్పందిస్తాయన్న విషయాలను పక్కనపెట్టి ఈసమస్య లోటుపాట్లు చర్చించేందుకు ప్రయత్నిద్దాం.



యు.జి.సి చట్టం లక్ష్యం

పార్లమెంట్ 1956లో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టం చేసింది. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలను నిర్ధారించడానికి, సమ న్వయ పరచడానికి యు.జి.సిని నెలకొల్పుతున్నామని పార్లమెంటు ప్రకటించింది. అంతేగాక విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, పరిశోధనల ప్రమాణాలను నిర్ధారించడానికి, మెరుగుపరచడానికి యు.జి.సి కఅషి చెయ్యాలని చట్టం స్పష్టం చేస్తున్నది. ఈ కర్తవ్యాల నిర్వహణ కోసం, విశ్వవిద్యాలయాల నిర్వహణ, అభివృద్ధి కోసం యు.జి.సి నిధులు కేటాయించాలి. విశ్వ విద్యాలయాలు అందించే విద్యలో మెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలు సిఫార్సు చెయ్యవచ్చు. విశ్వవిద్యాలయాల సాధారణ, ప్రత్యేక అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గ్రాంట్లు ఇవ్వమని సలహా ఇవ్వవచ్చు. విద్యకు సంబంధించి దేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటి నుంచీ, విదేశీ విశ్వ విద్యాలయాల్లో విద్యాబోధన గురించి సమాచారం సేకరించి, ఆ సమాచారం మొత్తాన్ని ప్రతి విశ్వవిద్యాలయానికి అందుబాటులో ఉంచవచ్చు. ఫీజుల నియ ంత్రణను పర్యవేక్షించ వచ్చు. యు.జి.సి చట్టం సెక్షన్ 26 ప్రకారం ఈచట్టాన్ని తు.చ తప్పక పాటించాలి. అమలు చేయాలని యు.జి.సి నిబంధనలు రూపొందించవచ్చు. అయితే యు.జి.సి రూపొందించే నిబంధనలు యు.జి.సి చట్టానికి, అందులోని నియమాలకు లోబడి ఉండాలని చట్టం స్పష్టంగా చెబుతుంది. ఈ చట్టంలో అన్నిటికన్నా ముఖ్యమైన నిబంధన ఏమిటంటే విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందిగా నియమించబడడానికి కావాల్సిన అర్హతలు, విశ్వవిద్యాలయం జారీచేసే డిగ్రీలకు ఉండే ప్రమాణాలు, ఆ ప్రమాణాలు నిలబెట్టడానికి విశ్వవిద్యాలయాలతో సమన్వయం చేసుకుని జరగాల్సిన కృషికి సంబంధించినది.

తనకు మాలిన ధర్మం

ప్రస్తుతం విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవులకు అర్హతలు సవరిస్తూ కొత్త ప్రతిపాదనలు తీసుకువచ్చే అధికారం చట్ట ప్రకారం యు.జి.సికి ఉన్నదా అనేదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. వాస్తవానికి చట్టంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ల ఎంపిక నియామకాలలో యు.జి.సికి ఎలాంటి అధికారాలూ లేవు. చట్టం ప్రకారం యు.జి.సి మౌలిక లక్ష్యం విశ్వవిద్యాలయాల ప్రమాణాలు నిర్ధారించడం, పెంపొందించడం, సమన్వయం చేయడం వరకే పరిమితం. బోధనా ప్రమాణాలు నిర్ణయించడం, బోధనా సిబ్బందికి ఉండాల్సిన అర్హతలకు సంబంధించి ఆదేశాలు కూడా యు.జి.సి ఇవ్వవచ్చు. కానీ చట్టంలో ఎక్కడా పేర్కొనని వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో జోక్యం చేసుకోవడం తనకు మాలిన ధర్మమే. యు.జి.సి రూపొందించే నియమ నిబంధనలు యు.జి.సి చట్టానికి లోబడే ఉండాలి తప్ప చట్టాన్ని అతిక్రమించే హక్కు ఆ సంస్థకు లేదు. కాబట్టి వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి యు.జి.సి తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలు చట్ట రీత్యా చెల్లుబాటు కావు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చేసిన శాసనాల ద్వారా విశ్వవిద్యాలయాలను నెలకొల్పాయి. కాబట్టి ఆయా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు వంటివి సదరు ప్రభుత్వాలు శాసన రూపేణా నిర్ణయించాలే తప్ప ఆ పని యు.జి.సి చేపట్టరాదు. వైస్ ఛాన్సలర్ల నియామక ప్రక్రియ యు.జి.సి భావిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రమాణాలను సమన్వయం చేయడం, పెంపొందించడం వంటి అంశాల పరిధిలోకి రాదు.సురేష్ పాటిల్ ఖేడ్ వర్సెస్ ద ఛాన్సలర్ యూనివర్శిటీస్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ అదర్స్ కేసులో (2011) ముంబై హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ అంశాన్నే నిర్ధారిస్తుంది. కోర్టువారి దృష్టిలో విశ్వవిద్యాలయాల ప్రొ ఛాన్సలర్‌లు, వైస్ ఛాన్సలర్ల నియామక పద్ధతులు గానీ, అర్హతలు గానీ విశ్వవిద్యాలయాల ప్రమాణాల మీద ప్రత్యక్షంగా ప్రభావం చూపిస్తాయని భావించడానికి వీలులేదని ఆ తీర్పు స్పష్టం చేస్తుంది. కాబట్టి యు.జి.సి చట్టంలోని సెక్షన్ 26 కింద విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల ఎంపిక, నియామకాలు యు.జి.సి పరిధిలో లేవని తేటతెల్లం అవుతుంది.

విశ్వవిద్యాలయాల స్థాపన కోసం కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన శాసనాలను తోసిరాజనే అధికారం యు.జి.సికి ఉందా అనేది రాజ్యాంగ పరమైన సవాలు. గతంలో కొన్ని విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల అర్ధాంతర తొలగింపు సందర్భంగా ఈ ప్రశ్న తలెత్తింది. సురేష్ పాటిల్ ఖేడ్ కేసులో బొంబాయి హైకోర్టు ఇంకా ఇలా పేర్కొంది. యు.జి.సి రెగ్యులేషన్స్ 2010లో రెగ్యులేషన్ 7.3.0ను అనుసరించి యు.జి.సి పార్లమెంట్ చేసిన చట్టాన్ని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలను అతిక్రమించజాలదు. అయితే సుప్రీంకోర్టు కల్యాణి మతివనన్ వర్సెస్ కె. విజయరాజ్ అండ్ అదర్స్ కేసులో (ఆలిండియా రిపోర్ట్ 2015 సుప్రీంకోర్టు 1875 పేరా 22) చట్టం ద్వారా రూపొందించిన యుజిసి నిబంధనలు ఏ విశ్వవిద్యాలయాలకు చెందుతాయో వాటికి వర్తిస్తాయి' అని పేర్కొన్నది. పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదిస్తే ఆ నిబంధనలు వర్తింప చేయవచ్చు' అంటూ తన తీర్పుకు గల ప్రాతిపదికన వివరించింది. అయితే ప్రస్తుతం యుజిసి చేసిన సవరణ ప్రతిపాదనలను పార్లమెంటు ఆమోదించినవి కావు. పార్లమెంట్ ఆమోదించిన తర్వాతే సవరణ ప్రతిపాదనలు అమల్లోకి వస్తాయి. అప్పటి వరకూ అవి ప్రతిపాదనలుగానే ఉంటాయి. అయితే కల్యాణి మతివనన్ కేసులో సుప్రీంకోర్టు గౌరవ న్యాయమూర్తులు చట్ట సభలలో నియమ నిబంధనలను ప్రవేశపెట్టి ఆమోదించే సంవిధానాన్ని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పక తప్పడం లేదు.

యుజిసి నిబంధనలు రాష్ట్రాలు చేసే చట్టాలను పక్కనబెట్టే అవకాశం ఉన్నదా లేదా అనేది రాజ్యాంగంలోని 254వ అధికరణం కింద పరిశీలించాలి. ఈ అధికరణాన్ని అనుసరించి ఏ రాష్ట్ర ప్రభుత్వ చట్టమైనా కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా వుంటే అలా ఉన్న భాగం చెల్లుబాటు కాదు. అయితే ప్రస్తుతం యుజిసి తీసుకువచ్చిన సవరణ ప్రతిపాదనలు 254వ అధికరణం కింద కేంద్ర చట్టం పరిధిలోకి వస్తాయా అనేది కీలకమైన ప్రశ్న. ఈ అధికరణంలోని రెండవ క్లాజ్‌ను అనుసరించి ఏ రాష్ట్ర శాసనసభ అయినా చట్టం చేసి రాష్ట్రపతి ఆమోద ముద్ర కోసం పంపితే రాష్ట్రపతి ఆమోదం లభించిన తరువాతనే ఆ చట్టం అమల్లోకి వస్తుంది.

ఈ క్లాజులో చట్టం అనే మాటకు అర్థం శాసనసభ ఆమోదించిన బిల్లు అని మాత్రమే. ఆ బిల్లు మీద రాష్ట్రపతి ఆమోద ముద్ర పడ్డాకే అది చట్టంగా చలామణిలోకి వస్తుంది. రాష్ట్రపతి ఆమోదం లభించిన తర్వాత బిల్లుకు చేసే సవరణలు చట్టరీత్యా చెల్లుబాటు కావు. రాష్ట్రాలు చేసిన చట్టాలను అధిగమించాలంటే పార్లమెంట్ ఉభయ సభలు ఆ మేరకు బిల్లు ఆమోదించి, దాన్ని రాష్ట్రపతి ఆమోదానికి పంపాలి. రాష్ట్రపతి ఆమోద ముద్రపడిన తర్వాత మాత్రమే రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం చెల్లుబాటు కాకుండా పోతుంది.

కీలకమైన రూలింగ్

ఏమైనప్పటికీ కల్యాణి మతివనన్ కేసులో కోర్టు కీలకమైన రూలింగ్ ఇచ్చింది. యుజిసి చట్టంలోని 7.3.0 నిబంధన ప్రకారం రాష్ట్రాల శాసనసభల ద్వారా నెలకొల్పబడిన కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు యుజిసి సిఫార్సులు మాత్రమే చేయగలదని బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ప్రస్తుత వివాద పరిష్కారానికి ఆ రూలింగ్ తోడ్పడుతుంది.

('ద హిందూ' సౌజన్యంతో)


> ప్రస్తుతం విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవులకు అర్హతలు సవరిస్తూ కొత్త ప్రతిపాదనలు తీసుకువచ్చే అధికారం చట్ట ప్రకారం యు.జి.సికి ఉన్నదా అనేదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. వాస్తవానికి చట్టంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ల ఎంపిక నియామకాలలో యు.జి.సికి ఎలాంటి అధికారాలూ లేవు. చట్టం ప్రకారం యు.జి.సి మౌలిక లక్ష్యం విశ్వవిద్యాలయాల ప్రమాణాలు నిర్ధారించడం, పెంపొందించడం, సమన్వయం చేయడం వరకే పరిమితం. బోధనా ప్రమాణాలు నిర్ణయించడం, బోధనా సిబ్బందికి ఉండాల్సిన అర్హతలకు సంబంధించి ఆదేశాలు కూడా యు.జి.సి ఇవ్వవచ్చు. కానీ చట్టంలో ఎక్కడా పేర్కొనని వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో జోక్యం చేసుకోవడం తనకు మాలిన ధర్మమే. యు.జి.సి రూపొందించే నియమ నిబంధనలు యు.జి.సి చట్టానికి లోబడే ఉండాలి తప్ప చట్టాన్ని అతిక్రమించే హక్కు ఆ సంస్థకు లేదు. కాబట్టి వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి యు.జి.సి తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలు చట్ట రీత్యా చెల్లుబాటు కావు.

> విశ్వవిద్యాలయాల స్థాపన కోసం కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన శాసనాలను తోసిరాజనే అధికారం యు.జి.సికి ఉందా అనేది రాజ్యాంగ పరమైన సవాలు. గతంలో కొన్ని విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల అర్ధాంతర తొలగింపు సందర్భంగా ఈ ప్రశ్న తలెత్తింది. సురేష్ పాటిల్ ఖేడ్ కేసులో బొంబాయి హైకోర్టు ఇంకా ఇలా పేర్కొంది. యు.జి.సి రెగ్యులేషన్స్ 2010లో రెగ్యులేషన్ 7.3.0ను అనుసరించి యు.జి.సి పార్లమెంట్ చేసిన చట్టాన్ని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలను అతిక్రమించజాలదు. అయితే సుప్రీంకోర్టు కల్యాణి మతివనన్ వర్సెస్ కె. విజయరాజ్ అండ్ అదర్స్ కేసులో (ఆలిండియా రిపోర్ట్ 2015 సుప్రీంకోర్టు 1875 పేరా 22) చట్టం ద్వారా రూపొందించిన యుజిసి నిబంధనలు ఏ విశ్వవిద్యాలయాలకు చెందుతాయో వాటికి వర్తిస్తాయి' అని పేర్కొన్నది.

పడమటి సంధ్యా సమయం
ఎర్రబడుతూ అస్తమిస్తోంది
తిరిగి చైతన్యం పుంజుకుంటూ
ఎర్రపొద్దయి పుట్టడం కోసం..

ఒక ఉద్యమ పిడికిలి బిగిస్తోంది
ఎర్రటి కాగడాలా రగలడం కోసం
ఒక ఎర్రజెండా రెపరెపలాడుతోంది
సమసమాజ హితం కోసం
ఎర్రమట్టిపై ఒక చెట్టు కొమ్మ
ఎరుపు పూలను పోగేసుకుంటోంది
సమన్యాయ పరిమళాలు వెదజల్లుతూ
సగటు బతుకుల భవిత కోసం..
ఒక కొడవలి ఎలుగెత్తి చాటుతోంది

ఎర్ర పొద్దు



కలుపు కోతలతో కాయనిచ్చే చెట్టును
వ్యవస్థలో బతకనీయడం కోసం
బడుగు వేదన నిరసన కర్రను చేపట్టింది
అట్టడుగు జీవితాల అభ్యున్నతి కోసం
ప్రతి అడుగు కదం తొక్కుతూ కదిలింది
న్యాయ పోరాటపు పటిమ కోసం..

పేదాకలి మరో ప్రభంజనమైంది
నిలువ నీడనివ్వని దౌర్భాగ్యాన్ని
కాలర్ పట్టి నిలేసి అడగడం కోసం
వెనుదిరగని ఒక ఉద్యమ కెరటం
అడుగుల్ని పిడుగులుగా మార్చుకుంది
వెనుకబడిన జీవనాల ఊపిరి కోసం..

ఎర్రపొద్దు బాహాటంగా పొడిచింది
ఎరుపు కిరణాల నినాదపు బాటలో
న్యాయాన్ని బతికించడం కోసం
గూడు చెదిరి ఎగిరిపోయిన పక్షుల్ని
గూటికి చేర్చే మహత్తర కార్యం కోసం
ఒక సగటు జీవన చక్రాన్ని
సవ్యంగా నడుపుకోవడం కోసం..

- నరెద్దుల రాజారెడ్డి, 9666016636

ఉద్యోగులు కార్పొరేట్ల బానిసలా?



నామని భిక్షపతి
9494800073

ఉద్యోగులపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం రోజురోజుకూ పెరుగుతున్నది. వారిని బానిసలుగా చూసే పద్ధతి విస్తరిస్తున్నది. ఇటీవల కొన్ని పరిణామాలు చూస్తే పెట్టుబడిదారి నైజం సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నది. ఈ మధ్యకాలంలో లారెన్స్ అండ్ టుబ్రో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎస్ సుబ్రహ్మణ్యం తమ ఉద్యోగులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఒక ఉద్యోగి, "ఇంత సాంకేతికత అభివఅద్ధి చెంది, కంపెనీ ఇంతగా లాభాలు అర్జిస్తూ, విస్తరిస్తున్న దశలో శనివారం పనిచేయడమేమిటి, వారానికి ఐదు రోజుల పనివ్వచ్చు కదా!" అని అడిగిన ప్రశ్నకి ఆయన సమాధానమిచ్చారు. "నేను మీతో ఆదివారాలు కూడా పని చేయించలేక పోతున్నందుకు చింతి స్తున్నాను. మీరందరూ వారానికి తొంభై గంటలు పనిచేస్తే నేను ఎంతో సంతోషిస్తాను.నిజం చెప్పాలంటే ఆదివారాలు కూడా పనిచేయిస్తే ఎంతో సంతోషంగా ఉంటాను. ఎందుకంటే నేను ఆదివారాలు కూడా పనిచేస్తాను." అన్నారు. అంతటితో ఆగకుండా, "ఇంట్లో కూర్చొని ఏం చేస్తారు, ఎల్లకాలం భార్య మొఖం చూసుకుంటూ కూర్చుంటారా? లేక భార్యలు భర్తల మొఖాలు చూస్తూ కూర్చుంటారా? రండి,ఆఫీస్‌కు వచ్చి పనిచేయండి." అన్నారు. ఇంకా "వారానికి తొంభై గంటలు పని చేయొచ్చు కదా" అని అన్నారు. ఇంతకుముందు ఇన్ఫోసిస్ అధినేత శ్రీఎన్ ఆర్ నారాయణమూర్తి ఉద్యోగులు డెబ్బయి గంటలు పనిచేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని మాట్లాడారు. అలాగే "ఓలా" ఫౌండర్ విష్ అగర్వాల్ " శని, ఆదివారం వారాంతపు సెలవులు అనేది భారతీయ సంస్కృతి కాదు. ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. మన సంస్కృతి ప్రకారం నెలకి రెండు రోజులు సెలవుంటే సరిపోతుంది." అన్నారు. అంతేకాకుండా ప్రపంచ ధనికుడు ఎలన్‌మస్క్ వారానికి తొంభై నుంచి వంద గంటలు పని చేయాలన్నాడు. కార్పొరేట్లు, పెట్టుబడుదారులు ఇలా కార్మికులను ఉద్యోగులను ఎనిమిది గంటలకంటే ఎక్కువ పని చేయించుకోవాలనే ఆలోచనలు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయాయి. దానికి కారణం మారిన ప్రపంచ రాజకీయ పరిస్థితులు, దానికి తోడు వారికి లాభాల పైనున్న మితిమీరిన తృష్ణ, ఇలా బరితెగించి మాట్లాడిస్తున్నాయి.

ఎనిమిది గంటలు పని విధానమెలా వచ్చింది?

ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు ఎనిమిది గంటల పనిదినాన్ని ఒక శతాబ్దం పైగా అనుభవిస్తున్నారు. 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం ప్రారంభ దశలో పరిశ్రమలు స్థాపించబడిన ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో కార్మికులను పది నుంచి పద్దెనిమిది గంటల వరకు పనిచేయించుకునేవారు. "పని-జీవితం సమతుల్యత" ఉండాలంటే, సోషలిస్టు నాయకుడు రాబర్ట్ ఓవెన్ 1810లో కార్మికులు 24 గంటల ఒక రోజును మూడు భాగాలుగా విభజించి, ఎనిమిది గంటలు విశ్రాంతి, నిద్రకోసం, మరొక ఎనిమిది గంటలు వ్యక్తిగత అవసరాలు, కుటుంబ పనులు, ప్రయాణాలు వంటివి నిర్వహించుకోవడానికి పోగా, ఎనిమిది గంటలు పరిశ్రమలో పనిచేయడానికి వీలుగా ఉండాలని డిమాండ్ చేయడం జరిగింది. 1845లో కార్ల్‌మార్క్స్ స్నేహితుడైన ఏంగిల్స్, పారిశ్రామికవేత్త అయిన తన తండ్రి మాంచస్టర్‌లో ఏర్పాటు చేసిన నూలుమిల్లును చూసుకోవడానికి వెళ్లినప్పుడు ఆనాటి కార్మికుల దుర్భర పరిస్థితులను గమనించి 'ఇంగ్లాండ్‌లో కార్మికుల పని పరిస్థితులు' అనే గ్రంథం రాశారు. ఆ రోజుల్లో పరిశ్రమల్లో మగవారితోనే కాకుండా స్త్రీలు, పిల్లలతో 12,16,18 గంటల వరకు పని చేయించు కునేవారు. ఆ తర్వాత 1866లో కార్ల్‌మార్క్స్, ఏంగిల్స్ స్థాపించిన "ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్" ఎనిమిది గంటల పనిదినంకై పోరాడాలని తీర్మానం చేసి, ప్రపంచ కార్మికులకు, కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పనిదినం కావాలని కోరుతూ పెద్ద ఊరేగింపు నిర్వహించారు. కక్షగట్టిన పెట్టుబడిదారులు ఆ ఊరేగింపుపై పోలీసులతో జరిపించిన కాల్పుల్లో ఆరుగురుకార్మిక నాయకులు చనిపోయారు. వారి త్యాగాల మూలంగానే ఈనాటి ఎనిమిది గంటల పనిదినం అనే హక్కును అనుభవిస్తున్నాము. వారు చిందించిన రక్తం నుంచే ఎర్రజెండా పుట్టింది. అందుకే మనం వారి సంస్మరణగా ప్రతి సంవత్సరం 'మేడే'ను మే ఒకటిన నిర్వహించుకుంటున్నాం. 1917లో రష్యాలో లెనిన్ నాయకత్వంలో సోషలిస్టు విప్లవం విజయవంతమైన తర్వాత మొదటగా ఎనిమిది గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేశారు. ఆ విధంగా 8 గంటల పనిదినం అనేది అమల్లోకి వచ్చింది. ఆ తర్వాతే ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలు ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయవలసిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి.

పెట్టుబడిదారుల దోపిడీ, లాభాల వేటకు అంతుందా?

తొంభై గంటలు పనిచేయాలని కోరుకునే ఎల్‌అండ్‌టి సంస్థ ఏమైనా నష్టాల్లో ఉందా అంటే లేనేలేదు. 2023-24 సంవత్సరానికి గాను రూ. 2,21,000 కోట్ల వ్యాపారం చేసి రూ.13,059 కోట్ల లాభాలను ఆర్జించింది.70 గంటలు పని చేయాలని కోరుకుంటున్న ఇన్ఫోసిస్ సంస్థ 2023-24 సంవత్సరానికి రూ.1,53,670 కోట్ల వ్యాపారం చేసి, రూ.26,232 కోట్ల లాభాలను ఆర్జించింది. అయినప్పటికీ వీరికి ఇంకా లాభాలు రావాలని తాపత్రయ పడుతుంటుంటారు. ఈ కార్పొరేట్ యజమానుల ప్రకటనల పట్ల ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది స్పందించారు. వ్యతిరేకతను వ్యక్తపరిచారు.



> "యంత్రాలు విలువను సృష్టించవు. యంత్రాలు నిర్జీవ శ్రమకు ప్రతిరూపాలు. అవి కూడా గతకాలపు మనుషులు చేసినవి. అందులో కూడా శ్రమనిక్షిప్తమై ఉంది. ఆ శ్రమకు కొత్తగా అదనంగా చేరేది లేదు. ఆ శ్రమ ఒక్కొక్క వస్తువు తయారు చేస్తున్నకొద్దీ దాని వాటా తగ్గిపోతుంది. చివరికి యంత్రం పట్టిపోతుంది. కానీ మనిషి సృజనాత్మకతతో, తన కండరాలతో చేసే పనివల్ల ఎప్పటికప్పుడు కొత్త అదనపు విలువ సృష్టిస్తాడు. శ్రమ చేస్తాడు కనుక మనుషుల వల్ల సజీవ శ్రమవల్లనే విలువ ఉత్పత్తి అవుతుంది.అదనపు విలువ ఉత్పత్తి అవుతుంది. నిర్జీవ శ్రమవల్ల కాదు." అని కారల్ మార్క్స్ అన్నారు.


శాస్త్ర, సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, అత్యాధునిక యంత్రాలు, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం అన్నంతగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ టూల్స్ లాంటి వచ్చినప్పటికీ వాటి ద్వారా పెట్టుబడిదారులు లాభాలు గ్రహించవచ్చు కదా! కానీ అవి మాత్రమే లాభాలను చేకూర్చవు. అవి మానవ శ్రమను తగ్గించి సుఖవంతమైన జీవితాన్ని ఇవ్వవచ్చు. ఇంకా పనిగంటలు తగ్గించవచ్చు. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థలో అలా జరగదు. "యంత్రాలు విలువను సృష్టించవు. యంత్రాలు నిర్జీవ శ్రమకు ప్రతిరూపాలు. అవి కూడా గతకాలపు మనుషులు చేసినవి. అందులో కూడా శ్రమనిక్షిప్తమై ఉంది. ఆ శ్రమకు కొత్తగా అదనంగా చేరేది లేదు. ఆ శ్రమ ఒక్కొక్క వస్తువు తయారు చేస్తున్నకొద్దీ దాని వాటా తగ్గిపోతుంది. చివరికి యంత్రం పట్టిపోతుంది. కానీ మనిషి సృజనాత్మకతతో, తన కండరాలతో చేసే పనివల్ల ఎప్పటికప్పుడు కొత్త అదనపు విలువ సృష్టిస్తాడు. శ్రమ చేస్తాడు కనుక మనుషుల వల్ల సజీవ శ్రమవల్లనే విలువ ఉత్పత్తి అవుతుంది.అదనపు విలువ ఉత్పత్తి అవుతుంది. నిర్జీవ శ్రమవల్ల కాదు." అని కారల్ మార్క్స్ అన్నారు. ఇంకా "వస్తువులకు విలువ ఎట్లా వస్తుందంటే, సంపద ఎలా తయారవు తుందంటే అది సజీవశ్రమ ద్వారా మాత్రమే. సజీవశ్రమ నుండే అదనపు శ్రమను రాబట్టి, అదనపు విలువగా మార్చుకున్నప్పుడే లాభం వస్తుంది." అన్నారు. అందుకే కార్పొరేట్ యజమానులకు ఉద్యోగులు మనుషులుగా కనపడటం లేదు. యంత్రాల్లాగా కనపడుతున్నారు. తమ లాభాల కోసం పనిచేయాల్సిన మిషన్స్‌లా చూస్తున్నారు. ఈ మనస్తత్వం ప్రమాదకరం. ఈ విధమైన ఆలోచన ధోరణి సరైంది కాదు. ఈ ఆధునిక కంప్యూటర్ యుగంలో పనిచేసే ఉద్యోగులపై పనిభారం పెంచుతూ, తలకుమించిన టార్గెట్లు పెడుతూ వారిని పీల్చి పిప్పిచేస్తున్నారు "వర్క్ ఫ్రం హోమ్" కల్చర్ ప్రారంభమైనప్పటి నుండి ఉద్యోగుల జీవితంలో పనికి, జీవితానికి తేడా లేకుండా రాత్రింబవళ్లు పనిచేయాల్సి వస్తున్నది. అందుకే మార్క్స్ - "పెట్టుబడిదారులు కార్మికులను ఎక్కువ గంటలు పని చేయించడం ద్వారా వాళ్లను మృత్యువుకు దగ్గర చేస్తున్నారు." అంటారు.

ఉదారవాద ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తున్న మనదేశంలో నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు, కార్మిక,రైతు, ప్రజావ్యతిరేక చట్టాల మూలంగా ఈరోజు కార్పొరేట్, పెట్టుబడిదారి వర్గాలు బరితెగించి ప్రవర్తిస్తున్నాయి. శతాబ్దాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న అనేక హక్కుల్ని హరిస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారు. ఎనిమిది గంటల పని విధానాన్ని హరిస్తూ, యజమానులు 12 గంటల వరకు పనిచేయించుకోవచ్చని, కార్మిక సంఘాలను పెట్టుకోకుండా చేయడం, కనీస వేతనాలు కూడా అమలు చేయకుండా, రోజువారి కనీస వేతనం 178 రూపాయలుగా నిర్ణయించడం లాంటివి పెట్టుబడిదారీ వర్గానికి మేలుచేసే విధంగా, కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు దాసోహమయ్యేలాగా తిరిగి మధ్యయుగాలనాటి స్థితికి తీసుకువెళ్లాలని ఒక ప్రయత్నం జరుగుతుంది.

ఈ నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ నుండి అమలు చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇవే కనుక అమల్లోకి వస్తే కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు పట్టపగ్గాల్లేకుండా పోతాయి. కార్మికుల జీవితాలు మరింత దుర్భరంగా తయారవుతాయి. ఉద్యోగులు, కార్మికులు ఆధునిక బానిసలుగా మారతారు. పనిగంటల తగ్గింపునకు జరిగే ఉద్యమం, వర్గ పోరాటంలో ఒక అంశం' అని కార్ల్ మార్క్స్ అంటారు. గనుక కార్మిక వర్గం, ప్రజానీకం ఈ కార్మిక,కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి, తద్వారా వాటిని నిలువరించాలి.

పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

- మంత్రి పొంగులేటి ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సమాచార పౌర సంబంధాల ఎంప్లాయిస్ అసోసియేషన్-2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు భారీగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ డీఎస్. జగన్, డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

కుంభమేళాలో తొక్కిసలాటపై మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన పట్ల మంత్రి కొండా సురేఖ బుధవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రమాదంలో పదుల సంఖ్యలో భక్తులు చనిపోవడం, వందలాది మంది గాయపడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయాలపాలైన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో వసంత పంచమి, అచల నవమి, మహాశివరాత్రి వంటి ముఖ్యమైన రోజులున్నందున మహాకుంభమేళకు భక్తులు భారీ సంఖ్యలో వస్తారనీ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి, యూపీ సర్కార్‌కు సూచించారు.

స్తంభించిన హైదరాబాద్ మెట్రో రైళ్లు

- రెండు గంటలు నిలిచిన సేవలు
- సాంకేతిక సమస్యే కారణం : అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సాంకేతిక సమస్యలతో హైదరాబాద్ మెట్రో సేవలు బుధవారం దాదాపు రెండు గంటలపాటు స్తంభించాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకెళ్తే.. సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్యలు రావడంతో నాగోలు-రాయదుర్గం మార్గంలోని మెట్రో సేవలు దాదాపు రెండు గంటలు నిలిచిపోయాయి. అలాగే, అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ, మియాపూర్ నుంచి అమీర్‌పేట మధ్య మెట్రో రైళ్లు ఆగిపోయాయి. ఉదయం సమయం కావడంతో ఆఫీసులకు వెళ్లే వారు, కళాశాలలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల తర్వాత మళ్లీ మెట్రో సర్వీసులు ప్రారంభమయ్యాయి. దీనిపై మెట్రో ఒక ప్రకటన విడుదల చేసింది. సిగ్నల్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్యలతోనే సర్వీస్‌లకు అంతరాయం కలిగిందని పేర్కొంది. రెండు గంటలపాటు సర్వీస్‌లు నిలిచిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు తెలిపింది.

జీఆర్ఎంబీ చైర్మెన్‌గా ఎకె ప్రధాన్

- కేంద్ర ప్రభుత్వ నియామకం
- ఢిల్లీ కోర్టు కేసుకు లోబడే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరీ నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) నూతన చైర్మెన్‌గా ఎకే ప్రధాన్ నియమితులయ్యాయరు. ఈ మేరకుకేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ శర్మ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. సెంట్రల్ వాటర్ ఇంజినీరింగ్ సర్వీసులో ఉన్న ఎకే ప్రధాన్‌కు ఉన్న విస్తృత అనుభవం ఈ దృష్ట్యా ఈ నియామకం చేశారు. ఈ నియామకంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో ఒక రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఆ కేసు తీర్పుకు లోబడే నియామకం చెల్లుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వనపర్తి సీఈగా సత్యనారాయణరెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఈ ఎ. సత్యనారాయణరెడ్డిని వనపర్తి సీఈగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా ఇటీవల ఆదేశాలు ఇచ్చారు.సాధారణ విధులకు అదనంగా సీఈ బాధ్యతలను అప్పగించినట్టుగా ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన వెటర్నరీ డాక్టర్

- ఉద్యోగి నుంచి లంచం డిమాండ్



నవతెలంగాణ-ఉట్నూర్

సొంత శాఖ ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు వెటర్నరీ డాక్టర్. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ గ్రామ పశువుల ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రమేష్ రాథోడ్ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ రమేష్ వద్ద కొన్ని నెలల కిందటి వరకు మాధవ్ అనే ఉద్యోగి విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం నార్నూర్‌కు బదిలీ అయ్యాడు. ఇక్కడ పని చేసిన కాలానికి ఎల్పీసీ ఇవ్వడానికి డాక్టర్ రమేష్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. రూ.15వేలు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. బుధవారం డబ్బులు ఇస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. అనంతరం డాక్టర్ రమేష్‌ను ఏసీబీ కోర్టుకు తరలించారు.

ఏసీబీకి వలలో లింగంపేట్ ఎస్ఐ

- కారు కేసులో రూ.12,500 లంచం తీసుకుంటూ..



నవతెలంగాణ-కంఠేశ్వర్

కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్ఐ సుధాకర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. ఏసీబీ నిజామాబాద్ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాల ప్రకారం.. కారు అమ్మకం విషయంలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదంలో మధ్యవర్తిగా ఉన్న నిజామాబాద్ నగరానికి చెందిన శివ అనే వ్యక్తిని లింగంపేట్ పోలీసులు కొద్దీ రోజుల కిందట అదుపులోకి తీసుకొని అతని వద్ద కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత శివను లాకప్‌లో వేసిన ఎస్ఐ సుధాకర్ తీవ్ర పదజాలంతో తిట్టాడు. కేసులో ఇరికిస్తానని బెదిరించాడు. కేసు నుంచి తప్పించడానికి రూ.12500 డిమాండ్ చేయడంతో అడిగినంత ఇవ్వడానికి శివ ఒప్పుకున్నాడు. కానీ చేయని నేరానికి లాకప్‌లో వేసి అవమానించారని బాధపడిన శివ ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం నిజామాబాద్ నగరంలోనే ఉన్న ఎస్ఐ వద్దకు వెళ్లి నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. గతంలో లంచం తీసుకుంటూ లింగంపేట్ ఎస్ఐ బదిలీ కాగా.. ఆయన ప్లేస్‌లో బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ సైతం లంచం తీసుకుంటూ చిక్కడం గమనార్హం.

సర్కారీ విద్యకు తూట్లు

- ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ దిశగా మోడీ ప్రభుత్వం

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం | **పెన్షన్లలోనూ కోతలే**





న్యూఢిల్లీ : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సర్కారీ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. విద్యా వ్యవస్థను ప్రయివేటీకరించేందుకు, వ్యాపారీకరించేందుకు ప్రయత్నిస్తూ ఆ క్రమంలో నిధుల కేటాయింపును కుదిస్తోంది. వాస్తవానికి 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణ యత్నాలు ఊపందుకున్నాయి. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడం మొదలైంది. నిధుల కేటాయింపులో భారీగా కోత పెడుతున్నారు.

ఉన్నత విద్యలో...

2013-14లో విద్యా శాఖకు బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయించగా 2024-25 నాటికి అది రెండు శాతం కూడా లేదు. పైగా విద్యపై ప్రభుత్వ వ్యయానికి సంబంధించి బడ్జెట్ అంచనాల కంటే సవరించిన అంచనాలు తక్కువగా ఉండడం వాస్తవానికి, వాగ్దానాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సూచిస్తోంది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి 2023-24లో సవరించిన అంచనాలు రూ.57,245 కోట్లు. దీనిని 2024-25లో రూ.47,620 కోట్లకు కుదించారు. అంటే కేటాయింపులు 17 శాతం తగ్గాయి. ఇదే కాలంలో సాధారణ విద్య కోసం ఉద్దేశించిన యూజీసీ బడ్జెట్ 61 శాతం తగ్గిపోయింది. ఏఐసీటీఈకి కేటాయించే బడ్జెట్‌లో (రూ.400 కోట్లు) మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లను రూ.12,000 కోట్ల నుండి రూ.15,472 కోట్లకు...అంటే 29 శాతం పెంచారు. అలాగే ఐఐటీలకు కేటాయించే నిధులను కూడా రూ.9,292 కోట్ల నుండి రూ.9,635 కోట్లకు పెంచారు. అయితే వార్షిక ద్రవ్యోల్బణ రేటు ఐదు శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే నిధుల కేటాయింపు తగ్గిందనే చెప్పాలి. విద్యా వ్యవస్థకు నిధులు పెంచాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపుతోంది. దీంతో పేదలు, మధ్య తరగతి ప్రజలు, కార్మికులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది.

పెన్షన్లలో కోత

నిర్దిష్ట ప్రయోజనకర పెన్షన్ పథకం లేకపోవడంతో విద్య, ప్రభుత్వ రంగాలకు పరిమితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ సర్వీసుల వైపు చూడడం లేదు. పెన్షన్ పథకమంటూ లేకపోవడంతో పదవీ విరమణ అనంతరం తమకు జీవన భృతి ఎలా అనేదే వారి ప్రధాన ఆందోళన. ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం 2019-20లో పెన్షన్ల నిమిత్తం కేటాయించిన నిధులు రూ.49,767 కోట్లు. 2020-21లో వాటిని రూ.62,677 కోట్లకు పెంచారు. అయితే 2021-22లో రూ.56,473 కోట్లకు కుదించారు. తొలి యూపీఏ ప్రభుత్వ పాలనలో 2005-06లో పెన్షన్లకు రూ.62,567 కోట్లు, 2006-07లో రూ.70,352 కోట్లు, 2007-08లో రూ.73,076 కోట్లు కేటాయించారు. అయితే 2007-08, 2021-22 మధ్యకాలంలో కేటాయింపులు 23 శాతం మేర తగ్గిపోయాయి. దీనితో పాటు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ పథకానికి (ఓపీఎస్) బదులు జాతీయ పెన్షన్ పథకాన్ని (ఎన్పీఎస్) అమలు చేస్తోంది. ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుండి తీవ్ర ప్రతిఘటన రావడంతో ప్రభుత్వం మధ్యేమార్గంగా ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపీఎస్) ముందుకు తెచ్చింది. అయితే అది కేవలం ఉద్యోగులకు మాత్రమే. వాస్తవానికి దాని పైనా విమర్శలు వస్తున్నాయి.

విద్యకు దూరం

ఇక విద్యార్థుల విషయానికి వస్తే 2021-22లో ఉన్నత విద్యలో చేరిన వారి సంఖ్య 4,32,68,181. వీరిలో ఎస్సీలు 15.3 శాతం, ఎస్టీలు 6.3 శాతం, ఓబీసీలు 37.8 శాతం ఉన్నారు. అయితే ఆయా వర్గాల జనాభాతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువగానే ఉంది. ముస్లిం మైనారిటీల విషయంలోనే ఇంతే. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే కాషాయ ప్రభుత్వ విధానాల కారణంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమైపోతున్నారు.

ప్రయివేటీకరణకు ఊతం

3021-22లో ఉన్నత విద్యపై నిర్వహించిన అఖిలభారత సర్వే (ఏఐఎస్‌హెచ్ఈ) ప్రకారం దేశంలో యూనివర్సిటీ స్థాయి సంస్థలు సహా 1,168 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రయివేట్, డీమ్డ్ ప్రయివేట్ వర్సిటీలు 40 శాతం ఉన్నాయి. 2013-14లో మొత్తం వర్సిటీల్లో వీటి వాటా 32 శాతమే. మరో మాటలో చెప్పాలంటే మోడీ ప్రభుత్వ పాలనలో వివిధ రకాల ప్రయివేటు యూనివర్సిటీల సంఖ్య పెరిగిపోతోంది. మరోవైపు 2013-14లో దేశంలో 36,634 కాలేజీలు ఉండగా 2020-21 నాటికి వాటి సంఖ్య 42,825కు పెరిగింది. పెరిగిన కళాశాలల్లో 5,976 ప్రయివేటువి కాగా 215 మాత్రమే ప్రభుత్వ కాలేజీలు. మోడీ ప్రభుత్వం సర్కారీ ఉన్నత విద్యను ఫణంగా పెట్టి ప్రయివేటు ఉన్నత విద్యను ప్రోత్సహిస్తోందని దీనిని బట్టి అర్థమవుతోంది.

పాఠశాల విద్యకూ అంతంతే

ఉన్నత విద్యకు కేటాయింపుల సంగతి అలా ఉంటే పాఠశాల విద్యకు సంబంధించి కూడా అరకొర కేటాయింపులే జరుగుతున్నాయి. పాఠశాల విద్యకు 2023-24లో బడ్జెట్ అంచనాలు రూ.72,474 కోట్లు కాగా 2024-25లో కేవలం 0.74 శాతం మాత్రమే పెరిగాయి (రూ.73,008 కోట్లు). సమగ్ర శిక్షకు కేటాయింపులు పెరగ్గా పోషణ్ శక్తి నిర్మాణ్‌కు తగ్గాయి. ప్రాథమిక, సెకండరీ విద్యలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. ముఖ్యంగా ఓబీసీ విద్యార్థుల ప్రవేశాల్లో తగ్గుదల కన్పిస్తోంది.

వచ్చే ఐదు నెలలకు భగీరథ ప్రణాళిక రూపొందించాలి

- మంత్రి సీతక్క ఆదేశం
- నీటివినియోగంపై సర్వే చేయాలని సూచన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



వేసవి ముగిసే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని రాష్ట్ర గ్రామీణ నీటిసరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గాలి తర్వాత నీరే మనుషులకు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. వచ్చే ఐదు నెలలకు మిషన్ భగీరథ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోట్లాది మందికి నీరందించే అదృష్టం మనకే దక్కిందని చెప్పారు. ప్రతి మనిషికి 100 లీటర్ల నీటిని ప్రతిరోజూ అందించాలని చెప్పారు. గ్రామ, మండల స్థాయిల్లో క్రీమ్ కమిటీ వేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసు కోవడంతోపాటు, మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చు చేసినా, ప్రజలు ఎందుకు ఆ నీటిని పూర్తిస్థాయిలో వినియోగించడం లేదో అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఎంతమంది మిషన్ భగీరథ నీటిని వినియోగించడం లేదో సర్వే చేయాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మేర మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నాం, ఎన్ని గహాలకు నీరు అందడంలేదనే వివరాలను స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయాలని చెప్పారు. మిషన్ భగీరథ నీళ్ల వాడేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని వివరించారు. ప్రతి ప్రాణం ముఖ్యమైనదనీ, మిషన్ భగీరథ నీటి కారణంగా ఎవరు అనారోగ్యం పాలు కాకూడదని గుర్తు చేశారు. ఆ బాధ్యత మిషన్ భగీరథ ఇంజినీర్లదేనని గుర్తు చేశారు. అడవుల్లో తిరిగినప్పుడు నేను అన్ని రకాల నీళ్ల తాగాననీ, అయినా నాకు ఏమి కాలేదని అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పుడు ప్రజలు ఆర్వో ప్లాంట్లకు అలవాటై సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని చెప్పారు. అధికారులంతా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఇంజినీర్లు, ఉద్యోగులు కావాలని తప్పులు చేసినా, పొరపాట్లు చేసినా సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ మహిళగా నాకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ చరిత్రలోనే కాదు ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో కూడా ఇటువంటి అవకాశం మహిళలకు రాలేదన్నారు. ప్రతినిమిషం ప్రజాసేవ కోసం అంకితమవుతున్నానని చెప్పారు. నా పేరు నిలబెట్టేలా, శాఖకు వన్నెతెచ్చేలా అధికారులంతా పనిచేయాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్ల అసోసియేషన్ డైరీని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కపాకర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే కులదురహంకార హత్య

(మొదటిపేజీ తరువాయి)

వంశీ తాళ్లగడ్డకు చెందిన తమ స్నేహితుడు బైరు మహేశ్, నల్లగొండకు చెందిన నువ్వుల సాయి చరణ్ సాయం తీసుకున్నారు. వారి ప్లాన్‌లో భాగంగా కొన్నాళ్లుగా కృష్ణతో బైరు మహేశ్ స్నేహం చేస్తున్నట్టు నటించాడు. హత్య పథకాన్ని ఈ నెల 19వ తేదీన అమలు చేయాలని చూసినప్పటికీ సాధ్యం కాలేదు. ఈ క్రమంలో 26వ తేదీన మహేశ్ కృష్ణకు ఫోన్ చేసి పని ఉన్నది రమ్మని చెప్పాడు. ఆ తర్వాత నవీన్‌కు ఫోన్ చేసి తాము వస్తున్నాం.. అలర్ట్‌గా ఉండాలని చెప్పాడు. కృష్ణ తన స్కూటీపై మహేశ్ ఇంటికి వెళ్లగా, అతను కూడా ఎక్కాడు. దారిలో డ్రింక్స్, తినుబండారాలు తీసుకుని సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్డు సమీపంలో మహేశ్ వ్యవసాయ భూమి వద్దకు చేరుకున్నారు. మహేశ్ మద్యం, కృష్ణ కూల్‌డ్రింక్ తాగారు. ఆ రోజు సాయంత్రం అక్కడ సుమారు 3-4 గంటల సేపు కూర్చున్నారు. ఆ తర్వాత కృష్ణ ఇంటికి వెళ్దామని స్కూటర్ స్టార్ట్ చేయగా, మహేశ్ వెనకాల ఎక్కి కూర్చున్నాడు. వెంటనే కృష్ణ మెడ చుట్టూ చేయి వేసి గొంతు నొక్కి పట్టుకున్నాడు. అప్పటికే అక్కడ కంప చెట్లల్లో దాక్కున్న నవీన్, వంశీ పరిగెత్తుకుంటూ వచ్చారు. కృష్ణ కాళ్లను వంశీ పట్టుకోగా, నవీన్ గొంతు పట్టుకొని నలిపేశారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాత మృతదేహాన్ని తాడుతో కట్టి.. నవీన్ తన ఎర్టీగా కారులో ఉన్న బస్తాలో కుక్కి డిక్కీలో వేశారు. పాత సూర్యాపేటలో బంధువుల ఇంట్లో ఉన్న తమ నాయనమ్మ బుచ్చమ్మ వద్దకెళ్లి మృతదేహాన్ని చూపించారు. ఆ తర్వాత నల్లగొండలోని తన స్నేహితుడు సాయిచరణ్ వద్దకెళ్లి మృతదేహాన్ని చూపెట్టగా.. భయంతో వెంటనే ఆయన కారు దిగి వెళ్లాడు. అక్కడి నుంచి వారు కారులో తిరిగి సూర్యాపేటకు వెళ్లే దారిలో కృష్ణ స్కూటర్‌ను వంశీ తీసుకొని వెనుక రాగా, పిల్లలమర్రి గ్రామ శివారులో చెర్వుకట్ట చివరలో మూసీ కెనాల్ పక్కన మృతదేహాన్ని పడేశారు. అనంతరం పాత సూర్యాపేటకు వెళ్లి తమ నాయనమ్మ ఉన్న బంధువు ఇంట్లో పడుకున్నారు. తరువాత కారులో మహేశ్, నవీన్, వంశీ హైదరాబాద్‌కు వెళ్లారు. మళ్లీ 28వ తేదీ రాత్రి పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం భార్గవి సోదరులైన కోట్ల నవీన్, వంశీ, తండ్రి సైదులు, నాయనమ్మ బుచ్చమ్మ స్నేహితులు మహేశ్, సాయి చరణ్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి ఎర్టిగా కారు, కత్తి, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులకు నేర చరిత్ర ఉంది. కోట్ల నవీన్ సూర్యాపేట రూరల్ పీఎస్ పరిధిలో నాలుగు పాత కేసుల్లో నిందితుని ఉన్నాడు. బైరు మహేశ్ టౌన్ పీఎస్ పరిధిలో తొమ్మిది పాత కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. అదేవిధంగా టౌన్ పీఎస్‌లో రౌడీ షీట్ వుంది. యువతి తండ్రి కోట్ల సైదులు సూర్యాపేట రూరల్ పీఎస్ పరిధిలో ఒక పాత కేసులో ముద్దాయిగా ఉన్నాడు. కోట్ల వంశీ సూర్యాపేట రూరల్ పీఎస్ పరిధిలో మూడు పాత కేసులో ఉన్నాడు. కోట్ల బుచ్చమ్మపై సూర్యాపేట రూరల్ పీఎస్ పరిధిలో రెండు పాత కేసులున్నాయి.నువ్వుల సాయిచరణ్ నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో ఒక పాత కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఇక హత్యకు గురైన కృష్ణపై కూడా 3 కేసులు ఉన్నాయి. కులాంతర వివాహం నేపథ్యంలో ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు ఎస్పీ తెలిపారు. కానీ యువతి కటుంబీకులు మనసులో పెట్టుకుని పథకం ప్రకారం హత్య చేశారని చెప్పారు. హత్యలో ఇంకా ఎవరైనా ఉంటే దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవి, సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, ఇతర పోలీసులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేత పదవి కోసం కత్తులతో పొడుచుకుంటున్నారు

కేసీఆర్‌లా ఎలక్షన్... కలెక్షన్ చేయలేను : కేటీఆర్, హరీశ్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా

నవతెలంగణబ్యూరో-హైదరాబాద్



ప్రతిపక్ష నేత పదవి కోసం మాజీ మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీశ్‌రావు ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సారైనా ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వస్తారో, రారో చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్, హరీశ్‌రావు తన కాలి గోటికి కూడా సరిపోరని స్పష్టం చేశారు. కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా? బండి సంజయ్‌కుమార్ ఉన్నరా? అని చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాగాయకులు గద్దర్‌కు అవార్డ్ ఇస్తే తప్పేంటని నిలదీశారు. కాంగ్రెస్ సమావేశాల్లో పల్లీలు, ఐస్ క్రీంలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ నిర్వహించే సమావేశాలకు రావడం లేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో టీ హబ్‌కు తాళం వేసిందే కేటీఆర్ అని ఆరోపించారు. కేటీఆర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ముఖాముఖీ కార్యక్రమం

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చెప్పే సమస్యలను విని, పరిష్కరించేందుకు బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. తెలుగు సినీ ఇండస్ట్రీకి తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం డబ్బింగ్ థియేటర్ నిర్వాహకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీ కళాకారులు, కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కషి చేస్తున్నామని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. దేశంలోనే తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. వాటిని మరింతమెరుగు పర్చుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి అన్నారు.

సినిమా ఇండస్ట్రీని మరింత విస్తరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే వాటి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. ముఖాముఖి కార్యక్రమంలో తమ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ 799 దరఖాస్తులు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మణికొండ మున్సిపల్ చైర్మెన్ నరేంద్ర, సినీ నిర్మాతల మండలి అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రెటరీ అనుపమరెడ్డి, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్, నల్లగొండ డీసీఎంఎస్ చైర్మెన్ బొల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి మహేష్‌కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీకి టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఫోన్‌లో ఆయన్ను అభినందించారు. జాన్‌వెస్లీ దశాబ్దాల కాలంపాటు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడుతున్నారని తెలిపారు. అటువంటి నేత సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. దేశంలో, రాష్ట్రంలో మతతత్వ శక్తులను, అవినీతి పరులను, నియంతలను ఓడించేందుకు లౌకిక భావ సిద్ధాంతాలతో కలిసి పని చేద్దామని ఆయన్ను కోరారు.

రాష్ట్రంలో అప్రకటిత పోలీస్ పాలన

- సచివాలయం ఉండగా కమాండ్ కంట్రోల్ ఎందుకు?: బీఆర్ఎస్ నేత మధుసూధనాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అప్రకటిత పోలీస్ పాలన నడుస్తోందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య, డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కట్టిన అంత పెద్ద సచివాలయం ఉండగా పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు సమీక్షలు చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్, మాఫియా పాలన తెచ్చేందుకే తరచూ కమాండ్ కంట్రోల్‌కి వెళ్తున్నారని ఆక్షేపించారు. పోలీసులను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పథకాలపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పుకోలేక పెట్టుబడులపై మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. దావోస్‌లో కుదిరే పెట్టుబడుల్లో చాలా వరకు రావని గత అనుభవాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. గతేడాది రూ.40 వేల కోట్లల్లో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు లభించాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒత్తిడిని తట్టుకోలేక కేసీఆర్, కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలపై రేవంత్ అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మేఘా కంపెనీని ఈస్ట్ ఇండియా కంపెనీతో పోల్చిన సీఎం అదే సంస్థతో ఎందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని ప్రశ్నించారు. అనంతగిరి అడవులను ఆ సంస్థకు రూ.వెయ్యి కోట్లకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు

అర్హులందరికీ పథకాలను వర్తింపజేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



అర్హులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇండ్ల పథకాలను వర్తింపజేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12,991 గ్రామ పంచాయతీలుండగా మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను మాత్రమే ఎంపిక చేయడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో అర్హులైన రైతులు 70 లక్షల మంది ఉంటే నేటి వరకు 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పది లక్షల మంది వ్యవసాయ కూలీలుంటే కేవలం 20 వేల మంది లబ్దిదారులనే గుర్తించడమేంటని నిలదీశారు. 40 లక్షల కొత్త రేషన్ కార్డులిస్తామని 42, 267 మందిని మాత్రమే గుర్తించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలు అర్హత కలిగి ఉంటే ఒక్కరికి కూడా ఇంటిని నిర్మించకపోవడం సిగ్గు చేటని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రులు ప్రజలకు ఒక మాట ఇచ్చారంటే అదే శాసనంగా అమలయ్యేవని గుర్తుచేశారు. కేంద్రం ఉచితంగా రేషన్ ఇస్తున్నందున రేషన్‌షాపుల్లో, రేషన్‌కార్డులపై ప్రధానమంత్రి ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు.

రేవంత్ పాలనలో మైనార్టీల హక్కుల హరణ

- బీఆర్ఎస్ నేతలు, ఇంతియాజ్ అహ్మద్, అబ్దుల్ కలీం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో మైనార్టీల హక్కులు హరించబడుతున్నాయని బీఆర్ఎస్ నేతలు ఇంతియాజ్ అహ్మద్, అబ్దుల్ కలీం విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతుంటే, సీఎం మాత్రం రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జు మైనార్టీల అంతు చూస్తామనీ, దానం నాగేందర్ ఓల్డ్ సిటీలో భవనాలు కూల్చాలని బెదిరించినా సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మైనారిటీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక్క హామీ అమలు కావడం లేదని గుర్తు చేశారు. సబ్ ప్లాన్, ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనాలు, నిధుల కేటాంపులు మొదలగు హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ మంత్రివర్గంలో ఎంతమంది మైనార్టీలకు స్థానం కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బైకాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్‌పై పనిభారం తగ్గించాలి

- ప్రయివేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా పోరాటం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్‌పై పనిభారం తగ్గించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న ప్రయివేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) జోనల్ మహాసభ జరిగింది. ఎల్ఆర్ఎస్ఏలో ఉద్యోగులకు కిలోమీటర్ అలవెన్స్ తప్పనిసరిగా పెంచాలనీ, ప్రయాణికుల భద్రతారీత్యా నైట్ డ్యూటీలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలనీ, ఏడో పే కమిషన్ అనామాలిస్‌ను సరిదిద్దాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌పై ఎల్ఆర్ఎస్ఏ సిబ్బంది ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంబానీ, అదానీ వంటి గుత్త సంస్థలకు రైల్వే రంగాన్ని కారుచౌకగా కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రజారవాణాలో దేశంలో ముఖ్యభూమిక పోషిస్తున్న రైల్వే రంగాన్ని కార్పొరేటీకరించడం అన్యాయమని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..రైల్వే రంగంలో మోడీ సర్కారు అమలు చేస్తున్న నష్టదాయక విధానాలకు వ్యతిరేకంగా వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ చేపట్టనున్న క్యాంపెయిన్‌లో రైల్వే రంగంలోని అన్ని విభాగాల సిబ్బంది భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

బొల్లారం ఆర్మీ స్కూల్‌కు బాంబు బెదిరింపు

- ఫేక్‌గా తేల్చిన ఆర్మీ, సివిల్ పోలీసులు

నవతెలంగాణ-కంటోన్మెంట్



హైదరాబాద్ బొల్లారంలోని ఆర్మీ స్కూల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అయితే అది ఫేక్ అని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకెళ్తే.. ఆర్మీ స్కూల్‌కు బుధవారం ఉదయం ఆగంతకులు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సమాచారాన్ని పెట్టారు. దాంతో అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను ఇంటికి పంపించారు. అనంతరం పాఠశాలను ఆర్మీ, సివిల్ పోలీసులు, బాంబు స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అది ఫేక్ మెసేజ్ అని తేల్చారు. ఆర్మీ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మెయిల్ తమిళనాడు నుంచి వచ్చినట్టు సమాచారం.

జీఆర్ఎస్ఇ, ఎఎంఎస్ కీలక భాగస్వామ్యం



నవ తెలంగాణ - హైదరాబాద్

గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఇ), అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఎఎంఎస్) సంస్థలు కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపాయి. ఈ భాగస్వామ్యంలో ముందస్తు రక్షణ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలను అభివృద్ధి, సరఫరా చేయాలని నిర్ణయించాయి. ఐదేళ్ల కాలానికి గాను సంయుక్తంగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి), సహ ఉత్పత్తి కోసం వ్యాపార భాగస్వామ్యాన్ని నెలకొల్పడానికి ఒప్పదం కుదుర్చుకున్నాయి. నీటి అడుగున ఆయుధాలు, వాహనాలు, నీటి అడుగున గనులు, నీటి అడుగున కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఎగుమతి, రక్షణ, రక్షణేతర పరిశ్రమల కోసం అధునాతన ఆయుధాలు, ఎలక్ట్రానిక్ సిస్టమ్‌ల సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నాయి. ఈ సహకారంలో అత్యాధునిక సాంకేతికతల అభివృద్ధి, ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించాయి.

సిర్పూర్ పేపర్‌మిల్లుల్లో ఎన్నికలు నిర్వహించాలి

- ది సిర్పూర్ పేపర్ మిల్స్ మజ్దూర్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సిర్పూర్ పేపర్‌మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో వెంటనే నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.మధు, వై.సోమన్న, ది సిర్పూర్ పేపర్ మిల్స్ మజ్దూర్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుశన రాజన్న కార్మిక శాఖను కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్‌లో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ (పరిపాలన) ఎం.నీలమ్మ కు వినతిపత్రాన్ని అందజేశారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లులో 2024 నవంబర్‌లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్టే ప్రారంభించి నిలిపేశారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని కార్మిక సంఘాలు తమ వివరాలను, యానువల్ రిటర్న్‌ను అందజేశాయని చెప్పారు. ఇప్పటికీ ఐదు నెలలు గడుస్తున్నా ఆదిలాబాద్ డీసీఎల్ ఆఫీస్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి రెండేండ్లకోసారి పేపర్‌మిల్లులో ఎన్నికలు జరిగేవనీ, గుర్తింపు సంఘంతో యాజమాన్యం చర్చించి వేతన ఒప్పందం చేసేదని గుర్తుచేశారు. 2013 నుంచి ఆ ప్రక్రియ ఆగిపోయిందనీ, 2014 నుంచి 2018 వరకు కంపెనీ షట్‌డౌన్ అయిందని తెలిపారు. తిరిగిన పునర్దురణ అయ్యి ఏడేండ్లు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించట్లేదని వాపోయారు. దీంతో యాజమాన్యానికి సమస్యలు తీసుకెళ్లడానికి కార్మికులే కమిటీగా ఏర్పడి విన్నవించుకున్నా పట్టించుకునే పరిస్థితిలో జేకే యాజమాన్యం లేదని విమర్శించారు. క్యాంటీన్ సౌకర్యం లేదనీ, సెలవుల్లో కోతపెట్టారని వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే పేపర్‌మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వెంటనే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలి

- మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం తగదు :సీపీఐ సెమినార్‌లో వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని వామపక్ష పార్టీల నాయకులు, పలువురు మేధావులు డిమాండ్ చేశారు. "నక్సల్స్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం" అనే అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో వామపక్షాల నాయకులు డి.జి.నరసింహారావు (సీపీఐ(ఎం), చలపతిరావు (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), కె.మురహరి (ఎస్‌యుసీఐ) రమేశ్ (సీపీఐఎంఎల్ లిబరేషన్), ప్రసాద్ (సీపీఐఎంఎల్), ప్రసాద్ (ఫార్వర్డ్ బ్లాక్), అనిల్ (ఎంసిపిఐ(యు)లతో పాటు మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తదితరులు ప్రసంగించారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

డిజి నరసింహారావు మాట్లాడుతూ గత పదేండ్లకుపైగా అధికారం చెలాయిస్తున్న బీజేపీ దేశంలో పోలీసు, మిలిటరీ తదితర వ్యవస్థలన్నింటినీ చెప్పుచేతల్లో పెట్టుకుని నిర్బంధం కొనసాగిస్తున్నదని విమర్శించారు. దేశంలో ఎప్పుడు లేనంత భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మావోయిస్టులు, ప్రజా వ్యతిరేకులను మట్టుపెడతామని హెచ్చరిస్తూ, రాజ్యాంగ విరుద్ధంగా నిర్మూలన చేపట్టారని తెలిపారు. ప్రజలు ప్రశ్నించేందుకు రాజ్యాంగం స్వేచ్ఛనిచ్చిందని గుర్తుచేశారు. అల్ప సంఖ్యాకులనూ నిర్మూలిస్తున్నారని తెలిపారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేకంగా చేస్తున్న నిర్మూలనను ఆపేందుకు ఒక వేదిక, ఒక సమావేశం సరిపోదని అభిప్రాయపడ్డారు. పెద్ద ఎత్తున ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరముందన్నారు. పౌర హక్కుల పరిరక్షణకు ప్రజలను కదిలించాలని సూచించారు. మానవ హక్కులను హరిస్తున్నారనీ, 400 సీట్లు కంటే ఎక్కువగా వస్తాయని ఆశించిన బీజేపీకి గతంలో కన్నా సీట్లు తగ్గినా అవే విధానాలను కొనసాగిస్తుందని విమర్శించారు. బీజేపీ అణచివేత విధానాలను ఖండించారు. ఉద్యమంలో తాము సైతం చేయూతగా ఉంటామన్నారు.

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రశ్నించే వారిని చంపితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మావోయిస్టుల తరపున గొంతు వినిపిస్తామని స్పష్టం చేశారు. పోలీసులను చంపొద్దని మావోయిస్టులను కోరారు. అవసరమైతే వారిని కౌన్సిలింగ్‌కు పంపించాలని సూచించారు. మావోయిస్టులు పునరాలోచించాలని ఎన్నికల క్రమంలో ప్రజలను సన్నద్ధం చేయాలని కోరారు. ప్రజల ద్వారా ప్రజా ఉద్యమాలను పెంపొందించాలన్నారు. ప్రజలను మనవైపు ఉండేలా తయారు చేసుకోవాలన్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను చంపేందుకే మంత్రి అయ్యారా? అని ప్రశ్నించారు.ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ నోరు విప్పడం, ప్రశ్నించడం నేటి చారిత్రక అవసరమని తెలిపారు. ఇప్పుడు ప్రశ్నించకపోతే ఊహించని పరిణామాలను చూడాల్సి వస్తుందని అప్రమత్తం చేశారు. నయా ఉదారవాద విధానాల అమలుతో మానవ సంబంధాలు సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. బస్తర్ ఖనిజ సంపద కోసమే అయితే దానిని రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలన్నారు. కేవలం కార్పొరేట్లకు ఖనిజ సంపదను అప్పగించేందుకే బీజేపీ సర్కారు కుట్రలని విమర్శించారు. హిట్లర్ ఫాసిజం మరో రూపంలో వస్తోందని హెచ్చరించారు. ఆదివాసీలతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో జరుగుతున్న యుద్ధం గనుక తాము ప్రశ్నిస్తున్నామని చెప్పారు. థార్ ఎడారిలో పరస్పరం యుద్ధం చేసుకుంటే తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. తుపాకి పట్టుకున్న మావోయిస్టుల వద్దకు పేదలు స్వేచ్ఛగా వెళతారనీ, అదే పోలీసుల వద్దకు కోటీశ్వరులు వెళుతున్నారని చెప్పారు. అదే తుపాకీ పట్టిన పోలీసు వద్దకు పేదలు స్వేచ్ఛగా వెళ్లగలిగితే పోరాటాలే అవసరముండవని చెప్పారు. మావోయిస్టుల చర్యలు సమర్థనీయం కాకపోయినా వారి పట్ల జరుగుతున్న అమానుష ఘటనలను ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులు ఏకమై దాడులను నిలువరించాలని సూచించారు. ఈ దాడులను నిలువరించకపోతే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్‌కౌంటర్లు జరిగితే న్యాయవిచారణ ఉండేదనీ, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజం మౌనంగా ఉన్నందునే ప్రశ్నించే గొంతులను అంతమొందిస్తున్నారని తెలిపారు. మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తామని గతంలో చాలా మంది చెప్పారనీ, ఇప్పుడు అమిత్ షా చెబుతున్నారని తెలిపారు. ఒకవేళ అమిత్ షా ప్రకటించినట్టు మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తే, ఆ తర్వాత ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అని అన్నారు. ప్రజలు ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ప్రశ్నిస్తూనే ఉంటారని గుర్తుచేశారు.

చలపతిరావు మాట్లాడుతూ హమాస్ - ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందనీ, ఆ దిశగా ప్రయత్నాలు జరగాల్సిన అవసరముందని తెలిపారు. ప్రభుత్వ నిర్బంధంపై సభ్య సమాజం నిరసన తెలపాలని సూచించారు. మురహరి మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టేందుకు ప్రజా ఉద్యమ నిర్మాణం తక్షణావసరమని తెలిపారు. ప్రసాద్ (సీపీఐఎంఎల్) మాట్లాడుతూ అందరినీ కలుపుకుని విశాల వేదిక ఏర్పడాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో అన్ని వర్గాల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమం జరగాలని ఆకాంక్షించారు. ప్రసాద్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్) మాట్లాడుతూ సొంత ప్రజలపై యుద్ధం చేయడాన్ని 1946 జెనీవా ఒప్పందం వ్యతిరేకిస్తుందని గుర్తుచేశారు. అనిల్ మాట్లాడుతూ మనుషులను చంపగలరే గానీ వారి ఆలోచనలను కాదంటూ అమిత్ షా ప్రకటనను ఖండించారు.

యాదగిరిగుట్టకు దేవస్థానం బోర్డు

- టీటీడీ తరహాలో...: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలోనే యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటును వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటు, సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను ఆయన సూచించారు. యాదగిరిగుట్ట బోర్డు నియామక నిబంధనలపై బుధవారంనాడాయన తన నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుమలలో మాదిరే యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలనీ, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయం సరికాదు

- సమ్మె నోటీసుపై టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ వివరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో జేఏసీ పేరుతో ఏకపక్షంగా సమ్మె నోటీసు ఇవ్వడం సరికాదని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) స్పష్టంచేసింది. ఈ విషయంలో తమ సంఘంపై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్నకి లేఖ రాసింది. విశాల ఐక్యత కోసం పునరాలోచించాలని విజ్ఞప్తి చేసింది. జేఏసీగా సమ్మె నోటీసు ఇచ్చే విషయంలో ఎస్‌డబ్ల్యూఎఫ్‌కు కూడా లేఖ రాసినట్లు కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో మీరు పోస్టింగ్ పెట్టినట్టు తమ దృష్టికి వచ్చినట్టు పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు తమకు భౌతికంగా కానీ, సామాజిక మాధ్యమం ద్వారా కానీ ఎలాంటి లేఖ అందలేదని రాష్ట్ర కమిటీ తరపున ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు స్పష్టం చేశారు. కనీసం ఎవరి నుంచి ఫోన్ ద్వారా కూడా సమాచారం లేదని చెప్పారు. "మీరు వాట్సాప్‌లో పెట్టిన పోస్టింగ్ వల్ల మా యూనియన్ ప్రతిష్టకు భంగం కలుగుతుంది. కాబట్టి అటువంటి తప్పుడు ప్రచారం సరైంది కాదు. ఇప్పటికైనా వాటిని ఆపాలి" అని ఆ లేఖలో కోరారు. జేఏసీగా సమ్మె నోటీస్ ఇచ్చిన విషయాన్ని పత్రికల్లోనే చూసామనీ, దీనిపై ఫెడరేషన్ అభిప్రాయం మీ దృష్టికి తీసుకురావాలని భావించామని తెలిపారు. కార్మికులను సమ్మెకు సిద్ధం చేయడం, అన్ని కార్మిక సంఘాలను ఒకే వేదిక పైకి తెచ్చే కృషి చేయడం, సమ్మె నోటీసు ఇస్తామని ప్రకటన చేయడానికి ముందే అన్ని కార్మిక సంఘాలను సంప్రదించడం, సమస్యలపై ఉమ్మడి అభిప్రాయానికి రావడం, ఆ మేరకు కార్యాచరణ నిర్ణయించడం వంటి వాటిలో ఏ ఒక్కటీ మీ నాయకత్వంలోని జేఏసీ చేయకుండా, ఏకపక్షంగా సమ్మె నోటీసు ఇవ్వడం సరైంది కాదని తాము భావిస్తున్నామని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికైనా పునరాలోచన చేయాలని కోరారు.

సీసీఎల్ఏలో భూపాలన సెల్ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)లో భూపాలన సెల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం జీవో 8ని జారీ చేశారు. "రెవెన్యూ ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్స్, లీగల్ సపోర్ట్" పేరిట ముగ్గురు సభ్యులతో సెల్ ఏర్పాటు కానుంది. చట్టపరమైన పరిశోధన, డ్రాఫ్టింగ్ విధానాలు, భూ నియమనిబంధనలు, భూ పరిపాలన మెరుగు పరచడానికి సిఫారసులు చేయడం, క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం లేవనెత్తిన సమస్యలపై వివరణలు ఇవ్వడంలో సహాయం చేయడం, పెండింగ్‌లో ఉన్న భూ కేసులపై న్యాయపరమైన అభిప్రాయాన్ని అందించడంలో ఈ సెల్ పూర్తి స్థాయిలో పనిచేయనుంది. న్యాయ శాస్త్రంలో పట్టా ఉండి 20 ఏండ్ల పాటు భూ విషయాలపై అనుభవమున్న వారిని ఈ సెల్‌లో నియమించనున్నట్టు సీసీఎల్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సభ్యుల ఎంపిక పూర్తయిన తర్వాత సెల్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నట్టు సమాచారం.

విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి

- నేర రహిత సమాజమే ధ్యేయం
- నేరాల తగ్గింపునకు సమన్వయంతో కృషి చేయాలి : డీజీపీ జితేందర్
- రాచకొండ కమిషనరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో



పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి ప్రజలతో మమేకమై పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీపీ సుధీర్ బాబుతో డీజీపీ బుధవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీ స్థాయి అధికారులతో నేరేడ్‌మెట్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారుల నుంచి సంబంధిత జోన్లు, అడ్మిన్, ట్రాఫిక్, క్రైమ్, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఎస్ఓటీ, రిజర్వు పోలీస్ వంటి విభాగాల వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను ప్రత్యక్షంగా సందర్శించి, పనితీరును సమీక్షించాలని చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో దేశంలోని టాప్ పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండటం గర్వకారణమని, ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టంగా ఉందని అన్నారు. ఇక్కడున్న 24 గంటల పెట్రోలింగ్ గస్తీ వంటి ఏర్పాట్ల ద్వారా నెలకొన్న ప్రశాంత వాతావరణం వల్లే రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే పెట్టుబడులు కూడా అధికంగా వస్తున్నాయని, తలసరి ఆదాయంలో కూడా మన రాష్ట్రం ముందజలో ఉందని వివరించారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేర పరిశోధనలో, సాంకేతిక ఆధారాలను, సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికల మీద నిఘా ఉంచాలన్నారు. తిరిగి వారు నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన నేర న్యాయ చట్టాల గురించి అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. చట్టపరిధిలోనే పని చేయాలని, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలని, గరిష్ట శిక్షా రేటు సాధించేలా కృషి చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని చెప్పారు.

డ్రగ్స్ సరఫరా, వినియోగం మీద ఉక్కుపాదం మోపాలన్నారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ట్రాఫిక్ విభాగం ప్రాధాన్యతను వివరించారు. ట్రాఫిక్ పోలీసుల వల్లే నగరాల్లో ఎన్నో నేరాలు, రోడ్డు ప్రమాదాలు అదుపులో ఉన్నాయని డీజీపీ అభినందించారు. అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో పని చేయాలని, సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి రాష్ట్రస్థాయి పతకాలు, ప్రోత్సాహకాలు అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ ఎస్ఓటి 1 రమణారెడ్డి, డీసీపీ ఎస్ఓటి 2 మురళీధర్, డీసీపీలు ట్రాఫిక్ మల్లా రెడ్డి, శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ ఇందిర, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీళ్లు-నిజాలు పేరుతో ఈ నెల 31న సాగునీటి ప్రాజెక్టులపై హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటల నుంచి తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్లు పాల్గొననున్నారు. కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఒక ప్రణాళికను ప్రజల ముందు పెట్టడం, ప్రాజెక్టులపై చర్చించి తీర్మానాలు ఆమోదించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాలపై సుదీర్ఘంగా చర్చించి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని వారు చెప్పారు.

కమిషన్‌దారులు, వ్యాపారుల ఆగడాలు అరికట్టాలి

వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు, కమిషన్ దారుల ఆగడాలను అరికట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ రైతుల ఆందోళన కనిపించడం లేదా ? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అసలే దిగుబడి లేక సతమతమవుతున్న రైతుకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క వ్యాపారుల మోసం, మరొపక్క ప్రభుత్వం శీతకన్ను వేయడం వల్ల వేరుశనగ రైతుల ఆందోళనతో మహబూబ్‌నగర్ జిల్లా అట్టుడుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల బందోబస్తు నడుమ వేరుశనగ కొనుగోలు జరపాల్సిన దుస్థితి రావడం దారుణమన్నారు. కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు.

ప్రిన్సిపాల్, క్లర్క్ వేధిస్తున్నారు

- రహస్యంగా నా వీడియోలు తీశారు
- బేగంపేట్ మహర్షి కాలేజీలో అధ్యాపకురాలి ఆందోళన



నవతెలంగాణ-బేగంపేట

తనను రహస్యంగా వీడియోలు తీసి మహర్షి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, క్లర్క్ వేధిస్తున్నారని అదే కళాశాలకు చెందిన ఓ అధ్యాపకురాలు సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు బుధవారం బేగంపేటలోని మహర్షి కళాశాల ముందు ఆందోళన చేపట్టారు. ఆమెకు మద్దతుగా విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు కూడా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజినీ, క్లర్క్ స్వామి తనను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25న వారు తన వీడియోలు రహస్యంగా తీశారని ఆరోపించారు. ఇదే విషయమై 27న బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తన పట్ల కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై ఆవేదన చెందారు. తనకు న్యాయం చేయాలని, తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య అక్కడకు చేరుకుని ఇరువర్గాల వాదన విన్నారు. ఇరువర్గాల వారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పూర్తి విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అలాగే, ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని ఎక్కువగా మాట్లాడలేమని చెప్పారు. కాలేజీలో ప్రిన్సిపాల్ పోస్ట్ కోసం ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు వివాదానికి కారణమైనట్టు పోలీసులు భావిస్తున్నట్టు తెలిసింది.

ఫిబ్రవరి 15న గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలి

- సీతక్కతో గిరిజన ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15లోపు గిరిజన సలహ మండలి ఏర్పాటు చేయాలని గిరిజన ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరారు. బుధవారం హైదరాబాద్ మంత్రి సీతక్కతో ఎంపీ బలరాం నాయక్, విప్ రామచంద్రనాయక్, గిరిజన ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధుల సమావేశమయ్యారు. ఆ సమావేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా గిరిజన సంఘాలతో సీఎం సమావేశం ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. గోర్ బోలి, ఆదివాసీ భాషలను రాజ్యాంగంలో 8వ షెడ్యూల్ లో చేర్చేలా అసెంబ్లీ లో తీర్మానం చేసే విషయంపై చర్చించారు.

అర్హులైన పేదవాడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అర్హులైన ప్రతి పేదవాడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని కాంగ్రెస్ గన్ ఫౌండ్రి డివిజన్ అధ్యక్షుడు పి.చంద్రమోహన్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన కార్యాల యంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో అర్హులై న ప్రతి ఒక్కరికీ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తు అమలు చేస్తుందని చెప్పారు. ఎవరు అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 2 లక్షల వరకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణం, గ్యాస్ సిలిండర్లు 500లకే అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, పథకాలను లాంటి పథకాలతో ప్రజల మన్నన లు పొందిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

'నిరుద్యోగ యువతకు ఉచిత 'డేటా ఇంజినీర్ కోర్సు'

- తెలంగాణ శ్రీ సత్యసాయి సేవా సంస్థ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ యువతకు విలువైన కెరీర్ అవకాశాలను అందించే ప్రయత్నంలో తెలంగాణ శ్రీ సత్యసాయి సేవా సంస్థ, శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 'ఉచిత డేటా ఇంజనీర్ కోర్సు'ను ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందు తున్న డేటా ఇంజనీరింగ్ రంగంలో విజయవంతం కావడానికి అవసరమైన నైపుణ్యాలతో నిరుద్యోగ గ్రాడ్యుయేట్‌లను సన్నద్ధం చేయడమే సంస్థ లక్ష్యమని పేర్కొంది. ఈ కోర్సుకు అర్హత బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏలో డిగ్రీలు కలిగి ఉన్న 2021-24 పాస్ అవుట్ గ్రాడ్యుయేట్లందరికి అవకాశం ఉంటుందని, శిక్షణా కార్యక్రమం డేటా ఇంజనీరింగ్‌లో ప్రయోగాత్మక అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం www.sethu.aiలో నమోదు చేసుకోవచ్చునని లేదా ఫోన్: 9052372023 నెంబర్ ను సంప్రదించాలని ఆ సంస్థ పేర్కొంది.

త్వరలో ఆకస్మిక తనిఖీలు చేస్తా

- ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తీర్ణత అయ్యేలా చూడాలి
- మెరుగైన ఫలితాల కోసం స్పెషల్ క్లాస్‌లు, స్లిప్ టెస్ట్ నిర్వహించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

త్వరలో పాఠశాలలు, కళాశాలలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీవితంలో ఎస్ఎస్‌సీ పరీక్ష ఉత్తీర్ణత తొలి మెట్టని ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల లక్ష్య సాధనకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియేట్ లో ఉత్తీర్ణత శాతం పెంపుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జీవితంలో తొలిమెట్టని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్ లో మెరుగైన ఫలితాలు సాధించే విదంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి సాధించేలా కృషి చేయాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న టీచర్ల కొరత పూర్తి చేస్తామని అలాగే అన్ని సబ్జెక్ట్‌లకు టీచర్స్ ఉన్నారన్నారు. అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించామని, పిల్లలో పరీక్షల భయం ఉండకుండా ముందుగా ప్రత్యేక తరగతులులలో స్లిప్ టెస్ట్, గత ప్రశ్న పత్రాలపై పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బంగారు తెలంగాణ నిర్మాణం కోసం జ్ఞానవంతులను తయారు చేయడానికి ఉపాధ్యాయులు తమ యొక్క జ్ఞానాన్ని అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లో మాట్లాడే గలిగే, మెరుగా రాయగలిగే, సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కొనే పుణ్యాలను విద్యార్థులలో పెంపొందించాలన్నారు. హైదరాబాద్ జిల్లాను ఎస్ఎస్‌సీ ఇంటర్మీడియట్ పరీక్షల రిజల్ట్స్‌లో టాప్ లో ఉండేలా చూడాలని ఆదేశాల పని చేసిన ఉపాధ్యాయులకు ఆగస్ట్ 15న అవార్డు ఇచ్చి సన్మానించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వచ్చే జూన్‌లో విద్యాపరమైన అంశాల పై సమావేశం ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. మంత్రి ఈ సందర్భంగా గత సంవత్సరంలో జిల్లాలో పదవతరగతి ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ శాతం ఈ సంవత్సరంలో ఉతీర్ణత శాతం పెరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై మండలాల వారీగా సమీక్షించారు . హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలలో ఎక్కడకూడా సబ్జెక్ట్ టీచర్ల కొరత లేదని మాథ్స్, సైన్స్ సబ్జెక్ట్ లలో వెనుకంజలో ఉన్న పిల్లలకు ప్రత్యేక బోధన కల్పించాలని సూచించారు. పరీక్షలంటే పిల్లలలో భయం లేకుండా మెరుగైన విద్యాబోధనతో జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. పిల్లలకు మార్గదర్శనం చేయాలని, ఏమైనా లోటు పాట్లు, సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ ఈ. వెంకటాచారి, డీఈఓ రోహిణి, డీఐఈఓ ఒడ్డెన్న, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికా రులు కోటాజీ, ఆశన్న, ఇలియాస్ అహ్మద్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, లెక్చలర్స్ తదితరులున్నారు.

ధాన్యం పేరుతో దండుకున్న అధికారులను సస్పెండ్ చేయాలి

- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్న డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీ విశ్వనాథ్ వనపర్తి డీఎస్ఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్న తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించి, తన కార్యాలయంలో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బంధువుల అకౌంట్‌లోకి డబ్బులు వేయించుకున్నారని ఆరోపించారు. పక్క జిల్లా మిల్లులకు కేటాయింపులు చేసినందుకు బస్తాకు రూ.5 దండుకున్నారని, కొన్ని మిల్లుల నుంచి ఏక మొత్తంగా రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు లంచాలు తీసుకున్నారన్నారు. పాత డీఎం ఇర్ఫాన్ డిప్యూటేషన్ మీద వెళ్లిన కాశీ విశ్వనాథ్ తోడు దొంగల్లా దోపిడీ చేసి పీవీ పేరుతో వసూళ్లకు పాల్పడి ఆపై వాటాలేసుకున్నారని మండిపడ్డారు. అధికారులు చేసిన నిర్వాకం వల్ల ఉపాధి కోసం మిల్లులు పెట్టుకున్న 40 మందితో పాటు వాటిలో పని చేసే కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేద న వ్యక్తం చేశారు. కాశీ విశ్వనాథ్ ప్రస్తుతం సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారన్నారు. అధికారుల అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టే పరిస్థితి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వి.వి గౌడ్, సంపత్ కుమార్, గాలిగల్ల సాయి బాబా, మహేందర్ నాయుడు, బత్తుల జితేందర్ గౌడ్, రమేష్ సాగర్, తిరుపతయ్య గౌడ్, దేవర శివ, గౌతమ్ శంకర్, మేఘునాథ్ గౌడ్ తదితరులున్నారు.

మాదిగ హక్కుల సాధనకు పోరాటం..

జియాగూడ సన్నహాక సదస్సులో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కుమ్మరి సత్యనారాయణ మాదిగ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మాదిగ హక్కులు సాధించేవరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, కార్వాన్ నియోజక వర్గం కుమ్మరి సత్యనారాయణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు లక్షల డప్పులు వెయ్యిల గొంతులు.. కార్యక్రమంలో భాగంగా కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్‌లో నియోజకవర్గం నాయకులు మ్యాతరి చంద్ర మోహన్ మాదిగ ఆధ్వర్యంలో సన్నాహాక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మాదిగ హక్కు అన్నారు. హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ డప్పులతో గొంతు లేపాలన్నారు. డప్పు నినాదాలే మన గొంతుక అన్నారు. కుల వర్గ భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు, సంఘాలు మద్దతునిస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. మన లక్ష్య సాధనకై లక్షల డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో నియోజకవర్గాల్లోని బస్తీల ప్రజలు పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టు కుంది. ఈ సదస్సులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పీఎస్ రాజు మాదిగ, నియోజకవర్గం నాయకులు మ్యాతరి చంద్రమోహన్ మాదిగ, మిర్యాల నవీన్ మాదిగ, డివిజన్ నాయకులు భోగి నాగేందర్ మాదిగ, గంగాధర్ నరేందర్ మాదిగ, భోగి దేవరాజ్ మాదిగ, కోర్వన్ దేవేందర్ మాదిగ, వినాయక అశోక్ మాదిగ, భూపతి మాదిగ, బస్తీ పెద్దలు మధిర సత్య నారాయణ, మధిర మహేష్, చాట్ల బాబు, పాలెం వెంకటేష్, గాజపాక చెన్నయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

'గద్దర్‌పై ఆరోపణలను బండి సంజయ్ భేషరతుగా వెనక్కి తీసుకోవాలి'

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంస్కృతిక ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను అవమానించేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు ఆయనను మంత్రి పదవీ నుంచి భర్తరఫ్ చేయాలని, ఆ వ్యాఖ్యలను బండి సంజయ్ భేషరతుగా వెనక్కి తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణ సంస్కృతిని, సమాజాన్ని అవమానపర్చేలా హోదాను మరిచి వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం సాక్షిగా పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన బండి సంజయ్, కేంద్ర పురస్కార అవార్డుల అంశంలో ఏ అధికారంతో గద్దర్ గురించి ప్రస్తావించారో తెలపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ బీజేపీ నేతలు చెప్పిన వాళ్లకే అవార్డుల ప్రధానం జరిగితే ఈ దేశంలో ద్వంద విధానాలు, విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ట్లేనని ఆరోపించారు. బండి సంజయ్ బహిరంగంగా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్య క్షులు మధు, కార్యదర్శి పి.శివకుమార్, కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, అనీల్, హేమంత్, అరుణ్, భగత్ సింగ్, వీరేశ్, భానుప్రకాష్, సంజయ్, నగేష్, వంశీ, గణేష్, చెట్టుకింద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాధనతో అద్భుతంగా రాణిస్తారు

- భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్యార్థులు నేర్చుకున్న నృత్యం, గానం, కథక్, కూచిపూడి నృత్యాలను సాధన చేయడం వల్ల అద్భుతంగా రాణిస్తారని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల 72వ వార్షికోత్సవాన్ని బుధవారం రామ్ కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత ముత్య కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వివిధ కళలలో రాణించడానికి విద్యార్థులు నేర్చుకున్నది సాధన చేయడమే మార్గమన్నారు. మువ్వలకు జీవం లేకున్నా మీ కాళ్లకు చుట్టుకున్నప్పుడు వాటిలో జీవం వచ్చి మీతో పాటు అవి పరిమళిస్తాయని చెప్పారు. నర్తకితో పాటు మువ్వలు కూడా నాట్యం చేస్తాయన్నారు. కళాశాల వార్షికోత్సవ సందర్భంగా మొదటగా నాదస్వరం, వీణ, తబలా, కర్ణాటక గాత్రం, హిందుస్థాని గాత్రం, కథక్ నృత్యం వంటిని విద్యార్థులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ పాండురంగ్ ముతాలిక్ మాట్లాడుతూ.. లలిత కళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గత ఏడు కంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విశ్రాంత అధ్యాపకులు లలిత కురులకర్, కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్, చైల్డ్ రైడ్ కమిషన్ సభ్యు లు శోభా రెడ్డి, కళాశాల అధ్యాపకులు పి.జయలక్ష్మి టీవీ రవికాంత్, జి.లావణ్య లత, కే.రాజగోపాల్ చార్య, రవి చంద్ర, పవన్ కుమార్ రెడ్డి, బి శ్వేత, భాగ్యలత, ఇందిరా, రవీందర్ రాజు, కృష్ణా, నాగరాజు, పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థినిలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశంలో అన్ని రాష్ట్రాలలో ఒకే పెన్షన్ విధానం చేయాలి

డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్, కో కన్వీనర్‌లు వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేశ్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒకే పెన్షన్ విధానం చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్, కో కన్వీనర్‌లు వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేశ్ గౌడ్‌లు కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వికలాంగుల సామాజిక న్యాయ విభాగం జాతీయ కార్యదర్శి డాక్టర్ రాజేశ్ అగర్వాల్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 20 కోట్ల జనాభా గల వికలాంగులకు ఎలాంటి సంక్షేమ పథకాలు చేయకపోవడం చాల అన్యాయమన్నారు. అన్ని రాష్ట్రాలలో పెన్షన్ సమానంగా రూ.10వేలు ఇవ్వాలని, చట్ట సభలో వికలాంగులకు రిజర్వేషన్ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం ద్వారా న్యాయం చేస్తామని డాక్టర్ రాజేశ్ అగర్వాల్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నాయకులు పాల్గొన్నారు.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల విలీన సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఫిబ్రవరి 5న సూర్యాపేటలో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో తెలంగాణ రాష్ట్ర విలీనసభను జయప్రదం చేయాల్సిందిగా అరుణోదయ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ కొండల్, కోలా స్వప్న కోరారు. బుధవారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర విలీన సభ యొక్క కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం నుండి నక్సల్ బరి శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల వరకు ఎన్నో ఉద్యమాలస్ఫూర్తితో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉస్మానియా యూనివర్సిటీలో కామ్రేడ్ కానూరి ఆధ్వర్యంలో ఆవిర్భవించిందని తెలిపారు. అరుణోదయ ప్రణాళిక లక్ష్యంతో ఏకీభవించే అన్ని ప్రజాసంఘాలతోనూ సంస్థలతోనే కలిసి ఐక్య పోరాటాల్లో పాల్గొంటుందన్నారు. ఈ క్రమంలోనే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు రాష్ట్రాల విలీన సభను సూర్యాపేటలో ఫిబ్రవరి 5న జరుగుతుందని ఈ సభకు కవులు, కళాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా నాయకులు భారతి, శ్రీను, విష్ణు, గణేష్, వివేక్, శ్రీను చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తలమానికంగా ఎక్స్ పిరియమ్ ఎకో ఫ్రెండ్లీ పార్క్



నవతెలంగాణ-అంబర్‌పేట

రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం పొద్దుటూరులో పర్యావరణ ప్రేమికుడు రాందేవ్ నిర్మించిన ఎక్స్ పీరీయం ఏకో ఫ్రెండ్లీ పార్క్ గ్రేటర్ హైదరాబాద్‌కు తలమానికంగా నిలవనున్నదని లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్‌లు అన్నారు. తెలంగాణను పకృతి వనంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 150 ఎకరాలలో ఏర్పాటుచేసిన ఈ పార్కులో 85 దేశాల నుంచి వచ్చిన 25 వేల జాతుల మొక్కలు కనువిందు చేయనున్నాయని వారు తెలిపారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్, సింగపూర్ పర్యటనలు పూర్తిగా విజయవంతమైన్నావని రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని ఇది కాంగ్రెస్ ప్రభుత్వ విజయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్ గుప్తా, తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీకి ఎన్నికైన్న పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచంలో కళలకు మించిన ప్రక్రియ లేదు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కవి రమణాచారి



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రపంచంలో కళలకు మించిన ప్రక్రియ లేదని పని నుంచి పాట పరిణామం చెందిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కవి రమణాచారి తెలిపారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న ప్రజాపాటకు నిత్యనిరాజనం కార్యక్రమంకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుల కాలంలో జమీందారుల పోషణలో ఆది నుండి కళలన్నీ పోషించిబడ్డాయి. కాలానికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ ముందుకుపోవాలని ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా వ్యవహరించాలన్నారు. అందుకు తెలంగాణ బాలోత్సవం ప్రజాపాటలకు నృత్య నీరాజనం (సెమీ క్లాసికల్) కార్యక్రమం ఫిబ్రవరి 16న నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు కార్యదర్శి ఎస్.సోమయ్య ఉపాధ్యక్షురాలు సుజావతి, నృత్య గురువులు రమణి, సిద్ధి ఇందిరా , పరాశురం తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠిలోని రాష్ట్ర వైద్య సంచాలకులు కార్యాలయంలో తెలంగాణలో తొలిసారిగా రెగ్యులర్ డీఎంఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నరేంద్ర కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ (నర్సింగ్) విజయనిర్మల

గద్దర్‌ను విమర్శిస్తే సహించేది లేదు



నవతెలంగాణ-ముషీరాబాద్

గద్దర్ ఒక వ్యక్తి కాదు సమూహ శక్తి సంగ్రామ బెరి అటువంటి గద్దర్‌ను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి తెలిపారు. గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రామ్ రెడ్డి, హాజరై మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి తమ పాట ద్వారా ఆట ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసిన గద్దర్ లాంటి మహనీయునికి పద్మ అవార్డు చాలా చిన్నదన్నారు. దళితులను ఆదివాసీలను అణిచివేయాలని చూస్తున్నారని దానిలో భాగమే గద్దర్‌కు పద్మ అవార్డు రాకుండా చేశారన్నారు. బండి సంజయ్‌కు కేవలం నోటి దూల తప్ప ఏమీ లేదన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే బండి సంజయ్ మంత్రి పదవీ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు చంద్రన్న ప్రసాద్, గంటి చంద్రుడు, యాదగిరి, సురేష్ బాబు, జగన్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కింగ్ కోఠి క్లస్టర్ ఎస్పీహెచ్ఓ డాక్టర్ సాయి బాబా అన్నారు. బుధవారం సుల్తాన్‌బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పర్శ్ లెప్రసీ అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లెప్రసీ వ్యాధి మైక్రో బాక్టీరియాలేప్రీ అనే సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమించే వ్యాధి అన్నారు. వ్యాధి గ్రస్తులకు శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకపోవడం, పాదాలు, చేతివేళ్ల తిమ్మిర్లు వంటి లక్షణాలుంటాయన్నారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని అరికట్టువచ్చన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ప్రతిజ్ఞను చేయించారు. ఈ స్పర్శ్ లెప్రసి అవేర్నెస్ క్యాంపెయిన్ 30 జనవరి నుండి 13 ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవంలో భాగంగా సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి రోజున ప్రతిజ్ఞ చేయించి అవగాహన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. హైదరాబాద్ జిల్లాను లెప్రసి రహిత జిల్లాగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పట్టణ ప్రాథమిక కేంద్రాలలో పీఎంఓ వనిత, వైద్యాధికారులు, డిప్యూటీ పీఎంఓ శ్రీనివాస్ రెడ్డి. పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, పీహెచ్ఎన్ విజయమ్మ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాల విద్యార్థులలో బహుముఖ ప్రతిభ..

- సినిమా క్లబ్ కార్యక్రమంలో దర్శకుడు వేణు ఊడుగుల



నవతెలంగాణ-ధూల్‌పేట్

సినిమా రంగంలో కొత్త ఆలోచనలకు, ప్రయోగాలకు మంచి అవకాశాలున్నాయని, సిటీ కళాశాల విద్యార్థుల్లో అలాంటి ప్రతిభ ఉందని ప్రముఖ సినిమా దర్శకుడు వేణు ఊడుగుల తెలిపారు. సిటీ కళాశాల సినిమా క్లబ్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఒక ప్రయివేట్ యూని వర్సిటీకి అతిథిగా వెళ్లిన రాని సంతృప్తి సిటీ కళాశాల విద్యార్థుల సినిమాలను చూస్తే కలిగిందని తెలిపారు. సినిమా క్లబ్ విద్యార్థులకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, తగిన సూచనలు, సలహాలు అందిస్తానని చెప్పారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాప కులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తూ వారి ప్రతిభకు వేదికలు అందిస్తున్నందుకు అభినందనీయమని ప్రశంసిం చారు. తమ కళాశాల విద్యార్థులు కేవలం తరగతి గదులకు, పుస్తకా లకు పరిమితం కాకుండా ఆసక్తి ఉన్న రంగాలలో ఎదగటానికి వివిధ క్లబ్‌లు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ అన్నారు. సిటీ కళాశాల సినిమా క్లబ్ ఏడాది క్రితం ఏర్పాటయినప్పటి నుంచి స్క్రిప్టు, డైరెక్షన్, నటన, కెమెరా వంటి అన్ని రంగాల లో విద్యార్థుల ఆసక్తి, అవగాహనను గుర్తించారు. అధ్యాపకులు క్లబ్ కన్వీనర్ డాక్టర్.చిత్తరంజన్ పర్యవేక్షణలో విద్యార్థులకు తగిన తర్ఫీదు అందిస్తూ సృజనాత్మకతకు దిశానిర్దేశం చేస్తూ మొత్తం ఆరు షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్. జె.నీరజ, డాక్టర్.కోయి కోటేశ్వర రావు, డాక్టర్.ఝాన్సీల సమన్వ యంతో నిర్వహించిన కార్యక్రమంలో నామ మాత్రపు రుసుముకు టికెట్ కొని విద్యార్థులు, అధ్యాపకులు సినిమాలు వీక్షించారు.

'మన్నె' జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా, చర్లపల్లి

కాప్రాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రహ్మణ్యం 56వ జయంతిని సందర్భంగా ఆయన అభిమానులు, ఆత్మీయులు, మిత్రులు, మన్నె సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటీన్ ప్రాంగణంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, ఉస్మానియా బ్లడ్ బ్యాంక్, తలస్మియా బ్లడ్ బ్యాంక్ ద్వారా నిర్వహించిన రక్తదాన శిబిరాలలో సుమారు 400 మంది రక్తదానం చేశారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును కుటుంబ సభ్యులు కట్ చేసి పంపిణీ చేశారు. వేలాది మంది ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, హనుమంత్ రెడ్డి, పాపారావు, ఎస్. వాసు, రాంబాబు, టీజీకే. మూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు అండ : మందముల పరమేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేదలకు భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్ డివిజన్ కు చెందిన లక్ష్మి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నెమలి అనిల్ కుమార్ అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ఓసీ ద్వారా రు.2.50లక్షలు మంజూరు చేయించారు. బుధవారం ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రం అందజేశారు. కష్టాల్లో ఉన్న వారిని సామాన్యులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని నెమలి అనిల్ అన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఘట్కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో రాచకొండ సీపీ సుధీర్ బాబు నేతృత్వంలో రాచకొండ భద్రతా మండలి సహకారంతో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వేగాన్ని తగ్గించి సీట్ బెల్టు, హెల్మెట్ ధరించాలన్నారు. దీంతో ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం ఉండదన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించటం వల్ల వాహనాలు నడిపే వారు, రోడ్డు పై వెళ్లే వారు క్షేమంగా ఉంటారన్నారు. ప్రమాదాలను నివారించడంలో పోలీసులకు మద్దతు ఇస్తూ ట్రాఫిక్ యోధులుగా మారాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రహదారి భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉంటామని ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. సామూహిక ప్రయత్నం అందరికీ సురక్షితమని చెప్పారు. ట్రాఫిక్ మార్షల్స్ స్వచ్ఛంద సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులతో మాట్లాడించారు. డీసీపీలు కే.మనోహర్, మల్లారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రమాద నివారణలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ ఎంఎస్ సావిత్రి ముథయాలా, రోడ్ సేఫ్టీ కోఆర్డినేటర్ ఎంఆర్. రాజేష్, జగన్ యాదవ్, సూర్య నారాయణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు పరశురాం, రాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలకు స్థలం మంజూరు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం స్థలం మంజూరు చేసింది. చాలా రోజులుగా డిగ్రీ కళాశాలకు సొంత స్థలం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో కొనసాగిస్తున్నారు. కళాశాలకు స్థలం మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి శ్రీధర్ బాబును కోరడంతో స్థలం మంజూరు చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమన్యం మంత్రి శ్రీధర్ బాబుకు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమార్, రవిప్రసాద్, తిరుపతి, గీత, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, అన్య బాలకృష్ణ, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, జెట్ట కిషోర్, సుక్క కిరణ్, ఇంద్రయ్య, బింగి భరత్ ,కడిగ శేఖర్, రాజు ,ఐలేష్ మహేందర్, శ్రీనివాస్ చారి, లింగం పల్లి ప్రభాకర్, యుగెందేర్ రెడ్డి, రోశయ్య ,మనీష్, రాజు లింగాయత్ తదితరులు పాల్గొన్నారు.

థి క్రిక్ ప్లానెట్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని థి క్రిక్ ప్లానెట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫీజు కట్టలేదని నాలుగో తరగతి విద్యార్థి సూర్యన్ష్ సింగ్‌ను ఉదయం నుండి సాయంత్రం 6గంటలకు బయట కూర్చోబెట్టి పనిష్మెంట్ ఇచ్చిన స్కూల్ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న థీ క్రిక్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలన్నారు. స్కూల్ ఫీజు కట్టకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఫీజు కట్టించుకోవాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థిపై అమానుషంగా ప్రవర్తించిన స్కూల్ యజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలన్నారు. విద్యార్థి తండ్రి ఫీజు చెల్లిస్తానని చెప్పినా తన కొడుకుని ఎలా బయట కూర్చోబెట్టారని ప్రిన్సిపాల్ శ్రావణిని ప్రశ్నిస్తే..ఫీజులు కట్టకపోతే బరాబర్ పనిష్మెంట్ ఇస్తామని దురుసుగా సమాధానం ఇవ్వడం దారుణం అన్నారు. గతంలోనే థీ క్రిక్ ప్లానెట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లోని సమస్యల గురించి విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్కూల్ గుర్తింపు రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు మనీష్, శివ, ప్రశాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల సేవలు అమూల్యమైనవి



- పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో సీనియర్ సిటిజెన్స్ సేవలు, వారి సూచనలు అమూల్యమైనవని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు పీ.నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు తమ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో పలు సూచనలు చేశారు. ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న శాశ్వత భవనం కల త్వరలోనే నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందులో భాగంగా పాలక మండలి సుమారు రూ.30లక్షలతో తీర్మానం చేసిదని, త్వరలోనే నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నగర ప్రజలకు సేవ చేసే అవకాశం కలిపించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ సిటిజెన్ భవన నిర్మాణానికి పూర్తి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేందర్,ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మెన్‌కు శుభాకాంక్షలు : నాగరాజు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ చైర్మెన్‌గా ఎన్నికైన ఆనంద్ బాబు గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం మల్కాజిగిరి సర్కిల్ వినాయక్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు ఆధ్వర్యంలో ఆనంద్ బాబు గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు, పీఎస్ఆర్ గ్రూప్ సభ్యులు మర్యాదపూర్వక కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఆనంద్ బాబు జీవితంలో ఇంకా ఎన్నో పదవులను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ విశిష్టత వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు



నవతెలంగాణ-ఉప్పల్

భారతదేశ వజ్రోత్సవాల సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో బుధవారం 15 పాఠశాలల్లో విద్యార్థులకు భారత రాజ్యాంగ విశిష్టితపై వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఫిబ్రవరి 2వ తేదీన రవీంద్ర భారతిలో సర్టిఫికెట్, బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు హైదరాబాద్ జిందాబాద్ ఆర్గనైజర్ ఎర్రం శ్రీను తెలిపారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, సెయింట్ జాన్స్ హై స్కూల్ కరస్పాండెంట్ రామ్ రెడ్డి, మదర్స్ ఇంటిగ్రల్స్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ, హైదరాబాద్ జిందాబాద్ ప్రతినిధులు భీష్మ చారి, ఎర్రం శ్రీనివాస్, సత్యనారాయణ, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



- సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నెంబర్
- హబ్సిగూడ, మేడ్చల్‌లో సర్కిల్స్‌లో కంట్రోల్ రూమ్స్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నోడల్ అధికారి, చీఫ్ ఇంజినీర్ కామేష్

నవతెలంగాణ-ఉప్పల్

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నోడల్ అధికారి, చీఫ్ ఇంజినీర్ ఎ.కామేష్ తెలిపారు. బుధవారం ఉప్పల్‌లోని టీజీఎస్పీడీసీఎల్ హబ్సిగూడ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ రివ్యూ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నామని తెలిపారు. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు ఎలాంటి విద్యుత్ కోతల్లేకుండా నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తామని చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912ను ఏర్పాటు చేశామనీ, వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్నా ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. మేడ్చల్, హబ్సిగూడలలోని కంట్రోల్ రూమ్‌లోనే ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 9491039018 హబ్సిగూడ కంట్రోల్ రూమ్‌లో, నెంబర్, కీ, మేడ్చల్ కంట్రోల్ రూమ్‌లో 7382618961 నెంబర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరో ఐదు కొత్త సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు సూచించారు. ఏదైనా వినియోగదారుల సేవ కోసం టీజీఎస్పీడీసీఎల్ యాప్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వేసవి డిమాండ్‌ను తీర్చేందుకు కార్యాచరణ ప్రణాళిక

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిమాండ్‌కు తగ్గ కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేసినట్టు కామేశ్ తెలిపారు. గతేడాది వేసవిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గరిష్ట డిమాండ్ 1048 ఎండబ్ల్యూ ఉందనీ, మే నెలలో ఒక రోజులో గరిష్ఠంగా 24.35 ఎంయూ సరఫరా అయినట్టు తెలిపారు. ఈ ఏడాది గరిష్ట డిమాండ్ గతేడాది కంటే 15శాతం పెరుగుదలను అంచనా వేసి కొన్ని మౌలిక సదుపాయాల అభివద్ధిని ప్రతిపాదించినట్టు తెలిపారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో బౌరంపేటలో ఒక 132 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. షాపూర్‌నగర్, మేడిపల్లి, బీఎల్ నగర్ వద్ద బోడుప్పల్ అండ్ ఉప్పల్ బాగాయత్ వద్ద రూ.37.83 కోట్ల అంచనా వ్యయంతో 4 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 33/11 కేవీ సబ్-స్టేషన్లలో 14ను మెరుగుపర్చామని తెలిపారు. 762 డీటీఆర్‌లు వివిధ ప్రదేశాల్లో ప్రతిపాదించినట్టు తెలిపారు. వేసవిలో విద్యుత్ లోడ్‌లను తీర్చడానికి పనులన్నీ 50శాతం పూర్తయ్యాయనీ, మిగిలినవి వేసవిలోపు పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులకు విశ్వసనీయమైన, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి టీజీఏఐఎంఎస్ యాప్‌ను డెవలప్ చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిల్స్ ఎస్ఈలు బ్రహ్మం, ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి



- పీఏసీఎస్ చైర్మెన్లు సద్ది సురేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రణదీప్ రెడ్డి
- అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి
- పూడూరు సొసైటీలో 1146 మందికి రుణమాఫీకి నోచుకోని వైనం

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్, మేడ్చల్, పూడూరు సొసైటీలో అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని కోరుతూ బుధవారం పీఏసీఎస్ చైర్మెన్‌లు సద్ది సురేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రణదీప్ రెడ్డిలు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అర్హత ఉన్న రైతుల వివరాలను అందించినట్లుగా తెలిపారు. డబిల్‌పూర్ సొసైటీలో రుణమాఫీకి అర్హత ఉన్న 661 రైతులకు 340 మందికే రుణమాఫీ అయినట్లు తెలిపారు. ఇంకా 321మందికి రుణమాఫీ కాలేదన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డబిల్ పూర్‌లో 550రైతులకుగాను 150మందికే రుణమాఫీ అయింది. ఇంకా రుణమాఫీ 400 మంది రైతులు ఉన్నారు. మేడ్చల్ సొసైటీలో 524గాను 398 రైతులకు రుణమాఫీ అయింది. ఇంకా 126మంది అ రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని తెలిపారు. పూడూరు సొసైటీలో 1400 మంది రైతులు ఉండగా అందులో 254 మందికి రుణమాఫీ జరిగింది. మరో 1146 మంది రైతులు రుణమాఫీ కాలేదన్నారు. అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన వారిలో వైస్ చైర్మెన్ వెంకటేష్ యాదవ్, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, శెనుగవుల మధు, దేవేందర్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, భూపాల్, చినోళ్ల సంజీవ, సత్తయ్య, భిక్షపతి ఉన్నారు.

దోమల నివారణ, చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

కార్పొరేటర్ శ్రవణ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని అన్ని ఏరియాలలో దోమల నివారణకు, చెత్త సేకరణకు ఫిబ్రవరి మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించాలని కార్పొరేటర్ శ్రావణ్ అన్నారు. మల్కాజిగిరి డివిజన్ శివపురిలోని కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ శానిటైజేషన్, ఎంటమాలజీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన పరికరాలతో దోమల నియంత్రణ, నాలాల శుద్ధికరణ చేయాలన్నారు. కాలనీ సంఘాల ప్రతినిధులు, మేధావులు, యువతను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.ఓ.హెచ్ మంజుల, ఎస్.ఎస్ శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ వనజ, శివ, గిరి, బాలమణి, రాంకీ ప్రతినిధి దయానంద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిమానం ఉన్నంత వరకు సేవ చేస్తా

- మాజీ కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-కీసర

ప్రజల అభిమానం ఉన్నంత వరకు ప్రజా సేవ చేస్తానని నాగారం మున్సిపల్ 7వ వార్డు మాజీ కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలోని బ్రహ్మయ్య కాలనీలో మాజీ కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్, 2వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగేష్ గౌడ్, 6వ వార్డు మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంత రెడ్డిలు ఐదేండ్లు కౌన్సిలర్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్దామర్రి మాజీ ఉపసర్పంచ్ నల్ల కృష్ణారెడ్డి, గుండు మధు గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. 7వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమైన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం తన బాధ్యతగా పనిచేశానన్నారు. భవిష్యత్‌లో కాలనీ వాసుల ప్రేమ తన కుటుంబంపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్, టీమ్ మెంబర్స్ మండలి వాసవి శ్రీనివాస్ రావు, అంజలి సురేందర్ రెడ్డి, పావని జైపాల్ రెడ్డి, అరుణ యాదగిరి, శ్వేతా శ్రీశైలం, నగరత్న రమణ, జ్యోతి తిరుపతి, పావని పాపా,సుజాత ఆనంద రాజు, గంగ బాలరాజు, నాగమణి, కవిత నవీన్, మాధవీ కృష్ణ, సంధ్య భిక్షపతి, వెంకన్న నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాంది ఫౌండేషన్ ఏర్పాటుతో ఉద్యోగవకాశాలు

సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ కాలేజీ ఫర్ ఉమెన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.వేళంగిని కుమారి



నవతెలంగాణ - చర్లపల్లి

నాంది ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉద్యోగవకాశాలు విశేష స్పందన వచ్చిందనీ, నాచారం సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ కాలేజీ ఫర్ ఉమెన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.వేళంగిని కుమారి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నాచారం సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ కాలేజీ ఫర్ ఉమెన్ కళాశాలలో నాంది ఫౌండేషన్ జాబ్ ఉత్సవ్ 2024-25 ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. డిగ్రీ పీజీ ఎంబీఏ విద్యార్థులకు ప్రయివేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నాంది ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉద్యోగవకాశాలకు విశేష స్పందన వచ్చిందనీ, ఇప్పటివరకు ఇంటర్వ్యూలకు రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారాన్నారు. మహేంద్ర, టెక్ మహీంద్రా లాంటి దిగ్గజ కంపెనీలు మంచి ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ జాబ్ ఉత్సవ్‌లో నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట్, గజ్వేల్, జనగాం వివిధ జిల్లాల నుండి విద్యార్థులు ఉన్నారు.

మల్లారెడ్డి ఉమెన్స్ లో కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ - మేడ్చల్



గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్స్ క్యాంపస్‌లో ఓ విద్యార్థిని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కీర్తి పరీక్షలు బాగా రాయలేమోనని అనే భయంతో మధ్యాహ్నం కళాశాల నాలుగో అంతస్తు కిటికీలో నుండి దూకేందుకు ప్రయత్నించింది. కింద ఉన్న విద్యార్థులు వద్దు వద్దు అంటూ నినాదాలు చేయడం సెక్యూరిటీ సిబ్బంది వెంటనే పైకెళ్లి విద్యార్థిని కిందికు దూకకుండా నివారించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇదే విషయమై కళాశాల డీన్ ప్రసాద్‌ను వివరణ కోరగా సదరు విద్యార్థినికి ఆ సమయంలో ఫీట్స్ వస్తుందని తెలిపారు. దీంతో కిటికీలో నుండి కింద పడబోయిందన్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి అప్పుడప్పుడు ఫీట్స్ వస్తుందని తెలిపారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది



వాసవీ మిత్ర మండలి కృషి అభినందనీయం

కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

నవతెలంగాణ-కాప్రా, చర్లపల్లి

అన్ని దానాల కన్నా.. ఆకలితో ఉన్నవారి కడుపు నింపే అన్నదానం గొప్పదని కుషాయిగూడ పోలీసు ఇన్‌స్పెక్టర్ జి. అంజయ్య అన్నారు. ప్రతి నెలా అమావాస్య రోజున వాసవీ మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేయడం శుభ పరిణామం అని అన్నారు. బుధవారం వాసవీ మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్డులో ఏర్పాటు చేసిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుషాయిగూడకు చెందిన వృద్ధురాలు మాలే వరమ్మ, కొండూరి విజయ, అంబేద్కర్ నగర్‌కు చెందిన పడకంటి రామచందర్ గుప్తాకు రూ. 1000 పింఛన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా కార్యనిర్వాహక కార్యదర్శి ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణి గుప్తా, నంగునూరి అశోక్ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్త కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త అమర కృష్ణ గుప్త బల్లి శ్రీధర్ గుప్త కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ గుప్తా, ఉప్పల ఆంజనేయులు గుప్తా, రాయికంటి వేణు గుప్తా, ఏనిశెట్టి రమేష్ గుప్తా, తదితరులున్నారు.

పేద రోగులకు సహాయం అందించాలి

● టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.
దాతలు,స్వచ్ఛందసంస్థలు పేద రోగులకు సేవలు అందించేందుకు ముందుకు రావాలని ఎస్.పి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డ అన్నారు. బుధవారం సనత్ నగర్ నియోజకవర్గం ఎస్సార్ నగర్ లో గల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రుసుద్దీన్,సి.ఎస్ ఆర్.ఎం.ఓ.డాక్టర్ వినాయక్ లతో కలిసి చిన్నపిల్లలు,గర్భిణులు, బాలింతలు,వద్ధులకు సుమారు 250 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని వారికి తెలిపారు. భవిష్యత్తులో తోచినంతలో సేవలు చేస్తానన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, లింగారెడ్డి,వేణు,తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

● శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.
అన్నదానం మహాదానమని భావిస్తూ పేదల కడుపు నింపేందుకు తమ వంతు కషి చేస్తున్నామని శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మోతే రాజేశ్వర్,రవితేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,కమిటీ నిర్వాహకులు జింకల వెంకటేష్ ముదిరాజ్ లు అన్నారు. బుధవారం కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్, పంచశీలకాలనీలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని సభ్యులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అత్యధికంగా పేదలతోపాటు, పారిశ్రామిక వాడ కావడంతో అత్యధికంగా కార్మికులు,అడ్డ కూలీలకి ఈ అన్నదానం ఒకపూట కడుపు నింపుతుందన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ లక్ష్మి రోడ్ వేస్ అధినేత, కార్యనిర్వాహకులు బివి. సూర్యనారాయణ,భాషయ్య,సభ్యులు సంజీవ్,శంకర్ నాయక్,పలువురు కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలోకి పి.సత్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీకి పి.సత్యం ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహాస భల్లో పి.సత్యంను పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన రాష్ట్ర కమిటీకి కూడా ఎన్నిక య్యారు.సత్యం రామాంతపూర్ పాలిటెక్నిక్ కాలేజీలో 1987లో ఎస్ఎఫ్ఐ సభ్యత్వం తీసుకున్నారు. 1988లో పార్టీ సభ్యులు అయ్యారు. 1990 వరకు మూడేండ్ల పాటు రామాంతపూర్ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థుల సమస్య లపై అనేక పోరాటాలు చేశారు. 1991లో పూర్తి కాలం పార్టీ కార్యకర్తగా ఎదిగారు. 1998 వరకు విద్యార్థి ఉద్యమంలో వివిధ బాధ్యతలను నిర్వర్తించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శిగా 1996 నుంచి 1998 వరకు పని చేశారు. 1997 నుంచి పార్టీ హైదరాబాద్ నగర కమిటీ సభ్యులుగా పని చేస్తూ, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతం లో ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో క్రియా శీలకంగా వ్యవహరించారు. కొకాకోలా కంపెనీలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వివిధ కంపెనీల్లో కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేశారు. ఈ నేపథ్యంలో జైలుకు సైతం వెళ్లి నిర్బంధాలు ఎదుర్కొన్నారు. 2003 నుంచి 2007 వరకు నాలుగేండ్ల పాటు నిర్వహించిన భూ పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారు. కూకట్‌పల్లి ప్రాంతంలో జరిగిన పోరాటాల్లో అనేక కేసులను ఎదుర్కొని జైలుకు సైతం వెళ్లి వచ్చారు. ఈ కాలంలోనే రేషన్ కార్డులతోపాటు స్థానిక సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కారం దిశగా కృషి చేశారు. రంగారెడ్డి జిల్లా ఉద్యమ నిర్మాణంలో 2001 నుంచి ఉంటూ, జిల్లా సమగ్ర అభివృద్ధి పాదయాత్రలో 1400 కిలో మీటర్లు 45 రోజులు పాలు పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఎదురైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 2004 నుంచి రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పునర్ విభజనలో భాగంగా నార్త్ కమిటీ ఏర్పాటు కావడంతో కార్యదర్శివర్గ సభ్యులుగా కూడా పని చేశారు. ఈ సమయంలో భూ పోరాటాలు, ముఖ్యంగా బీసీ సబ్ ప్లాన్ సాధన కోసం కృషి చేశారు. జిల్లాల పునర్ విభజనలో భాగంగా రంగారెడ్డి నుంచి విడిపోయి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 2016లో ఏర్పాటైంది. ఆ తర్వాత జరిగిన మహాసభల్లో జిల్లా కార్య దర్శిగా 2016లో బాధ్యతలు చేపట్టారు. ఈ కాలంలో కార్మికల సమస్యలపై, జవహర్‌నగర్ డిపింగ్ యార్డు, భూ నిర్వాసితులు, కేశవాపురం రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలపై గళం విప్పారు. దుండిగల్ అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం కృషి చేశారు. 2021లో పార్టీ మూడో మహాసభల్లో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం జరిగిన పార్టీ నాలుగో మహాస భల్లోనూ రాష్ట్ర కమిటీ స్థానం పొందారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నెలకొన్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని సత్యం తెలిపారు. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో నెలకొన్ని సమస్యలపై మరోసారి గళం విప్పేందుకు, ఉద్యమాలు చేపట్టేందుకు రెడీ ఉన్నామని సత్యం తెలిపారు.

చదువుతోపాటు క్రీడలనూ ప్రోత్సహించాలి

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
● హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ సందర్శన



నవతెలంగాణ-సిటీబ్యూరో
చదువుతోపాటు క్రీడలనూ ప్రోత్సహించాలనీ, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ అన్నారు. బుధవారం హకీంపేట్‌లోని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించిన అనంతరం మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్‌లో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని స్కూల్ స్పెషల్ ఆఫీసర్‌కు సూచించారు. టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో స్పెషల్ ఆఫీసర్‌కు కలెక్టర్ సూచించారు. స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారనీ, వారికి విద్యతోపాటు క్రీడలను ఏ విధంగా నేర్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో గల విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాల్స్‌ను, గ్రౌండ్స్, డైనింగ్ హాల్‌లో కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులను భోజనం అందిస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్‌లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్‌లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం స్కూల్‌లో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ 40 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటున్నారని తెలిపారుఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయనీ, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని తెలిపారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియో థెరపీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కట్ట మైసమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
సూరారం కట్ట మైసమ్మ దేవాలయం వద్ద అత్యంత వైభవోపేతంగా ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్న "శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర" ను విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "కట్ట మైసమ్మ అమ్మవారి జాతరకు ప్రతి యేటా లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారని తెలిపారు. నీటి సదుపాయం, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంపు వంటి ఏర్పాట్లను అన్ని విభాగాల అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా జాతరలో పోకిరీల బెడద లేకుండా షీ టీమ్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బోనాల జాతర వాల్ పోస్టర్ ను, కరపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ మల్లారెడ్డి, సీఐ భరత్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ జీఎం అశోక్, ఈఈ క్రిష్టప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మన్నె బాలేష్, సభ్యులు ఆలయ కమిటీ సభ్య లు వీరారెడ్డి, ప్రసాద్, మల్లేష్, దారం సాయి, కష్టారెడ్డి, ఈ. సురేష్, ఇంద్రసేన, సాయి గౌడ్, మహేష్ కుమార్, శివరా జ్, వెంకటేష్, లక్ష్మారెడ్డి, గోపాల్ మరియు డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్‌లు లేక విద్యార్థుల అవస్థలు

● కోలా రవీందర్ ముదిరాజ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
విద్యార్థులు ఫీజు మాఫీ కోసం 20 రూపాయల స్టాంప్ పేపర్ పై డిక్లరేషన్ ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా కానీ, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంప్ పేపర్లు స్టాక్ లేకపోవడంతో విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక సేవ కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. 20 రూపాయల స్టాంప్ పేపర్ కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయం వధా చేసుకుంటున్నారన్నారు.. జిల్లా రిజిస్టర్ కార్యాలయం వారు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కొన్ని మీసేవ కేంద్రాలు, కాలేజీలు 100 రూపాయల స్టాంప్ పేపర్ పై డిక్లరేషన్ ఇస్తే చెల్లవని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందిని గుర్తించి త్వరగా స్టాకును అందిస్తారని, 20 రూపాయల స్టాంప్ పేపర్ దొరకనప్పుడు 50 రూపాయల పైన గాని, 100 రూపాయల పైన గాని వైట్ పేపర్ పై ఫ్రకింగ్ 20 రూపాయల స్టాంపింగ్ చేయించిన మీసేవ వారు, కాలేజీ వారు స్వీకరించాలని సంబంధిత విద్యాశాఖకు కాలేజీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ఈ విష యంలో ప్రభుత్వం సత్వరమే స్పందించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి పీఏసీఎస్ చైర్మెన్, డీసీసీబీ డైరెక్టర్ వినతి



నవతెలంగాణ-దుండిగల్
దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరాంపేట్‌లో గల బోరంపేట్ సొసైటీలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు పరుస్తామన్న రుణమాఫీ అర్హులైన రైతులు 632 గాను కేవలం 17మందికి మాత్రమే అయ్యిందని.. బౌరంపేట్ (పీఏసీఎస్) చైర్మెన్, డీసీసీబీ డైరెక్టర్ మిద్దెల బాల్ రెడ్డి తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ రూ.2,99,64,282,00 గాను 662932,00 వచ్చినవని, మిగతా 615 మంది రైతులకు రూ.2,93,01,350,00 రుణమాఫీ కావలసి ఉందన్నారు. కావున మిగతా రైతులందరికీ ఎటువంటి కండిషన్ లేకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలని అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళకు రైతుల లిస్టు తో సహా తెలియజేస్తూ వినతిపత్రం ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని మేడ్చల్ జిల్లా చైర్మెన్‌లు పీఏసీఎస్ మేడ్చల్ రందీప్ రెడ్డి, డబిల్ పూర్ పీఏసీఎస్ చైర్మెన్ సురేష్ రెడ్డి, కీసర పీఏస్-సీఎస్ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, పూడూరు చైర్మెన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కే.ఏసురత్నం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
మున్సిపల్ అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే రెండు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కే.ఏసురత్నం డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కి రాష్ట్ర నాయకులు డి.రాములతో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు రెండు నెలల వేతనాలు కార్మికులకు వెంటనే చెల్లించాలని ఫైనాన్స్ అకౌంట్ సెక్రటరీ కి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. అదేవి ధంగా అదిలాబాద్ మున్సిపాలిటీలోని కమిషనర్ ఇచ్చిన చెక్కు నెంబర్ తీసుకొని దీన్ని పరిశీలించి అన్ని మున్సిపా లిటీలకు నిధులు మంజూరు చేసి వేతనాలు రావడానికి ఫైనాన్స్ సెక్రెటరీతోని చర్చించి త్వరలో వేతనాలు వచ్చే విధంగా వంతు కషి చేస్తానని సంబంధిత అధికారి వారికి తెలిపారు.

దోమల నివారణకు మందు పిచికారీ



నవతెలంగాణ - కూకట్ పల్లి
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మచెరువు పరిసర ప్రాంతాల ప్రజలు, దోమల బెడద సమస్యతో కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతూ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు కార్పొరేటర్ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణకు ఎల్లమ్మ చెరువులో తిమేపాస్ కెమికల్ (దోమల మందు)ను డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మచెరువు పరిసర ప్రాంతాలలో దోమల సమస్య ఎక్కువగా ఉందని, గతంలోనే సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ చలి కాలంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవమేనని, ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట కూడా వాస్తవమే అందుకని నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్న అధికారులను వారి సిబ్బందిని నిందించడం సరికాదన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ ప్రజల కోసమే పనిచేస్తారని గుర్తుచేశారు. ప్రజల ఇబ్బంది తనకు తెలుసునని, తాను కూడా ఇక్కడే జీవిస్తూ బాధితులలో ఒకడిగా ఉన్నాను కాబట్టి, దోమల సమస్య ఎంత తీవ్రంగా ఉందో తనకు కూడా స్వయానుభవం ఉందని తెలిపారు. త్వరలోనే ఎల్లమ్మచెరువులోని గుర్రపు డెక్కను శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలియచేసారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, ఎంటమాలజి సూపర్వైజర్ డి.నరసింహులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులి గుర్తు పై ఓటు వేసి గెలిపించండి

● చిట్టికిరెడ్డి శ్రీధర్ రెడ్డి



నవతెలంగాణ-కూకట్ పల్లి
పులి గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని పాపి రెడ్డి నగర్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి ఒక ప్రకట నలో కోరారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికలు వచ్చే నెల 7న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్నాయన్నారు.గతంలో ఒకసారి ప్రధాన కార్యదర్శిగా మంచి మెజారిటీతో గెలిపించారని,గత ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపు దిశగా వెళ్లి స్వల్ప మెజారిటీతో గెలవలేదని, ఈసారి జరగబోయే ఎన్నికల్లో అధ్యక్షుడిగా, మీ అందరి ఇంటి యజమానుల ఆశీస్సులతో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నానన్నారు. తను పదవిలో ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ, పాపిరెడ్డి నగర్ అభివద్ధికి ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ల సహాయ, సహకారలతో బస్తీ అభివద్ధితో పాటు, పలు ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందజేసేందుకు తన వంతు కృషి చేశానని, ఇంకా మునుముందు మీ ఇంటి యజమానుల ఆశీస్సులతో ఇంకా సేవ చేసేలా నన్ను ఆశీర్వదిస్తారని, మంచి భారీ మెజా రిటీతో గెలిపించాలని పాపిరెడ్డి నగర్ యజమానులను కోరుకుంటున్నాను అనిఅన్నారు ఫిబ్రవరి 7న శ్రీ నల్ల పోచమ్మ ఆలయం రోడ్ నెంబర్ 9లో జరగబోయే ఎన్నికల్లో ,బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ ఒకటి (1) టైగర్ (పులి) గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో విజయం ఇవ్వాలని కోరారు.



పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

● ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
హెల్పింగ్ హార్ట్ సొసైటీ సభ్యులు పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి ప్రశంసించారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్, సీసాల బస్తీలలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు బాసటగా నిలిచేందుకు స్వచ్చంద సంస్థలు, దాతలు ముందుకు రావాలన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన సొసైటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ముమ్ముందు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని వారికి చెప్పారు. హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయకుమార్ గత కొన్నేండ్లుగా దాతల తోపాటు, సొసైటీ నేతత్వంలో పేదలకు,పేద విద్యార్థులకు సేవలందిసు_న్నామన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తతం చేస్తానని తెలిపారు. సంఘ సేవకులు, దాత వీరేందర్ సింగ్ రాథోడ్ అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సయ్యద్ సాజిద్, సాయికుమార్ పంతుల,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంతో అక్రమ భవన నిర్మాణాలు

కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
అధికారుల అలసత్వం అవినీతి కారణంగానే నియోజకవర్గంలో అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని వీటిని నిరోధించాల్సిన అవసరం ఉందనికాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్స్ డిప్యూటీ కమిషనర్లతో మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంక్వయిరీ , కేటాయింపు అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల జారీ శానిటేషన్ , టౌన్ ప్లానింగ్‌లో జరుగుతున్న పెద్ద ఎత్తున అవినీతి పై ఆయన ఇరువురు డిప్యూటీ కమిషనర్లతో చర్చించారు. డిప్యూటీ కమిషనర్లు వంశీకష్ణ, గంగాధర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

కూకట్ పల్లి జంట సర్కిళ్ల ఉప కమిషనర్లకు కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు వినతి





నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
విలేకరులను బూచిగా చూపిస్తు ఇండ్ల నిర్మాణ దారులను టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ డిమాండ్ చేసింది. బుధవారం కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లను కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలితో సమాజంలో జర్నలిస్టుల విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలేకరులకు డబ్బులు ఇవ్వాలంటూ నిర్మాణ దారుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో రాతలు రాయించి వాటిని విలేకరులు రాస్తున్నారంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, అధికారులే వారి అవసరాల కోసం సోషల్ మీడియాలో ఉన్నవారిని విలేకరులుగా ప్రచారం చేస్తున్నారని డీసీల దష్టికి తీసుకువచ్చారు. భవనాల వద్ద డబ్బులు ముడితే ఒక విధంగా ముట్టకపోతే మరోలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.అలాంటి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని మూసాపేట డీసీ గంగాధర్‌ను డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌లో ఉన్న అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్ వంశీ కష్ణకు సూచించారు.

ఈ సందర్భంగా డీసీలు వంశీకష్ణ, గంగాధర్‌లు మాట్లాడుతూ ఆయా విషయాలను జోనల్ కమిషనర్ దష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టు యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, రాష్ట్ర నాయకులు ఆర్ కె దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎంఏ కరీం, జర్నలిస్టు సంఘం నాయకులు మాణిక్యరెడ్డి, గంగరాజు, సదా మహేశ్,ఆర్. శ్రీనివాస్ యాదవ్, చంద్ర, భాస్కర్ చారి, పవన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ స్వామి మహా పడిపూజ మహోత్సవం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ 3లో గల శ్రీ కంచికోట పీఠం వారి శ్రీ శ్రీ శ్రీ చక్రధీష్టాన కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి (శివాలయం) లో బుధవారం కర్ర వెంకటేశ్వర రెడ్డి (శివ స్వామి), వేణు గోపాల్ ఆధ్వర్యంలో శ్రీ శివ స్వామి మహా పడిపూజ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన కూకట్‌పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉన్నాయన్నారు. జనసేన కూకట్‌పల్లి నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్ ,పోలే బోయిన శ్రీనివాస్ , పసుపులేటి ప్రసాద్ ,పాదం సూర్యపులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కమిషనర్‌తో కలిసి పర్యటించిన కొలన్ రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరధిలోని పలు కాలనీల అభివృద్ధి పనుల గురించి కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి రావడంతో బుధవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ సాబీర్ అలీతో కలిసి పలు కాలనీలు, 17 డివిజన్ కౌసల్య కాలనీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు బాసటగా అరుట్ల ఫౌండేషన్

● కుట్టు మిషన్ అందజేత



నవతెలంగాణ-దుండిగల్
పేద మహిళలకు కుట్టు మిషన్ అందించి తమ దాతృత్వాన్ని చాటుకుంది డా.అరుట్ల కమలాదేవి రామచంద్రరెడ్డి ఫౌండేషన్. బుధవారం శేర్లింగంపల్లికి చెందిన ఆర్. సుధకు వారి కుటుంబానికి ఆసరాగా తోడ్పడుతుందని కుట్టు మిషన్ యంత్రాన్ని అందించామని ఫౌండేషన్ సభ్యులు మమత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "సామాజిక బాధ్యతలో భాగంగా నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడం తమ లక్ష్యంగా ఈ కుట్టు యంత్రం అందించామని, ఈ మిషన్ ఆమె జీవనోపాధికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21 డివిజన్ సాయి నగర్ కాలనీ వాసులు కాంగ్రెస్ కుత్బులాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వారి కాలనీ సమస్యలతో పాటు అభివృద్ధి పనులను తెలిపారు. పార్టీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ (లడ్డు), సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ శ్రీనివాస్ చారీ, యువజన కాంగ్రెస్ నాయకులు మిట్టు,శ్రీనివాస్, తిరుపతి, నరసింహ, అఖిల్, అక్బర్, గౌస్, సులేమాన్, యాదయ్య, అర్వాద్, శ్రీను, ప్రవీణ్, కళ్యాణ్, మల్లేష్, పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

స్వచ్ఛమైన ఆహారాన్ని అందించండి

- కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆహార ప్రియులకు స్వచ్ఛమైన ఆహారాన్ని అందించి వారి మన్ననలు అందుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్ సూచించారు. పంజాగుట్టలో నూతనంగా ఏర్పాటుచేసిన విలేకరుల మండి కింగ్స్‌ను నిర్వాహకులు హబీబ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే హైదరాబాద్ బిర్యానికి ప్రత్యేకత ఉందని అన్నారు. బిర్యానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న హైదరాబాదులో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. తమ శాఖను పంజాగుట్టలో ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందని అన్నారు.

కేసీఆర్ పుట్టినరోజున క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ ఆధ్వర్యములో నిర్వహించే క్రికెట్ బ్రోచర్స్ బుధవారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 10 నుంచి ఓయూ సీగ్రౌండ్‌లో క్రీడలు ప్రారంభం అవుతాయాన్నారు. ఈ కార్యక్రమములో బీఆర్ఎస్వీ రాష్ట్రా నాయకులు కోతి విజయ్, బూరుగు నవీన్, మధు, బొయిపల్లి నాగరాజు, అర్జున్, షాంగంటి రాజేష్, పవన్ దేవాన్ష్, వడేపల్లి సందీప్, బండి భారత్ విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరిస్తా..



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్
- ఎమ్మెల్యేను కలిసిన హమాలీలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో పనిచేసే ప్రయివేటు హమాలీల సంఘం అధ్యక్షులు ఉగ్రం రాములు బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ.. గత 30 ఏండ్లుగా హమాలీలుగా పని చేస్తున్నామని, మార్కెట్లో నిత్యము వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంటనే మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్ బాబుతో మాట్లాడి వారికి భోజనం చేసి విశ్రాంతి తీసుకోవడానికి హాలు, మూత్రశాలలు తదితర సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వాటికి ఎటువంటి నిధులు మంజూరు అవసరం అయినా సంబంధిత మంత్రితో మాట్లాడి నిధులు తీసుకువస్తానని చెప్పారు.

ఆడబిడ్డ పెండ్లికి తొలుత ఆర్థిక సాయం అందించిన ఘనత బీఆర్ఎస్‌దే..



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

పేదింటి ఆడబిడ్డ పెండ్లికి మొట్టమొదటిగా ఆర్థిక సహాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వందే అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట్, బేగంపేట్ డివిజన్‌లకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ క్రింద 9 మందికి ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెండ్లి చేయాలంటే ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చేయూతను ఇవ్వాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక రూ. లక్ష 116 ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, అమీర్‌పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ కుమార్, నాయకులు శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, శేఖర్, కూతురు నర్సింహ, గోపిలాల్ చౌహాన్, బలరాం, ఆరీఫ్, అఖిల్, హరిసింగ్, సుమిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి వివాదంపై న్యాయ విచారణ చేయాలి



- ప్రభుత్వానికి పాస్టర్ల విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

దశబ్దాలుగా దైవజనుల సేవలో ఉన్న తమను హెబ్రోన్ చర్చిలోకి రాకుండా అడ్డుకోవడం అన్యాయమాని పాస్టర్లు కేఎం. శ్యాంసన్, జాన్, సుబ్బా రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డానియల్, ఎఫ్రైన్, కృపావరంలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 1969వ సంవత్సరం నుంచి తాము హెబ్రోన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్నామని, హెబ్రోన్‌లో ప్రస్తుతం పరిస్థితి దయనీయంగా ఉందని, కాంపౌండ్ గేటు వేసి భక్తులైన అందరిని లోనికి రానివ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెబ్రోన్‌ను కేవలం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌గా మాత్రమే చెపుతున్నారని, అక్కడ భక్తజనులకు ప్రార్థన చేసుకునే అవకాశం కల్పించక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసులు జోక్యం చేసుకుని హెబ్రోన్ గేట్లు త్వరగా తెరిపించాలని తెలిపారు. రౌడీలను, హిజ్రాలను తీసుకొని రావడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించాలని కోరారు.

ఏడాది పూర్తి చేసుకున్న అనంత రీహాబ్



నవతెలంగాణ-బేగంపేట్

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద అత్యాధునిక రీహాబిలిటేషన్ సెంటర్‌గా పేరొందిన అనంత రీహాబ్ రోగుల సేవలో మొదటి ఏడాది పూర్తిచేసుకుంది. గడిచిన ఏడాది కాలంలో ఈ కేంద్రం స్ట్రోక్, శస్త్రచికిత్సలు, ట్రామా, దీర్ఘకాలిక నొప్పి లాంటి సమస్యలున్న రోగులు తిరిగి కోలుకునేందుకు ఒక ఆశాదీపంలా నిలిచిందని అనంత రీహాబ్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం బేగంపేటలోని అనంత రీహాబ్ కేంద్రంలో ఏడాది పూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో 1,100 జీవితాలను సమూలంగా మార్చిందన్నారు. పక్షవాతం వచ్చిన రోగులు ఇప్పుడు నడుస్తున్నారని, అపస్మారక స్థితిలో ఉన్నవారు సాధారణ స్థితికి చేరుకున్నారని, ఇంకా లెక్కలేనంతమంది దీర్ఘకాలిక నొప్పుల నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. మా లక్ష్యం కేవలం ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం మాత్రమే కాదని, వారికి ఒక గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని అందించడమని తెలిపారు. ఇప్పటివరకు ఈ కేంద్రంలో 30వేలకు పైగా థెరపీ గంటలు అందించారు. నాన్-ఇన్వేజివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్, అత్యాధునిక నొప్పి నివారణ పద్ధతులు, సమగ్ర ట్రాన్సిషనల్ కేర్ లాంటి సరికొత్త టెక్నిక్‌లు ఇక్కడ ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ గుర్తింపు ఉన్న నిపుణులతో కూడిన ఈ కేంద్రంలో.. అత్యాధునిక సదుపాయాలు, అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ, క్రిటికల్ కేర్, వ్యక్తిగతీకరించిన పోషకాహార సేవలు అందుతున్నాయి.

'హెల్త్ ప్రొఫైల్' రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు

- అందుకు ఏఐ దోహదపడుతుంది
- 'ఎండిఆర్.మై డిజి రికార్డ్' యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రాష్ట్రంలోని ప్రతి పౌరుని 'హెల్త్ ప్రొఫైల్' ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ఆధారిత మొబైల్ యాప్, వెబ్ దోహదపడతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ మాడ్యూర్ హస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన 'ఎండిఆర్.మై డిజి రికార్డ్' మొబైల్ యాప్‌ని మంత్రి లాంఛనంగా జూబ్లీహిల్స్‌లోని తస్పల్లా హోటల్లో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మాడ్యూర్ హస్పిటల్స్ సర్వీసెస్ సంస్థ చైర్మెన్ మోటూరి కృష్ణప్రసాద్, వ్యవస్థాపక సీఈఓ డా.సరోజ్ గుప్తా, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ క్రిస్ హంఫ్రెయ్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ.. ప్రజలు ముఖ్యంగా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవడానికి ఏఐ ఆధారిత మొబైల్ యాప్ రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఒక ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యాధిగ్రస్తుడు మెరుగైన వైద్య సదుపాయాలు, చికిత్స కోసం తన వ్యాధికి సబంధించిన వివరాలతో మరోక ఆస్పత్రికి వెళ్ళి, ఆ ఆస్పత్రి రోగి వ్యాధికి సంబంధించిన వివరాలను విశ్వసించడంలేదన్నారు. ఫలితంగా మరోసారి ఆ వ్యాధిగ్రస్తునికి మళ్ళీ అన్ని వైద్య పరీక్షలు చేయడం వల్ల రోగి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడన్నారు. ఇలాంటి పరిస్థితిని నివారించడానికి, ఏ ఆస్పత్రికి వెళ్ళినా ప్రజలకు సంబంధించిన ఆరోగ్య వివరాలు విశ్వసనీయంగా, అందుబాటులో ఉండే విధంగా ప్రజల సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఎఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా ఒక వ్యక్తి పూర్తి రక్తపోటు, మధుమేహ, తదితర ఆరోగ్య వివరాలను వెంటనే తెలియజేయడం ద్వారా రోగికి మెరుగైన చికిత్సను అందించడంతో పాటు, అతనికి ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. మరోవైపు భవిష్యత్ ఒక వ్యక్తి ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం వల్ల అప్రమత్తమవుతారని మంత్రి వివరించారు. ఎంఎల్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్రంలో మంచి విద్యా సంస్థలు ఉన్నాయని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైద్య రంగంలోని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇటీవల దావోస్ జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మొత్తం రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని, ఇందులో పలు వైద్య రంగం సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయని మహేష్ వివరించారు. మోటూరి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి ముఖం లేదా శరీర అవయవాలను కేవలం 45 సెకండ్ల పాటు పరిశీలించి ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారాన్ని తెలియజేసే విధంగా 'ఎండిఆర్.మై డిజి రికార్డ్' యాప్ రూపొందించినట్టు వెల్లడించారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



- వెస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జాతీయ రహదారి భద్రత మాహోత్సవంలో భాగంగా బుధవారం ట్రాఫిక్ విభాగం- వెస్ట్ జోన్ పరిధిలోని యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో వెస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్ జోన్ ఏసీపీ కట్ట హరి ప్రసాద్‌రావులు ముఖ్య అతిథులుగా పాల్గొని 300 మంది ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ డీసీపీ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించా లని, ఆటో డ్రైవర్లు చేస్తున్న ట్రాఫిక్ ఉల్లంఘు నలపై పలు సూచనలు చేశారు. యూనిఫాం వేసుకోక పోవడం, స్టాప్ లైన్ దాటడం, సిగ్నల్ జంప్, లైసెన్సు లేకపోవడం, సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడం, సరైన ప్రదేశంలో పార్క్ చేయక పోవడం, వేరే వ్యక్తులకు ఆటోలు అద్దెకు ఇవ్వడం, ఇన్సూరెన్స్ లేకపోవడం వంటి తప్పులు చేయకూడదని, వాటి వల్ల జరిగే ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవ లసిన జాగ్రత్తలు విపులంగా వివరించారు. అలాగే ఆటో డ్రైవర్ల సమస్యలను తెలుసుకొని, జిల్లాల నుంచి వచ్చే ఆటో లు, టాక్సీ రిజిస్ట్రేషన్ కానీ ద్విచక్ర వాహనలు (ఓల, ఉబర్) వల్ల ఆటో డ్రైవర్లకు జరిగే నష్టాలను కూడా విని సంబం ధిత శాఖల వారితో సమన్వయం చేస్తామని డీసీపీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందించిన కార్పొరేటర్





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ బాబా ఫసియుద్దీన్ ప్రత్యేక చొరవతో బోరబండ డివిజన్లో ఎస్ఆర్ఆర్‌పురం నివాసి షేక్ సాయిదా బేగంకు రూ.2.25 లక్షలు, బోరబండ పెద్దమ్మ నగర్ వీకర్ సెక్షన్ నివాసి జి. అనురాధకు రూ.250 లక్షలు ముఖ్యమంత్రి సహాయా నిధి ఎల్‌ఓసీ అందించారు. సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారు ఎప్పుడైనా కార్పొరేటర్ తన ఆఫీస్‌కి వచ్చి కలవాలని, బోరబండ డివిజన్ ప్రజలకు సూచించారు. వెంటనే సహాయం చేయబడుతుందని అన్నారు.

ప్రమాదాలపై పట్టింపు లేదా..?



నవ తెలంగాణ-బంజారాహిల్స్

కేబీఆర్ పార్క్ సుందరీకరణ పనులను బుధవారం ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి పర్యవేక్షించారు. ఆయన పర్యవేక్ష అనంతరం కాలినడక నడిచే వాకర్స్‌తో పాటు స్థానిక ప్రజలు ఇటీవల ప్రమాదవశాత్తు కూలిన ప్రహరీ కనిపించడం లేదా అని విమర్శిస్తున్నారు. ప్రహరీ కూలిపోవడం వల్ల అవాంఛనీయ సంఘటనలకు దారి తీసే ప్రమాదం ఉన్నదని అభివృద్ధి పనుల్లో ఈ అడ్డుగోడను నిర్మించి అడ్డదారిలో లోపలికి వచ్చేవారిని రాకుండా నియంత్రించాలని తెలిపారు. నిత్యం కాలినడక నడిచే వారిలో మదిలో మెదులు తున్న విషయం గతంలో పార్క్‌లో పలువురు సెలబ్రిటీలకు, విఐపీ కుటుంబాల వారికి చెందిన వారిని టార్గెట్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించడం, గన్నుతో కాల్చడం వాంటి ఘటనలు చోటు చోటుచేసుకున్నాయి. పలువురు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు సైతం చేశారు. ఇటీవల కాలంలో వరుస రోడ్డు ప్రమాదలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడం, కార్లు జీప్స్ ఢీకొన్న తరుణంలో కేబీఆర్ పార్కు ప్రహరీ కూలిపోయి, ఐరన్ గ్రిల్స్ ధ్వంసమైనట్టు పేర్కొన్నారు. అభివృద్ధి పేరిట కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మాసాలు గడుస్తున్న చిన్న రోడ్డును ఐరన్ గ్రిల్స్‌ను పునర్ నిర్మించి రక్షణ కల్పించాలని వాకర్స్‌తో పాటు స్థానిక ప్రజలు ముఖ్యమంత్రిని, పోలీసు అధికారులను సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు కనీస సౌకర్యాలు కల్పించడంలో ముందుంటారు. కానీ ఈ ఒక్క విషయంలో ఎందుకు వెనుకున్నారో అర్థం కావడం లేదంటున్నారు. స్థానిక ప్రజలతోపాటు నిత్యం కాలినడక నడిచే వాకర్స్‌కు జరగరాని సంఘటన ఏదైనా జరిగితే తప్ప స్పందించరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైబ్రంట్ బిల్డ్‌కాన్-2025

- ఏప్రిల్ 13 నుంచి 16వరకు నిర్వహణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిర్మాణ సామగ్రి ఎక్స్‌పో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వైబ్రంట్ బిల్డ్‌కాన్-2025 ఏప్రిల్ 13 నుంచి 16వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక యశోభూమి ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. ఈ సందర్భంగా వైబ్రంట్ బిల్డ్‌కాన్-2025 నిర్వాహకుడు మాట్లాడుతూ "ప్రదర్శకులకు, వైబ్రంట్ బిల్డ్‌కాన్-2025 అసమానమైన బహిర్గతం,కొత్త వ్యాపార అవకాశాలకు ఒక ప్రవేశ ద్వారం. సందర్శకులు నిర్మాణ భవిష్యత్‌ను రూపొందించే తాజా సాంకేతిక పురోగతులు, ధోరణుల గురించి సమగ్ర అవగాహన పొందుతారు" అని రాజ్‌కోట్ హార్డ్‌వేర్ తయారీదారుల సంఘం అధ్యక్షుడు మనీష్ పటేల్ అన్నారు. "వైబ్రాంట్ బిల్డ్‌కాన్-2025 భారతదేశ ఆర్థిక వద్ధిని నడిపించడంలో, ప్రపంచ భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో, నిర్మాణ సామగ్రి పరిశ్రమలో మన దేశం అసమాన సామర్థ్యాలను ప్రదర్శిం చడంలో ఉత్ప్రేరకంగా పని చేస్తుంది" అని కాపెక్సిల్ స్పోక్‌పెన్ పర్సన్ అన్నారు.

ఓయూలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌లు బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

విశ్వవిద్యాలయ ఒప్పంద అధ్యాపకుల స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకులందరు యూజీసీ పే స్కేల్స్ వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎన్‌సీసీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డా. ఈ.ఉపేందర్, డాక్టర్ సీమర్ల విజయేందర్ రెడ్డిలు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ఆ వైపుగా ఎటువంటి చర్య చేపట్టకపోవడం అత్యంత విచారకరమని వాపోయారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మెన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి గత నెల రోజుల క్రితం వారి కార్యాలయం ముందు ధర్నా చేసిన సందర్భంగా పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం అత్యంత దుర్మార్గమని అన్నారు. రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 60 నుంచి 65 ఏండ్లకు పెంచే విషయంలో ప్రదర్శిస్తున్న ఉత్సాహం కాంట్రాక్ట్ అధ్యాపకుల విషయంలో ప్రదర్శించకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. చాలిచాలని వేతనాలతో గత 20 ఏండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను చులకన భావంతో చూస్తూ వారి సమస్య పట్టించుకోకుండా కావాలని ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయటం తగదన్నారు. సమస్య పరిష్కారం చేయకుండా ఇలానే ఉంటే త్వరలో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాలను పూర్తిగా స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మెన్ డా. చిన్నారెడ్డి, ప్రొ. హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంల ద్వారా వారికి న్యాయం చేయాలని సీఎంకు పలుమార్లు విన్నవించిన అధికారులు అమలు చేయకపోవడం సరికాదని తెలిపారు. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమంలో డా. ఈ. ఉపేందర్, డా.విజయేందర్ రెడ్డి, డా.సనత్, డా, రేష్మా రెడ్డి డా.రామలింగం, డా.రమేష్, డా.రవి, డా.రాజేంద్రప్రసాద్, డా.నింగం, డా.అశోక్, డా. చిరంజీవి పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ



నవతెలంగాణ-ఓయూ

ప్రజల మనిషి తొలి, మలి తెలంగాణా ఉద్యమ గొంతుక అణగారిన ప్రజల కోసం తన వ్యక్తి గత జీవితం వదిలేసిన గద్దర్‌పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ తెలంగాణా శాఖ అధ్యక్షులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ పద్మశ్రీ అవార్డు విషయంలో చేసిన మనువాద వ్యాఖ్యలపైన ఆయన తెలంగాణా ప్రజలకే కాదు మొత్తం దేశ ప్రజలకు బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. గద్దర్ విప్లవ సంస్థ పనిచేసి నప్పుడు అందులోలో నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పని చేశారు. ఈ విషయంలో మాదిగ సోదరు లు మాదిగ మేధావులు, కవులు కళా కారులు స్పందించక పోవడం శోచనీయం.



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 కేబిఆర్ పార్కులో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండే ప్రదేశంలో సెక్యూరిటీ కళ్ళు కప్పి పార్కులోని ప్రహారీ గ్రిల్‌కు చెట్టుకు ఉయ్యాల వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి కూర్చున్నాడు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

సేవాలాల్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి



- బీఆర్ఎస్ నాయకుడు కరాటే నాయక్

నవతెలంగాణ-ఓయూ

ఫిబ్రవరి 15 జాతీయ సేవాలాల్ మహారాజ్ జయంతిని జాతీయ సెలవు దినోత్సవంగా ప్రకటించాలని ఓయూ జాక్ చైర్మెన్ గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా.కరాటే రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్‌లో జరిగే కార్యక్రమం గోడ పత్రికలు ఆవిష్కరించారు. దేశంలో బంజారాలు 15 కోట్ల మంది ఉన్నారని వారందరికీ బంజారా ఆరాధ్య దైవం గొప్ప సంఘ సంస్కర్త శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ఇవ్వాలని, సేవాలాల్ మహారాజ్ జయంతి దేశవ్యాప్తంగా జరపడానికి 1000 కోట్ల నిధులు కేటాయించాలని, సేవాలాల్ మహారాజ్ జయంతిని భారత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశంలో 15 కోట్ల బంజారా బిడ్డలు మాట్లాడే బాషా గోర్ బోలిని భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఎస్సీ బీసీ కమిషన్ కమిషన్ల మాదిరిగా దేశంలో రాష్ట్రంలో బంజారా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. హిందువుల ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి తిరుపతి దేవస్థానం హతిరం బాపు ఆస్తులు కాపాడి టీటీడీ బోర్డులో గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పుడైనా టీటీడీ బోర్డులో బంజారాలకు స్థానం కల్పించి హతిరం మఠం ఆస్తులు కాపాడాలని ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లు వచ్చే నెల సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలైన ఫిబ్రవరి 15లోపు చేయాలని తెలిపారు. ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా కార్యక్రమం ఉంటుందని, దేశంలో ఉన్న బంజారాలు కదలి రావాలని కరాటే రాజు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు ఇందల్ రాథోడ్, కార్యనిర్వాహక అధ్యక్షులు వెంకట్ బంజార, ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయక్, ఇన్‌చార్జి రాజ్ కుమార్ నాయక్, అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాన్ శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధీర్ నాయక్, మహేష్ నాయక్, నరేష్ నాయక్, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

- ప్రారంభించిన కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

బాపూజీనగర్‌లోని శ్రీదేవి నల్ల పోచమ్మ దేవాలయంలో బుధవారం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, మార్కెట్ చైర్మెన్ ఆనంద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నాం. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాలాద్రి, అజిత్ కళ్యాణ్, రామారావు, దుర్గయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన గడువు పెంచండి

- 2018 పీహెచ్డీ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

2018 పరిశోధక విద్యార్థుల గడువును ఏడాది పాటు పొడిగించాలని బుధవారం ఓయూ ఓఎస్డీ ప్రొ.జితేందర్ నాయక్, స్టూడెంట్ డీన్ ప్రొ. రాజేందర్‌ని ఐక్య విద్యార్థి సంఘాల పరిశోధక విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. వీసీతో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కారోన కాలంలో నష్టపోయిన సందర్భంగా గడువు పొడగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ 2018 పీహెచ్డీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు మధురంగా ఆలాపన



నవతెలంగాణ-కల్చరల్

అన్నమయ్య కీర్తనలు గాయనీమణులు వాణీ తన సహా గాయని పవిత్రతో కలసి మధురంగా ఆలపించారు. కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై వసంత పంచమి పురస్కరించుకొని వాణీ భక్తి గీతాల గానం చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ వేత్త పులిగడ్డ హనుమంత రాయ శర్మ పాల్గొని మాట్లాడుతూ.. వాణీ గళంలో మధుర్యం ఉందని అభినందించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ పత్రికా రచయిత పులివర్తి కష్ణ మూర్తి మాట్లాడుతూ.. అన్నమయ్య కీర్తనలు ప్రతి ఇంటా నేడు వినిపిస్తున్నాయని చెప్పారు. వాణీ సహా గాయని పవిత్రలకు మంచి భవిష్యత్ వుంటుందని అభినందించారు.

నేడు జీహెచ్ఎంసీ పాలకమండలి బడ్జెట్ సమావేశం

- సమావేశం సజావుగా సాగేనా?



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్25-26 పాలకమండలి బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరగనుంది. ఈ ప్రత్యేక సమాశంలో దాదాపు 22 ప్రశ్నలతో కూడిన బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం తిరిగి సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. అత్యంత ముఖ్యమైన బడ్జెట్ సమావేశంతోపాటు అనంతరం జరిగే నగర ప్రజల సమస్యలపై సమావేశం సజావుగా సాగుతుందా... లేక గతంలో మాదిరిగానే వాయిదాల పర్వంతో ముగుస్తుందా చూడాల్సిందే. గత సమావేశాలు ప్రజా సమస్యలపై చర్చజరగకుండానే పోటాపోటీ నినాదాలతో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సమావేశం సజావుగా సాగుతుందా లేక వాయిదా పడుతుందా వేచిచూడాల్సిందే.

నాలుగేళ్లు పూర్తికాకుండా అవిశ్వాసానికి నో ఛాన్స్..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి ఏర్పడి ఫిబ్రవరి 11కు నాలుగేళ్లు పూర్తవుతుంది. అప్పుడు మెజార్టీ ఉన్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు, 2021 ఫిబ్రవరి 11న మేయర్ గద్వాల విజయలక్ష్మిని డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలత శోభన్ రెడ్డిని ఎన్నుకున్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కారు దిగిన మేయర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఆ పార్టీ వర్గీయులు అస్సలు జీర్ణించుకోలేకపోతోంది. అధికారం కోల్పోయిన సమయంలో అండగా ఉండాల్సిన మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీని వదిలి వెళ్లిపోవడంతో వాళ్లని ఎలాగైనా గద్దె దింపాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు గుర్రుమీదున్నారు. ఈ బడ్జెట్ సమావేశంలోనే అవిశ్వాస తీర్మానం పెట్టాలని భావించినట్టు తెలుస్తోంది. కానీ పాలక మండలికి నాలుగేళ్లు పూర్తికాకుండా అవిశ్వాసం పెట్టకూడదన్న నిబంధన ఉండడంతో వచ్చే ఫిబ్రవరి వరకు వేచిచూడాల్సిందే నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే తాజాగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశం బల్దియా వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను బుధవారం వెంగళరావు నగర్ నివాసి హైదరాబాద్ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోద రవి కిరణ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



బాలికల సాధికారత లక్ష్యంగా పని చేస్తాం..

- సేవా భారతి సంస్థ నిర్వహకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

సమాజ సేవకు, సంక్షేమానికి అంకితమైన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ, సేవా భారతి తన వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' 9వ ఎడిషన్‌ను 2025 ఫిబ్రవరి 02 ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బిబ్స్‌ను ఫ్రీడమ్ ఆయిల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జీఎం చేతన్, గ్లోబల్ డాటా డైరెక్టర్ స్వప్న మహేరియా, ప్రసన్న కాంత్, సేవా భారతి ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత, సంయుక్త కార్యదర్శి జయప్రద, సైబరాబాద్ సేవా భారతి అధ్యక్షురాలు ఉషా అయ్యర్, రన్ అంబాసిడర్ సరిత నర్మెట్ట, శ్రీనివాస్ తాడూరి, అఖిల్లు కలిసి పోస్టర్‌లను టీ షర్ట్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి, చేతన్ మాట్లాడుతూ.. ఈ రన్‌లో పాల్గొనేందుకు ఇప్పటికే 10 వేల మంది తమ పేరు నమోదు చేసుకున్నారన్నారు. సామాజిక బాధ్యతగా సేవా భారతి సంస్థ సేవలకు సహకారంగా ఉంటున్నందుకు గర్వపడుతున్నామన్నారు. స్వప్న మహేరియా, ప్రసన్న కాంత్‌లు మాట్లాడుతూ.. బాలికల సాధికారత కోసం ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. అందుకు మా సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. జయప్రద దేవి మాట్లాడుతూ.. 2004లో కేవలం 11 కేంద్రాలతో ప్రారంభమై, ఇప్పుడు 300 కిషోరీ వికాస కేంద్రాలను ఏర్పాటు చేశాం అన్నారు. డాక్టర్ సుమలత మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న అవసరాలను బట్టి వివిధ రంగాల్లో సేవా భారతి సేవలు అందిస్తున్నదని అన్నారు. కిషోరీ వికాస యోజనతో సేవా భారతి చదువు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యంలో తోడ్పాటు ఇస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 2న గచ్చిబౌలిలో జరిగే 9వ విడత రన్ ఫర్ గర్ల్ చైల్డ్, ఫిబ్రవరి 1న అద్భుతంగా ఉండే ఉడాన్ ఉత్సవంలో పాల్గొనాలని, అదే ఉత్సవంలో రన్నర్స్‌కు టీ షర్ట్స్, బిబ్స్ పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయాన్ని సేవాభారతి కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని మురికి వాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి కోసం ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు ప్రతి ఏడాది 10 వేల మంది బాలికలకు సాధికారత కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి లక్ష మంది ఆడపిల్లలకు భవిష్యత్ ప్రణాళికల ద్వారా సాధికారత సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ రన్ కు సహకరిస్తున్న ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్ డేటా, ఇన్ఫోసిస్, పాల్ టెక్, జీఈపీ, హెల్త్ ఎడ్జ్, ఫిల్ట్రేషన్ గ్రూప్, యూఎస్‌టీ, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్, బీడీఎల్ వంటి సంస్థలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ కార్యక్రమానికి దాతలు, రన్నర్లు www.runforagirlchild.org ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సేవాభారతి ఇతర సభ్యులు పిలుపునిచ్చారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాలకు 91 98480 34767 సంప్రదించగలరని విజ్ఞప్తి చేశారు.

నవ్య నాటక సమితి ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం



నవతెలంగాణ-కల్చరల్

అరవై ఏడేండ్లుగా సాంస్కృతిక రంగంలో జంట నగరాల్లో సుదీర్ఘ కాలం నిలిచిన సంస్థ నవ్య నాటక సమితి అని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి వసుంధర అన్నారు. యువ ప్రవర్ధమాన కళాకారులకు వేదిక కల్పిస్తూ జాతీయ స్థాయిలో సంగీత నత్య పోటీలను 49 ఏండ్లుగా నిర్వహించటం విశేష మని పేర్కొన్నారు. నవ్య నాటక సమితి, నవ్య సాహిత్య సమితి సంయుక్త వార్షిక సమావేశం సంస్థ కార్యలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వసుంధర సంస్థల పక్షాన ప్రఖ్యాత సంగీత కళా కారులు డాక్టర్ తాడేపల్లి లోక నాథ శర్మ సత్కరించి అభినందించారు. సన్మాన గ్రహీత లోక నాథ శర్మ మాట్లాడుతూ.. 1961 నుంచీ వెమరాజు నరసింహా రావు ఆరంభించిన జాతీయ నత్య సంగీత పోటీలను క్రమం తప్పక తదనంతర కాలంలో ఆయన కుమారుడు విజయ కుమార్ నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. రోబోయే స్వర్ణోత్సవ వేడుక విజయవంతం కావలెనని ఆకాంక్ష వ్యక్తం చేశారు. నవ్య సాహిత్య సమితి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ విధ్యారన్య స్వామి, చలపతి శాస్త్రి, గోదా లక్ష్మి, నిస్థల, సుధామాల పాల్గొన్నారు.

పార్క్‌లో లైట్స్ ఏర్పాటు చేసిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ ప్రత్యేక చోరవతో కెప్టెన్ వీరరాజిరెడ్డి ఉద్యానవనంలో బుధవారం రాత్రి ఎల్ఈడి ఐమాస్ లైట్లు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పార్క్ వచ్చిన ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఎల్ఈడీ లైట్లు వెలుతురు చాలా బాగుందని, పార్క్‌కి కొత్త అందాల్ని తీసుకోచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. పార్క్ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ పార్కులోని అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని విధాల సహకరిస్తున్నటువంటి కార్పొరేటర్ హృదయపూర్వక ధన్యవాదాలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారులు ఈఈ పున్నా నాయక్, డిఈ రవీందర్ రెడ్డి, ఎఈ ప్రసాద్ అధ్వర్యంలో డివిజన్‌లోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా డివిజన్‌లోని పార్కులలో, ఆటస్థలాలల్లో, ప్రధానమైన కూడళ్లలో, హైమాస్ లైట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్క్ కమిటీ సభ్యులు రుద్ర శేఖర్, అన్నం రాఘవరెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్ రావు, జైపాల్ రెడ్డి, సునీల్ రెడ్డి, లక్ష్మారెడ్డి బీజేపీ నాయకులు న్యాలకొండ సుమన్ రావు, చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్, పూల్లూరి భాస్కర్, సాధినేని గీత, కోండేరు స్రవంతి, పాల్గొన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు



నవతెలంగాణ-ఓయూ

అభయాంజనేయ స్వామి దేవాలయము, ఎన్‌జీఆర్ఐ గేట్ -2, ఉప్పల్ వద్ద ఉన్న ఆలయల హుండిల బుధవారం లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపు నందు రూ.3,35,746 వచ్చాయని నిర్వాహకులు పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకులు ప్రణీత్ కుమార్, ఆలయ ఈఓ వెంకన్న, ఆలయ కమిటీ మెంబెర్స్ దేవిరెడ్డి, మదన్ గౌడ్, ధర్మనాయక్, అంజయ్య, అమరేశ్వరీ, రాజేశ్వరి, రాఘవేంద్ర, అంజయ్య గుప్త, ఈగ అంజయ్య, లక్ష్మా రెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డాక్టరేట్‌ను అందుకున్న పీఆర్.శ్రీనివాసన్



నవతెలంగాణ-ఓయూ

ప్రముఖ ఎంటర్‌ప్యూనర్ పీఆర్. శ్రీనివాసన్ ఇటీవల యునైటెడ్ థియాలొజీకల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవా లను పురష్కరించుకుని వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని గుర్తించి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేసిన విషయం తెల్సిందే. దానిలో భాగంగానే ఎంటర్‌ప్యూనర్‌షిప్, సృజనాత్మక రంగంలో సమాజ పురోభివృద్ధిని నడిపించే ఆవిష్కరణలు, సహకారం, అవకాశాలను సృష్టించడంపై శ్రీనివాసన్ చేస్తున్న విశేషమైన కృషిని, సేవలను గుర్తించిన యునైటెడ్ థియాలొజీకల్ రీసెర్చ్ యూనివర్సిటీ యూనివర్సిటీ అతనికి గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. విశ్రాంత జడ్జి మధుసూదన్రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.దీపక్ ఫ్రాన్సిస్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఈ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందజేసిన థియాలొజికల్ యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

PUBLIC NOTICE

It is informed to the general public that my Client **Mrs. Shafia Ahmed** W/o. Maqdoom Mohiuddin informed that she had misplaced Original Registered Sale Deed (Link) Doc. **No.894/2009**, Dt: 22-05-2009 at SRO, Charminar executed by 1)Mr. Mohammed Ali Zahid S/o. Late M.A.Gaffar, 2)Mrs. Anjum Ara W/o. Mohammed Ali Zahid in favour of Mr. Mohammed Ashfaq, pertaining to the below mentioned Schedule of Property. If anybody found the above Documents same may be intimated / hand over the same to the below mentioned office. My Client further states that she wants to avail loan by mortgaging the schedule mentioned property. If any person has any claim / interest / dispute over the said transaction, the same may be intimated to the undersigned within 7 (seven) days from the date of this publication, failing which, no further claims / objections will be entertained and my client will proceed with the same.

SCHEDULE OF PROPERTY

All that the 630.0 Sq.Ft., (out of 5917 Sq.Ft), portion of **Second Floor** upto slab level of Minar Market, with undivided share of land admg **23.0 Sq.Yds.**, in premises bearing Municipal No.22-7-267, situated at Inside Diwan Devdi, Hyderabad, T.S., and bounded by: North: Property of Shafia Maqdoom, South: Portion of M.A. Waheed, East: Seri, West: Property of Abid Mohiuddin & Others

Sd/- **P. Santosh Kumar**, Advocate
#1-8-506/2/A/1, Adnan Chambers,
Prakashnagar, Begumpet,
Secunderabad,-16. Ph:09440067560

PUBLIC NOTICE (LOST DOCUMENT)

The general public are hereby informed that on 25/04/2024 my client, **YENUGU VIJAYA REDDY** D/o. Yenugu Ram Reddy, has lost Original Sale Deed Document No. 2219 of 1998 in respect of Plot bearing No.1353 admeasuring 220 Square Yards, situated at "Sri Lakshmi Narsimha Enclave" (L.P.No.71/1998), Bhongir Village and Mandal, Yadadri-Bhuvanagiri District, Telangana. That my client lost the said document while she was carrying the said document along with other documents from Shameerpet to Medipally, Peerzadiguda. Hence, the general public are hereby requested that if anyone finds the said original document kindly contact the undersigned so that arrangements would be made for collecting the said document.

HYDERABAD,
Dated: 30-01-2025

Sd/- A.P.Suresh & Associates,
Law Chambers, (Advocates)
Plot No.18, Shree Ji Krupa, H.No:1-10-68/A/1,
Chikoti Gardens, Begumpet, Hyderabad-500016,
Telangana, Tel.No:040- 23405029

IN THE COURT OF THE IV ADDL. SENIOR CIVIL JUDGE: R.R.DISTRICT:AT: L.B. NAGAR
E.P. No.139 of 2023
In
O.S.No.1099 Of 2018

Between:
Sri A. Surender Reddy (Died per L.R.s) & Others ...Decree Holders
And
Sri Botla Sreenivasulu ...Judgement Debtors

NOTICE

To:
Sri Botla Sreenivasulu S/o B.Subba Rao Aged about 21 Yrs, Occ: Electrician Permanent R/o Vallur Post, Ponnur Taluk Kakumanu Mandal, Guntur District. Presently R/o: Plot/Flat No.B1,Street No.4 Rajendranagar Ranga Reddy District

Take notice that the above named Decree Holders have filed the above E.P. for Execution of Specific Performance Decree dated: 25-10-2018 against you in respect of registration of E.P. schedule property through court. The above said E.P. is posted to **11-03-2025** at 10.30 a.m. before the above said Hon'ble Court for your appearance. If you fail to appear on the date and time mentioned above either in person or though pleader the matter will be heard and decided in your absence in accordance with law.

//BY ORDERS OF THE HONOURABLE COURT//
Sd/-
S. Shekhar Reddy &
D. Udayasree, Advocates
Office: D.No. 3-9-419/1, Sree Saraswathinagar Colony, Chintalkunta Old Check Post L.B. Nagar, Hyderabad-500074
Mobile No. 9848092440.
Counsel for the Decree Holders

IN THE COURT OF FAMILY CUM IV ADDL. AND SESSIONS JUDGE, AT: SANGAREDDY
O.S.NO.50 OF 2024

Between:
Mohammed Abdul Hadi & Others ...Plaintiff
AND
Mohammed Abdul Razzak & Others ...Defendants

To,
The Defendants
4.Smt.B.Geetha, W/o.B.Vinay Kumar, Aged about 57 years, Occ: Household, R/o.H.No. 4-8-12 0, Kummarpally, Hanmakonda,Warangal Dist, T.S
5.Smt.P.Vaneetha, W/o.P.Ashok Kumar, Aged about 54 years, Occ: Household, R/o. H.No.11-29-259, Ramanthapuri, Desaipet Road Warangal District, T.S.
6.Smt.G.Aruna, W/o.Vidyasagar, Aged about 69 years, Occ: House Wife. R/o.H.No.7702 (New No.1-2-16), Kalasiguda, Seccunderabad, T.S

Please take that the above named plaintiff has filed above suit against you for SUIT FOR PARTITON AND SEPERATE POSSESSION & DECLARATION TO DECLARE THE REGISTERED SALE DEEDS NO.111/1970 DATED 31-01-1970, GIFT SETTLEMENT DEED VIDE DOCT No. 1490/2004 DATED 10-2-2004 AND SALE DEED VIDE DOCT No.5499/2004 DATED 28-4-2004 AS NULL AND VOID AND NOT BINDING ON THE PLAINTIFFS regarding land in the Survey No. 223, admeasuring Ac.5-31 Gts and Survey No.233 situated at Patancheruvu Village and Mandal, Medak District.
The suit posted was on 14-02-2025 for your appearance. You are therefore requested to be present before the above mentioned court on 21-01-2025 at 10.30 a.m. in person or through an advocate. Failing which you will be set exparte suit will be proceeded against you in your absence.

//By order of the Court//
RAJESH POLA,
Advocates
#Plot 4a,4b Raghavendra Nagar
Beeram Guda, Patancheru
Hyderabad-502032.
Cell: 7032331655
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD
E.P.No.316 of 2024

Between:
Irfan Khan ...Decree Holder
AND
Batul Unissa Begum ...Judgment Debtor

To
Batul Unissa Begum D/o. Yousuf Ali Mirza, aged about 72 years, Occ: Household, R/o. H.No.6-2-962, Nirmala School Lane, Khairtabad, Hyderabad, T.S.
Please take notice that the above named Decree-Holder has filed above E.P. against you and the Hon'ble Court directed you to appear before the Hon'ble Court on 13-02-2025 at 10:30 AM either in person or through an advocate. Otherwise, the matter will be heard and determined in your absence by the orders of the Hon'ble Court.

D.Manik Rao
(Advocate)
Office: 18-8-434/3/31,
Lalithabagh, Uppuguda,
Hyderabad - 53
Phone No.9948181345.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XIV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP. NO.1020 OF 2021

Between:
Smt.Shaik Rizwana Begum and Others ...Petitioner
And
Chandrashekar Vadone and Others. ....Respondents

To,
1. Chandrashekar Vadone, s/o. Vadone Durgaji, Occ: Business, Owner of crimevehicle, R/o. H.No. 4-2-10,Prabhumandir Road, Sada shivpet,SadashivPet Mandal, Sangareddy Dist. R1
2. Jana Joseph Prathap Raj, S/o. Prabhu das,Occ:Driver of Vehicle, R/o.H.No.6-3/2, Bhavanapuram, Ramachandrapuram,Sangareddy Dist. ....Respondent 3
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **3-3-25** .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s. M.Vishwanath
ADVOCATE
Punjagutta,Hyderabad.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XXVI ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD.
I.A.No.352 OF 2024
IN
MVOP. NO.1957 OF 2019

Between:
T.Bala Narasamma and Others . ...Petitioner
And
Mohd. Raheemuddin and Others .....Respondents

To,
1. Pitani Srinivas, S/o. Suryanarayana,Occ:Driver,H.No.33-190,Rajeev Gandhi Nagar,IDA Jeedimetla,Medchal Malkajgiri Dist.(Driver of the Tipper Lorry Bearing No.AP 05 TD -5677) ....Respondent 3
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **17-2-2025** .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.P.Rama Krishna Reddy, Advocate.
Narayanguda,Hyderabad.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR.
O.S.NO.67 OF 2025.

Between:
Satyanarayana Balnarayan Prasad & another ...Plaintiffs
AND
Vaddepally Laxmaiah & another ...Defendants

To,
All Concerned ...Defendant No.2
Please take notice that the Plaintiffs have filed the above suit against you and another, to declare them as the Legal Heirs of the deceased Shakuntala Tiwari, W/o.Late J.Satyanarayan. The above suit is posted to 27.02.2025. You are hereby summoned to appear before the Hon'ble Court on 27.02.2025, at about 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

All that the Part and parcel of the Open land bearing Plot No.1 Part, admeasuring 563.5 Sq.yds., or 471 Sq.mtrs., in Sy.No.20, situated at Hathiguda Village, Previously Hayathnagar Revenue Mandal, Presently under Abdullapurmet Mandal, Previously under Kuntloor Grampanchayath, Presently under Pedda Amberpet Municipality, Ranga Reddy District and bounded by: NORTH : Plot No.1 Part
SOUTH : Neighbour's Land
EAST : 40' Wide Road
WEST : Neighbour's Land

(BY ORDER OF THE COURT)
M/s. HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar,
Hayathnagar, Hyderabad
Counsel for the Plaintiffs.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో సూర్యాపేట నందు
I.A.NO. 199 of 2024
IN
O.S.NO. 08 OF 2024

మధ్యన :
వి.యల్.బి. కేసరి (నెలమకన్ని లక్ష్మి బ్రహ్మానంద కేసరి). ...... పిటిషనర్/వాది
మరియు
శెనగాని రాంబాబు మరియు ఇతరులు, ... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు
పేర్ల జ్యోతి, భర్త, పాపయ్య, వయస్సు 47సం.లు, వృత్తి, గృహిణి, నివాసం. బి-7, ప్రణయ్ అపార్ట్మెంట్స్, కొంపల్లి, కుతుబ్దాల్లాపూర్, హైదరాబాద్. (ప్రదివాది నెం.9).

నోటీసు

పైన తెలిపిన వాది మీ పై వేసిన పిటిషన్ I.A.NO. 199 of 2024 తేది.04.03.2025 న కోర్టులో వాయిదా కలదు. ఇట్టి పిటిషన్ నోటీసులు మీకు పలుమార్లు పంపిననూ ఉద్దేశపూర్వకంగా తామీలు కాకుండా చేయుచున్నందున ఇట్టి ప్రకటన ఇవ్వనైనది.

కావున మీరు తేది. 04-03-2025న ఉదయం. 10-30గం.లు తదుపరి పై కోర్టు నందు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కాని ఎడల పిటిషన్‌ను ఏకపక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా)

ఇట్లు
వి.వెంకటేశ్వర రావు,
మేడిగ ఈశ్వర్ కుమార్,
అడ్వకేట్స్ - సూర్యాపేట,
సెల్ 9848198660

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో సూర్యాపేట నందు
I.A.NO. 198 of 2024
IN
O.S.NO. 08 OF 2024

మధ్యన :
వి.యల్.బి. కేసరి (నెలమకన్ని లక్ష్మి బ్రహ్మానంద కేసరి). ...... పిటిషనర్/వాది
మరియు
శెనగాని రాంబాబు మరియు ఇతరులు, ... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు,
పేర్ల జ్యోతి, భర్త, పాపయ్య, వయస్సు 47సం.లు, వృత్తి, గృహిణి, నివాసం. బి-7, ప్రణయ్ అపార్ట్మెంట్స్, కొంపల్లి, కుతుబ్దాల్లాపూర్, హైదరాబాద్. (ప్రదివాది నెం.9).

నోటీసు

పైన తెలిపిన వాది మీ పై వేసిన పిటిషన్ I.A.NO. 198 of 2024 తేది.04.03.2025న కోర్టులో వాయిదా కలదు. ఇట్టి పిటిషన్ నోటీసులు మీకు పలుమార్లు పంపిననూ ఉద్దేశపూర్వకంగా తామీలు కాకుండా చేయుచున్నందున ఇట్టి ప్రకటన ఇవ్వనైనది.

కావున మీరు తేది. 04-03-2025న ఉదయం. 10-30గం.లు తదుపరి పై కోర్టు నందు ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కాని ఎడల పిటిషన్‌ను ఏకపక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా)

ఇట్లు
వి.వెంకటేశ్వర రావు,
మేడిగ ఈశ్వర్ కుమార్,
అడ్వకేట్స్ - సూర్యాపేట,
సెల్ 9848198660

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE-JUDGE AT : MAHABUBNAGAR
I. A. No. 119 of 2023
In
SOP. No. 9 of 2022

Between:-
Gollapally prasad ..... Petitioners
And
The Associate Vice President (Claims) ICICI Prudential Life Insurance Co. Ltd. ..... Respondents

NOTICE

To
(R-2) Smt. R.Srilatha W/o Late G.Sunder, R/o Plot No.31-E,Satyanagar Colony, N.G.Os Colony,Vanasthalipuram,Hyderabad.

WHEREAS the above Petitioner has filed above I. A in S. O. P. against you and others. Under order 6 Rule 17 of CPC and r/w Rule 28 of CRP & 151 CPC Amendment of Petition of Indian Succession Act filed under Sec. 372 for grant of Succession Certificate in his favour in respect of Insurance Claim Benefits from R1 vide Policy No. 16827319 on the death of his father namely Late Gollapally Sunde. The said I. A . stands posted on 20.02.2025, for your appearance. You are hereby directed to appear before the above Court on said date at 10-30 a. m. either in person or through Advocate and in default the matter will be decided on the material available on record.

// BY ORDER OF THE COURT //

P. RAJENDRA PRASAD
Advocate,
Mahabubnagar.
Cell. No. 9848537684.

పైప్ లైన్ పనులను పరిశీలించిన కళ్లెం



నవతెలంగాణ-హయత్‌నగర్

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మార్నింగ్ వాక్‌లో భాగంగా హయత్ నగర్ డివిజన్‌లోని ఆటో సాయి నగర్‌లో చేపట్టిన నూతన తాగునీటి పైప్ లైన్ పనులను కాలనీవాసులతో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమకు సమాచారం అందించాలని కాలనీవాసులకు సూచించారు. కార్పొరేటర్ వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, ఆటో సాయి నగర్ కాలనీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు పార్వతి, కాలనీవాసులు ఉన్నారు.

'ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'



నవతెలంగాణ - చంపాపేట్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి సూచించారు. బుధవారం యాకుత్‌పురా నియోజకవర్గం మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫోకస్ హై స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరీ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు ట్రాఫిక్ సిబ్బంది, ఎస్సైలు, ఉమర్, శివ, ఇమాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్లతో కోహెడ మార్కెట్

- సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన
- మార్కెటింగ్ కమిటీ ఉద్యోగుల సమావేశంలో మంత్రి తుమ్మల

నవతెలంగాణ -దిల్ సుఖ్ నగర్

రెండు వేల కోట్ల రూపాయల వ్యయంతో కోహెడ ఆధునిక మార్కెట్‌కు త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల





నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ మార్కెటింగ్ కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిలుక నర్సింహా రెడ్డి అధ్యక్షతన ఎన్టీఆర్ నగర్ లో బుధవారం సంఘం డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ అత్యంత ఆధునికంగా నిర్మించనున్న కోహెడ మార్కెట్ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులు, అధికారులు, సిబ్బందికి సకల సౌకర్యాలతో ఈ మార్కెట్ రూపుదిద్దుకుంటుందని వివరించారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటమే కాకుండా రాబోయే రీజినల్ రింగ్ రోడ్డుకు సైతం కోహెడ మార్కెట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రపంచ ప్రమాణాలతో మార్కెట్‌ను నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్డు సరసన కోహెడ మార్కెట్ కూడ చోటు చేసుకుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని అసహనాన్ని వ్యక్తం చేశారు. దశలవారీగా రైతులకు ఇచ్చిన హామీలు అన్నింటినీ పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. గత దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ప్రభుత్వం రైతులకు ఒరిగి బెట్టింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా, భూమి లేని నిరుపేదలకు ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. మార్కెటింగ్ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం, ప్రతి నెల మొదటి తేదిన వేతనాలు ఇవ్వడం, పదోన్నతులు, విశ్రాంతి ఉద్యోగుల ఫించన్లు కూడా సకాలంలో అందజేయడానికి చర్యలు తీసుకుంటానన్నారు. అదే విధంగా మార్కెట్ లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచడం, సిబ్బంది పెంచడానికి ఉన్నతాధికారులకు సహకరిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ మార్కెట్ లో దళారీ వ్యవస్థకు చరమగీతం పాడాలని మంత్రి తుమ్మలను కోరారు.

తెలంగాణ మార్కెటింగ్ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులు చిలుక నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు నేరుగా సేవలు అందించే ఏకైక డిపార్ట్మెంట్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు అని అన్నారు. అన్ని వేళల్లో అన్నదాతలకు అందుబాటులో ఉంటున్న మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బాధలను కూడా ప్రభుత్వం సానుకూలంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అనేది స్థానిక మార్కెట్ కమిటీ ఉద్యోగులు నిర్ణయం కాదని ప్రభుత్వాల ఆదేశాలను మాత్రమే అమలు చేస్తామని అన్నారు. అయినప్పటికీ అక్కడక్కడ దురదృష్టకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అచ్చంపేట, వికారాబాద్, పరిగి ప్రాంతాల్లో రైతుల ముసుగులో కొందరు ఉద్యోగులుపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం నియమించిన చైర్మెన్లు రాయల నాగేశ్వరరావు, మల్ రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహా రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సంచాలకులు ఉదయ్ కుమార్, లక్ష్మి బాయి మార్కెట్ కమిటీ చైర్మెన్లు చిలుక మధుసూదన్ రెడ్డి, చెకోలేకర్ లక్ష్మి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి, డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ముక్రం తదితరులు పాల్గొన్నారు.

రంగులకు నోచుకోని డివైడర్లు

నవతెలంగాణ- నాగోల్

నిర్మాణం పూర్తైయి నెల రోజులు గడుస్తున్నా రంగులకు , ప్రమాద సూచికలకు నోచుకోని నాగోలు డివిజన్‌లోని ఆనంద నగర్ కూడలి డివైడర్‌తో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా నాగోలు డివిజన్‌లోని రేడియల్ రోడ్డులో బండ్లగూడ కూడలి, ఆనంద్ నగర్ కూడలితో తాజా హెూటల్ వరకు 40 అడుగుల సీసీ రోడ్లను నిర్మించారు. దీంతో బండ్లగూడ, ఆనంద నగర్ కూడలీలు ఇరుకు ప్రాంతాలుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుందని, దానిని అధిగమించేందుకు ఆనంద్‌నగర్ కూడలిలో కొంత దూరం డివైడర్ల నిర్మాణాన్ని చేపట్టారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డివైడర్ నిర్మాణం పూర్తయి నెల రోజులు గడుస్తున్నా నూతన డివైడర్‌కు రంగులు వేయడం గాని, గ్రీల్స్‌ని బిగించడం గాని చేపట్టకపోవడంతో రాత్రి వేళలో వాటిని గమనించక వాహనదారులు ఎలాంటి ప్రమాదానికి గురికావలసి వస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

నూతనంగా నిర్మాణం చేపట్టిన సిమెంట్ డివైడర్‌కు రోజులు గడిచిపోతున్న ప్రమాద సూచికలను ఏర్పాటు చేయలేదని, ఇది అధికారుల నిర్లక్ష్యం అని ప్రజలు వాపోతున్నారు. నగరంలో ఎక్కడ డివైడర్ల నిర్మాణాలు చేపట్టిన రెండు, మూడు రోజుల్లోనే రంగులు వేయడం, గ్రిల్స్ ను బిగించడం జరుగుతుంది కానీ ఆనంద నగర్ కూడలిలోని డివైడర్‌కు రంగులు వేయడం, కనీసం ప్రమాద సూచికలను ఏర్పాటు చేయకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనే ఆరోపణలు



వినిపిస్తున్నాయి.

నాగోల్ ఫ్లైఓవర్ నుండి ఓఆర్ఆర్ వెళ్లే ఈ రేడియల్ రోడ్డు అనంతుల రాంరెడ్డి గార్డెన్ నుండి తాజా హెూటల్ వరకు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరడంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. నాగోల్ ఫ్లైఓవర్ నుండి ప్రారంభమయ్యే ఈ రేడియల్ రోడ్డులో పూర్తిస్థాయిలో కాకుండా కేవలం ఆనంద నగర్ కూడలిలోనే సిమెంట్ డివైడర్ను ఏర్పాటు చేశారు. గతంలో కూడా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఆనంద్ నగర్ కూడలిలో డివైడర్‌గా సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో చీకటి వేళలో వాటిని గమనించగా ఎంతోమంది వాహనదారులు ప్రమాదాల గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పలుమార్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులకు



మొర పెట్టుకోగా రేడియం స్టిక్కలర్ల ను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఆనంద్ నగర్ కూడలిలో సమస్యను పరిష్కరించి..ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయండి



ఇటీవల నాగోల్ డివిజన్ బండ్లగూడ ఆనంద్ నగర్ చౌరస్తాల నుండి తాజా హెూటల్ వరకు నూతనంగా సీసీ రోడ్లు వేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఆనంద్ నగర్ చౌరస్తాలో సిమెంటు డివైడర్ ఏర్పాటు చేశారు. కానీ నెల రోజులు గడుస్తున్న నేటికీ డివైడర్‌కు ఎటువంటి రంగులు కానీ ప్రమాద సూచికలు కానీ ఏర్పాటు చేయలేదు. సీసీ రోడ్డు డివైడర్ ఒకే విధంగా ఉండడంతో రెండు రోజుల కిందట రాత్రి వేళ ఒక కారు ప్రమాదానికి గురైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డివైడర్‌కు రంగుల తో పాటు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి.

బొద్దుపల్లి కృష్ణ, నాగోల్

నెల రోజులు కావస్తున్నా రంగులు లేవు



ఆనందనగర్ చౌరస్తాలో డివైడర్ నిర్మాణం చేపట్టి నెల రోజులు కావస్తున్నా నేటికీ ఆ డివైడర్‌కు రంగులు కానీ ప్రమాద సూచికలు కానీ ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో వాహనదారులు దానిని గుర్తించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆనంద్ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డివైడర్‌కు తక్షణమే రంగులు వేసి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలి.

గోకమల్ల చైతన్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కోశాధికారి (సీఐటీయూ)

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీకి అభినందనల వెల్లువ



నవతెలంగాణ - ఎల్బీనగర్

సీపీఐ(ఎం) ఎన్టీఆర్ నగర్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వేస్లీకి సీపీఐ(ఎం) నాయకులు పుష్ప గుచ్చాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ జాన్ వేస్లీ యువజన సంఘం నుండి సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరకు ఎదిగే క్రమంలో అనేక ప్రజాపోరాటాలలో పాల్గొన్నారని వివరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, ప్రజల్లో వామపక్ష భావజాలన్నీ తీసుకొని వెళ్లారని గుర్తుచేశారు. భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రంలో పార్టీనీ, ప్రజా సంఘాలను అభివృద్ధి చేయడానికి, ప్రజాసమస్యలను పరిష్కరించడానికి కార్యకర్తలందరు ముందుంటారని అన్నారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి ముడావత్ గోపినాయక్, కట్ట శ్రీనివాస్, రామావత్ పాండు నాయక్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వేస్లీని ఎంబీ భవన్‌లో బుధవారం సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ నాయకుడు ఎం బాలు, కుర్మగూడ డివిజన్ శాఖ కార్యదర్శి నాగిల్ల యాదయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

అనాథ విద్యార్థికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-హయత్ నగర్

చిత్ర లే ఔట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఉంటూ, కష్టపడి చదివి నీట్‌లో తెలంగాణలో 3994 రాంక్ సాధించాడు. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన అనాథ విద్యార్థి దాసరి మహంకాళికి కాలేజీ ఫీజు కట్టడానికి ఇబ్బంది పడుతున్నాడు. కోర్సు చదివే అవకాశం కోల్పోతున్నాడని విద్యార్థి గృహం అధ్యక్షులు మార్గం రాజేష్, జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ జక్కిడి రఘువీర్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు. దీంతో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ స్పందించింది. ఆ అనాథ విద్యార్థి డాక్టర్ కోర్సు పూర్తి అయ్యే వరకూ కాలేజీ ఫీజు మొత్తం జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చెల్లిస్తుందని హామీ ఇచ్చింది. అందులో భాగంగా బుధవారం మొదటి విడతగా రూ.40 వేల రూపాయల చెక్కును మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి చేతుల మీదుగా విద్యార్థి దాసరి మహంకాళికి అందజేశారు. భవిష్యత్తులో పోస్టు గ్రాడ్యుయేషన్ డాక్టర్ కోర్సు చేయడానికి కూడా రఘువీర్ రెడ్డి హామి ఇచ్చారు. ఈ కార్యక్రంలో గృహం అధ్యక్షులు మార్గం రాజేష్, జగదీష్ గౌడ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉప కులాలకు అండగా ఉంటా

మంద కృష్ణ మాదిగ



నవతెలంగాణ-హయత్‌నగర్

ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాదిగల ఉపకులాలు సహకరిస్తే వారికి అండగా ఉంటానని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం ఎల్బీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడారు. అందరి వాటాన్ని దోచుకున్న మాలలు.. రిజర్వేషన్ నష్టపోయిన ఉప కులాలకు అందించాలని కోరారు. బాబాసాహెబ్ అంబేద్కర్ సాధించిన పెట్టిన రిజర్వేషన్ ఫలాలను రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి ఈనాటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కానీ రిజర్వేషన్ల కంటే మించి రిజర్వేషన్లు పొందింది మాలలు మాత్రమేనని గుర్తు చేశారు. లోకూర్ కమిటీ నివేదికైనా, జస్టిస్ రామచంద్ర కమిటీ నివేదికైనా, జస్టిస్ ఉషా కమిటీ నివేదికైనా, 59 మంది ఉండే ఉపకులాలతో ఉండే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల వర్గమే ఉన్న జనాభా కంటే మించి పొందిందని, అందువల్లనే ఎస్సీ వర్గీకరణ జరగాలని తమ నివేదికలు పొందుపరిచాయని వెల్లడించారు. నష్టపోయిన వర్గంలో మాదిగలతో పాటు 57 కులాలు ఉన్నాయని తానా జనాభా కంటే మించి లబ్ది పొందిన కులాలలో ఒక మాలలే ఉన్నారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలుకొని దేశంలో ఎప్పుడు ఏ కమిషన్ వేసిన అదే రుజువు చేస్తుందని అన్నారు. అందరం నష్టపోయింది మాలల వల్ల, అందరికంటే జనాభా కంటే మించి లబ్ది పొందింది మాలలేనన్నారు. వర్గీకరణ కోరుకుంటున్న ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలబడాల్సిన బాధ్యత, ముందు వర్గీకరణ కోరుకోవలసిన బాధ్యత మాలయేతర దళిత కులాలకు ఉన్నదని, ఎవరికి ఎంత అన్యాయం జరిగిందనే నివేదికలు ఉన్నాయని అన్నారు. నష్టపోయిన వర్గంలో మాదిగలతో పాటు 57 కులాలు ఉన్నాయని, తమ జనాభా కంటే మించి లబ్ది పొందిన కులాలలో ఒక్క మాలలే ఉన్నారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దేశంలో ఎప్పుడు ఏ కమిషన్ వేసిన అదే రుజువు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఉపకులాల రాష్ట్ర సంఘాల అధ్యక్షులు తూర్పాటి హనుమంతు, చింతల రాజలింగం, డాక్టర్ రాజమౌళి, కొడగంటి నరసింహ, బాణాల మంగిష్, తూర్పాటి కృష్ణ, సిరి మన్యం, ఇప్ప జనార్ధన్, ప్రొఫెసర్ ఈశ్వర్ గజవెల్లి, తూర్పాటి యాదయ్య, బత్తిన సుధాకర్, జోగు రాములు, అడల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు'



నవతెలంగాణ- బడంగ్ పేట్

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే ప్రతి పక్ష పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని జల్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ షేక్ జాంగీర్ అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు నవీన్ గౌడ్, సయ్యద్ నవాజ్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలకు విసిగిపోయిన ప్రజలు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ పార్టీలకు అతీతంగా ప్రజా పాలన, గ్రామ సభలు నిర్వహించి.. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇంకా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారని జోస్యం చెప్పారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నవతెలంగాణ-కొత్తపేట

కొత్తపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ తన అనుచరులతో కలిసి బుధవారం పరిశీలించారు. తర్వాత విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య 600 పైగా ఉన్నదని ప్రధానోపాధ్యాయులు వెల్లడించారు. ప్రతిరోజు 300పైన విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఎలాంటి భేదాప్రాయాలు లేకుండా పనిచేయాలి

సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య



నవతెలంగాణ -నాగోల్

ఎలాంటి భేదాభిప్రాయాలకు తావివ్వకుండా, సమైక్యంగా ఐక్యమత్యంతో మెలుగుతూ కార్మిక వర్గానికి కలిసి పని చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య అన్నారు. బుధవారం సరూర్ నగర్ సర్కిల్ ప్రాంతంలో ఆర్కేపురం లేబర్ అడ్డా యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని ఏ.ధర్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు పని బంద్ చేయాలని సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ జనరల్ బడి సమావేశంలో ప్రతి ఒక్కరూ లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని తీర్మానం చేసుకోవడం జరిగిందన్నారు. ఆర్కేపురం లేబర్ అడ్డా వద్ద కార్మికుల కోసం వచ్చే వేసవి కాలంలో రేకుల షెడ్లఏర్పాటు, ఐదు రూపాయల భోజనం, త్రాగునీరు, మరుగు దొడ్లు అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొని రావాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక యూనియన్ ఆర్కేపురం లేబర్ అడ్డా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆర్కేపురం లేబర్ అడ్డా గౌరవ అధ్యక్షులు వి వెంకటయ్య, అధ్యక్షులు బట్టు పరశురాములు, ప్రధాన కార్యదర్శి ఇరుగు యేసు, ఉపాధ్యక్షులు వి.ఎల్లయ్య, ఏ. ధర్మయ్య, బి. నరసింహ, కే. యాదయ్య, సహకార్యదర్శులు నిర్మాల సైదులు, పి. ఉపేందర్, నిర్మాల కాశయ్య, ఆర్ శివ, కోశాధికారి ఎం. యాదగిరి, ఆర్గనైజర్ కార్యదర్శి సిహెచ్ యాదగిరి, కమిటీ సభ్యులు బాలస్వామి, ఈ యాదగిరి, ఎం స్వామి, దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కుంట్లూర్ విద్యార్థినులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలోని కుంట్లూర్ కు చెందిన విద్యార్థినులు లాంగ్జి పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కుంట్లూర్‌కు చెందిన వేముల శ్రీరాములు, శ్రీలత దంపతుల కుమార్తెలు యశశ్విని, యజ్ఞ స్థానిక వ్యాస్ మోడల్ స్కూల్ లో చదువుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యశశ్విని, యజ్ఞ లాంగ్జి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల కాటేదాన్ రవీ బ్రిలియంట్ స్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు రామందర్ ఎంపిక కాగా వీరందరూ ఈ నెల 31 తేది నుండి వచ్చే 2 తేది వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు స్కూల్ చైర్మెన్ సర్వేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ విశాఖ, కోచ్‌లు నీలేష్, శేఖర్ తెలిపారు. అనంతరం ఆ విద్యార్థినులను అభినందించారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించి.. ఆదర్శ డివిజన్‌గా తీర్చి దిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రాజిరెడ్డి కాలనీలో జీహెచ్ఎంసీ నిధులతో పూర్తి చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, అంజి, శివ, నిరంజన్ రెడ్డి, క్రాంతికుమార్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-హయత్‌నగర్

ఫోటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేపూరి శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వినోద్ కన్నా, కోశాధికారిగా చంద్రశేఖర్‌లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకులు సత్తార్ పాష, పాక అశోక్ యాదవ్, మన్నె భీమిరెడ్డి, కందకట్ల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గూడూరు వెంకట్ రెడ్డి, ఏళ్ల వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగస్వామి వెంకటేష్, సైదులు, ఎస్ లింగస్వామి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





హెల్దీ బ్రేక్‌ఫాస్ట్

ఉదయాన్నే హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ చేయాలనుకునేవారు ముందుగా ప్రిఫర్ చేసేది ఇడ్లీ. ఆవిరి మీద ఉడికించే ఈ ఇడ్లీలు అంటే అందరికీ ఇష్టమే.. ఉదయాన్నే వేడివేడిగా ఫ్లఫీగా ఉండే ఇడ్లీలను చట్నీ, సాంబార్‌తో తినడానికి చాలా మంది ప్రిఫర్ చేస్తారు. ఇందులో నూనె పాత్ర జీరో అనే చెప్పాలి. కాబట్టి, డైట్‌లో ఉన్నవారు కూడా వీటిని చక్కగా తినొచ్చు. ఓ రకంగా చెప్పాలంటే బ్రేక్‌ఫాస్ట్‌లో హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ అని చెప్పొచ్చు. దీనిని సాధారణంగా, ఇడ్లీ రవ్వ, మినపప్పుతో కలిపి చేస్తారు. అయితే, ఈ హెల్దీ బ్రేక్‌ఫాస్ట్‌ని మరింత హెల్దీగా మార్చాలంటే కొన్ని వేరే ఫుడ్స్‌తో కూడా కలిపి చేయొచ్చు. వీటి కాంబినేషన్ మన ఆరోగ్యాన్ని పెంచడంలో కీ రోల్ పోషిస్తాయి. వాటిలో కొన్ని రకాలు నేటి మానవిలో...

బీట్‌రూట్‌తో..

కావలసిన పదార్థాలు: బియ్యం - రెండు కప్పులు, మినపప్పు - ఒక కప్పు బీట్రూట్ - ఒకటి, నెయ్యి - ఒక స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా

తయారీ విధానం: ఈ బీట్‌రూట్ ఇడ్లీ



తయారు చేయడానికి ముందుగా బియ్యం, మినపప్పును విడివిడిగా కడిగి ఆరు గంటల పాటు నానబెట్టుకోవాలి. అలాగే ఒక బీట్‌రూట్ తీసుకొని శుభ్రం చేసుకోవాలి. దానిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని, మిక్సీలో వేసుకొని మెత్తగా రుబ్బుకోవాలి.

ఇప్పుడు నానబెట్టిన బియ్యం, మినపప్పును మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. రెండింటిని కలిపి ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. బీట్రూట్ పేస్ట్‌ను కూడా ఇందులో కలిపి మిశ్రమాన్ని రాత్రిపూట పులియబెట్టాలి.

ఆ తరువాత ఇడ్లీ ప్లేట్‌లలో ఈ బీట్‌రూట్ పేస్ట్ కలిపిన పిండిని పోసుకొని ఉడికించాలి. వాటిని తీసి ఓ ప్లేట్‌లో పెట్టుకుంటే బీట్‌రూట్ ఇడ్లీలు సిద్ధమైనట్లే. వీటిని వేడి వేడిగా కొబ్బరి చట్నీతో లేదా సాంబార్‌తో తినొచ్చు.

దహీ ఇడ్లీ

కావలసిన పదార్థాలు:

దహీ ఇడ్లీ తయారు చేసుకోవడానికి వీలైనంత వరకు మెత్తగా ఉండే 5 ఇడ్లీలను తీసుకోవాలి. పెరుగు - ఒక కప్పు, ఉప్పు, చక్కెర - ఒక స్పూను, నూనె - తాలింపుకు సరిపడా. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి తరుగు, ఇంగువా, దానిమ్మ గింజలు కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా పెరుగును తీసుకొని కాస్త పలుచగా అయ్యేందుకు నీటిని కలుపుకోవాలి. అనంతరం అందులో ఉప్పు, చక్కెర వేసుకొని కలుపుకోవాలి. ఫ్రిజ్‌లో పెడితే బాగుంటుంది. ఇడ్లీలు తయారు కాగానే పోపు కోసం సిద్ధం చేసుకోవాలి. ఇందుకోసం ఒక బౌల్ తీసుకొని అందులో టేబుల్ స్పూన్ నూనె వేసి వేడి చేసుకోవాలి. అనంతరం అన్ని దినుసులను వేసి వేయించాలి. ఆ తర్వాత



ఒక ప్లేట్ తీసుకొని వాటిలో ఇడ్లీలను తీసుకోవాలి. వాటిపై పెరుగును పొరలాగా పోసుకోవాలి. అప్పటికే తయారు చేసుకున్న తాలింపును ఇడ్లీలపై వేసుకోవాలి. అలాగే కాస్త పచ్చి మిర్చి తరుగు, దానిమ్మ గింజలను వేసుకోవాలి. అంతేనండి ఎంతో రుచికరంగా ఉండే దహీ ఇడ్లీ రడీ అయినట్లే. ఒకవేళ మీ పిల్లలు ఇడ్లీ తినడానికి ఇష్టపడకపోయినా, ఇడ్లీలు మిగలినా ఇలా చేసేయండి.

పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు.

పెసరపప్పు ఇడ్లీ

కావలసిన పదార్థాలు:

పెసరపప్పు - ఒక కప్పు, పచ్చిమిర్చి - 4-5 (రుచికి తగ్గట్టు), ఇంగువ - చిటికెడు, కొబ్బరి తురుము - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా. వంటసోడా - 1/4 టీస్పూన్, పెరుగు -



1/2 కప్పు, నూనె - ఇడ్లీ ప్లేట్లకు నూనె రాసేందుకు.

తయారీ విధానం:

పెసరపప్పును కనీసం 4-5 గంటలు నీటిలో నానబెట్టుకోవాలి. నానబెట్టిన పప్పును, పచ్చిమిర్చి, ఇంగువ, కొబ్బరి తురుము, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బిన మిశ్రమాన్ని ఒక పాత్రలో తీసుకొని, పెరుగు వేసి బాగా కలపాలి. చివరగా వంటసోడా వేసి మళ్ళీ కలపాలి. ఇడ్లీ ప్లేట్‌లకు కొద్దిగా నూనె రాసి, పిండిని నింపి ఇడ్లీ స్టీమర్‌లో వేయాలి. మీడియం ఫ్లేమ్‌పై ఉడికించాలి. అంతే పెసరపప్పు ఇడ్లీ రడీ.

కొర్రలతో

కావలసిన పదార్థాలు : కొర్రలు - మూడు కప్పులు, మినపగుళ్లు - కప్పు, మెంతులు - రెండు టీస్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : కొర్రలు, మినపగుళ్లు, మెంతులను శుభ్రంగా కడిగి కొర్రలను విడిగా, మినపగుళ్లు, మెంతులను కలిపి ఐదుగంటలు నానబెట్టాలి. కొర్రలు, మినపగుళ్లు చక్కగా నానాక కొద్దిగా నీళ్లు పోసుకుని విడివిడిగా మెత్తగా



రుబ్బుకోవాలి. ఈ రెండిటినీ కలిపి కొద్దిగా ఉప్పు వేసి పులియనియ్యాలి. పులిసిన పిండిని ఇడ్లీ పాత్రలో వేసుకుని ఆవిరి మీద ఉడికించాలి. వేడివేడి కొర్రల ఇడ్లీలు సాంబార్, చట్నీతో చాలా బావుంటాయి.

పెసరపప్పు, పాలకూరతో

కావలసిన పదార్థాలు : పెసరపప్పు - అరకప్పు, ముప్పావు కప్పు - పాలకూర, పచ్చిమిర్చి-మూడు, పెరుగు - ఒక కప్పు, ఉప్పు - రుచికి సరిపడా. వంట సోడా - పావు స్పూను, నూనె - కొద్దిగా.

తయారీ విధానం : ముందుగా, అరకప్పు పెసరపప్పుని 3 గంటల పాటు నీటిలో నానబెట్టండి. దీనిని నీరు వేయకుండానే గ్రైండ్ చేయండి. ఇందులో ముప్పావు కప్పు శుభ్రం చేసి తరిగిన పాలకూర వేసి బ్లెండ్ చేయండి. ఇందులోనే 3 పచ్చిమిర్చి వేసి మిక్సీ పట్టండి. దీనిని ఓ బౌల్ వేయండి. కన్సిస్టెన్సీ వచ్చే వరకూ పెరుగు వేసి కలపండి. రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి మిక్స్ చేయండి. దీనిని ఇడ్లీ ప్లేట్స్‌లో వేసే ముందు ఫ్రూట్ సాల్ట్ అర టీస్పూన్ లేదా తినే సోడా వేసి కలిపి ఇడ్లీలు వేయండి. ఇడ్లీలు వేసే ముందు ప్లేట్స్‌కి కొద్దిగా నూనె రాయండి. దీంతో ఈజీగా ఇడ్లీలు వస్తాయి.

ఇలా పెసరపప్పు, పాలకూరతో చేసిన ఇడ్లీల్లో విటమిన్ సి, విటమిన్ ఈ, విటమిన్ కె, ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియంలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తినడం వల్ల త్వరగా జీర్ణమవుతాయి. ఇవి షుగర్ ఉన్నవారికి కూడా చాలా మంచి బ్రేక్‌ఫాస్ట్. ఆకుకూరలు తినడం ఇష్టం లేని వారికి, మారాం చేసే పిల్లలకి ఇలా ఇడ్లీలు తయారుచేసి పెడితే వాటిలోని పోషకాలు అందుతాయి. పిల్లలు కూడా ఇష్టంగా



తింటారు.

ఇలా కేవలం పాలకూరతోనే కాదు. మీకు ఇష్టమైన ఆకుకూరతో కూడా ఇడ్లీలను తయారుచేసుకోవచ్చు. తోటకూర ఇలా ఏ ఆకుకూరైనా వేయొచ్చు. అయితే, వీటిని చేయడమే కాదు.. కాంబినేషన్ కూడా చాలా ముఖ్యం. కొద్దిగా టేస్టీగా ఉండే టమాట చట్నీ కొబ్బరిచట్నీతో తింటే చాలా టేస్టీగా ఉంటాయి.

బల్లులను ఇలా తరిమికొడదాం...

వంటగది ఇంటికి అత్యంత ముఖ్యమైన ప్రదేశం.. ఇది మన ఇంటికి గుండె వంటిది.. కాబట్టి వంటగదిని శుభ్రంగా, అందంగా ఉంచుకోవడం అందరి కర్తవ్యం. ముఖ్యంగా పురుగులు, కీటకాలు వంటింట్లోకి రాకుండా చూసుకోవాలి.. బల్లులు, బొద్దింకలు, చీమలు మొదలైన ప్రమాదకరమైన కీటకాలన్నింటినీ దూరంగా ఉంచడం సవాలుతో కూడుకున్న పని. వాటిని తరిమేయడానికి ఉపయోగించే కొన్ని చిట్కాలను తెలుసుకుందాం...

గుడ్డు పెంకులు



బల్లులను నివారించడానికి, వంటగదిలో ఒక మూలలో 2-3 గుడ్డు పెంకులను ఉంచండి. వాటి వాసనకు బల్లులు పారిపోతాయి. వారానికి రెండు మూడు సార్లు గుడ్డు పెంకులను మారిస్తే సరిపోతుంది.

దోసకాయ

బల్లులకు దోసకాయ వాసనను తట్టుకోలేవట. ఒక దోసకాయను కట్‌చేసి దాని ముక్కలను వంటగదిలోని ప్రతి మూలలో ఉంచాలి. దోసకాయ యొక్క సువాసన మీ వంటగదికి మంచి వాసన కలిగిస్తుంది... అలాగే బల్లులను దూరం చేస్తుంది.

కాఫీ

బల్లులను దూరంగా ఉంచడానికి కాఫీ కూడా సహాయపడుతుంది. దీని కోసం మీరు కాఫీ పొడిని పొగాకుతో కలిపి వంటగదిలోని ప్రతి మూలలో ఉంచాలి. పొగాకు మరియు కాఫీ వాసన ఉన్న ప్రదేశాల నుండి బల్లులు పారిపోతాయి.

నిమ్మకాయ

సిట్రస్ పండ్ల వాసన బల్లులకు అస్సలు ఇష్టం ఉండదు. కాబట్టి బల్లులను తరిమికొట్టాలంటే స్ప్రే బాటిల్‌లో నిమ్మరసం కలిపి వంటగది అంతా స్ప్రే చేస్తే సరిపోతుంది. ఈ స్ప్రే యొక్క సువాసన మీ వంటగదికి చక్కని సహజమైన సువాసనను కూడా ఇస్తుంది.

లవంగాలు, వెల్లుల్లి

వెల్లుల్లి, లవంగాల బలమైన వాసన బల్లులను వంటగది నుండి దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. దీని కోసం మీరు ఈ హ్యాక్‌ని అనుసరించాలి. కొన్ని వెల్లుల్లి రెబ్బలను దంచి, వాటిలో లవంగాల పొడిని వేయాలి. ఈ పేస్ట్‌ను బల్లులు ఉన్న ప్రదేశాలలో మరియు వంటగదిలోని ప్రతి మూలలో ఉంచాలి. అంతే బల్లులు వెంటనే అక్కడ నుండి కనుమరుగవుతాయి.

గోవింద్ పన్సారే హత్యకేసులో
నిందితులకు బెయిల్

ముంబయి : ప్రముఖ హేతువాది, రచయిత గోవింద్ పన్సారే హత్యకేసులో ఆరుగురు నిందితులకూ బాంబే హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. సుదీర్ఘకాలంగా జైలులో ఉన్నందున ఆరుగురు నిందితులకు బెయిల్ అనుమతిస్తున్నానని సింగిల్ బెంచ్ జస్టిస్ కిలోర్ పేర్కొన్నారు. మరో నిందితుడు వీరేంద్ర సింగ్ తవాడే దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విడిగా విచారిస్తానని కూడా చెప్పారు. 2018-2019 మధ్య వేర్వేరు తేదీలలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో 2015 ఫిబ్రవరి 20న మార్నింగ్ వాక్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్న పన్సారేను మోటార్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. తొలుత ఈ కేసును కొల్హాపూర్‌లోని రాజారాంపురి పోలీస్ స్టేషన్ దర్యాప్తు చేపట్టింది. అనంతరం మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సీఐడీ) పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కి బదిలీఅయ్యింది. నిందితులను గుర్తించడంలో పురోగతి లేకపోవడంతో పన్సారే కుటుంబ సభ్యులు ఈ కేసును ఉగ్రవాద నిరోధక బృందం (ఏటీఎస్)కి బదిలీ చేయాలని కోరింది. 2022 ఆగస్ట్ 3న బాంబే హెచ్‌సి ఈ కేసును ఏటీఎస్‌కి బదిలీ చేసింది. 12 మందిలో 10 మందిని అరెస్ట్ చేసి నాలుగు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేశారు. ఈ పది మంది నిందితులపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ఇద్దరు షూటరు ఇప్పటికీ పరారీలో ఉన్నారు. మొదటి నుంచి ఈ కేసును పర్యవేక్షిస్తున్న హెచ్‌సీ, ఈ నెల ప్రారంభంలో పర్యవేక్షణను కొనసాగించమని తెలిపింది. అయితే ఈకేసు విచారణను వేగవంతం చేయాలని, రోజువారీ దర్యాప్తుచేపట్టాలని ఆదేశించింది.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. ఫిబ్రవరి 27న ఎన్నిక జరగగా, మార్చి 3న ఫలితాలు వెల్లడవుతాయి. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు,ఆంధ్రప్రదేశ్‌లోనూ మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ కుర రఘునాథం రెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అలాగే ఉత్తరాంధ్ర (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

షెడ్యూల్

1. నోటిఫికేషన్	ఫిబ్రవరి 3 (సోమవారం)
2. నామినేషన్ దాఖలకు గడువు	ఫిబ్రవరి 10 (సోమవారం)
3. నామినేషన్ల పరిశీలన	ఫిబ్రవరి 11 (మంగళవారం)
4. నామినేషన్ల ఉపసంహారణకు గడువు	ఫిబ్రవరి 13 (గురువారం)
5. పోలింగ్	ఫిబ్రవరి 27 (గురువారం)
(ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు)	
6. ఓట్ల లెక్కింపు	మార్చి 3 (సోమవారం)

పసుపు బోర్డు ఏం చేస్తుందో ?

(మొదటిపేజీ తరువాయి)

బట్టి ధర చెల్లిస్తున్నారు. గతేడాది క్వింటాలుకు రూ. 8వేల నుంచి 12వేల వరకు పలికింది. ఈ లెక్కన ఎకరా పంటకు ఖర్చులు పోనూ ఏమీ మిగలడం లేదు. పసుపు ధర రూ.15వేల పైన ఉంటే ఖర్చులు పోనూ కొంత మిగులుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం పసుపు పంటకు మద్దతు ధర ప్రకటిస్తే.. సాగు విస్తీర్ణం మరింత పెరిగి గిట్టుబాటు అయ్యే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

సమగ్ర కులగణనపై ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలో సర్వే పూర్తయిం ది. ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమ రేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేట ర్లు దాదాపు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నారు. రాష్ట్రంలో ని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించి ంది. ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రికార్డు వేగంతో కులగణన

అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కులగణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. సెప్టెంబర్ 12వ తేదీన ఇంటింటి సర్వే కుల గణన చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది. అక్టోబర్ 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. అక్టోబర్ 10వ తేదీన ప్రణాళిక విభాగం సర్వేకు సంబంధించిన పూర్తి విధి విధానాలతో జీవో నెం.18 జారీ చేసింది.

ఫార్మా, స్టీల్ రంగాలకు గడ్డుకాలం

(మొదటిపేజీ తరువాయి)

దేశాలుగా అభివర్ణించారు. త్వరలో ఫార్మాస్యూటికల్స్, అల్యూమినియం, స్టీల్‌తో సహా ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు విధించనున్నట్లు ఫ్లోరిడాలోని రిపబ్లికన్ హౌస్ సభ్యులను ఉద్దేశించి ట్రంప్ అన్నారు. "సమీప భవిష్యత్తులో మేము కంప్యూటర్ చిప్స్, సెమీకండక్టర్స్, ఫార్మాస్యూటికల్స్ తదితర విదేశీ ఉత్పత్తులపై సుంకాలను పెంచబోతున్నాం. ఈ ముఖ్యమైన వస్తువుల ఉత్పత్తిని అమెరికాకు తిరిగి ఇవ్వబోతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. "చైనా, భారత్, బ్రెజిల్ దేశాలు మా ఉత్పత్తులపై అధిక సంకాలను విధిస్తున్నాయి. ఇకపై అలా జరగనివ్వము. మేము అమెరికాను మొదటి స్థానంలో ఉంచబోతున్నాము.' అని అధికారం చేపట్టిన తర్వాత ట్రంప్ పలు దేశాలను హెచ్చరించారు. భారత్‌కు వ్యతిరేకంగా సుంకాల చర్య గురించి ప్రస్తావించడంతో.. ఇక్కడి ఫార్మా, స్టీల్ రంగాలు తీవ్ర ఆందోళనలో పడ్డాయి. కాగా ఈ విషయమై.. సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ రంగాలతో సహా ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్, మోడీ చర్చించారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికా నుండి రక్షణ పరికరాల సేకరణను భారత్ వేగవంతం చేస్తుందని వైట్‌హౌస్ పేర్కొంది.

అమెరికా దిగుమతి చేసుకుంటున్న మొత్తం ఫార్మా ఉత్పత్తుల్లో భారత్ వాటా ఏకంగా 38.8 శాతంగా ఉంది. భారత కంపెనీలకు యూఎస్ అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. గడిచిన ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో 5.8 బిలియన్ డాలర్ల డ్రగ్స్‌ను సరఫరా చేసింది. 2023-24లో ఈ విలువ 8 బిలియన్ డాలర్లుగా ఉంది. గడిచిన ఏప్రిల్ - నవంబర్‌లో అమెరికాకు 2.3 బిలియన్ డాలర్ల స్టీల్ ఎగుమతులు జరిగాయి. అల్యూమినియం ఉత్పత్తుల ఎగుమతి 516 మిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ట్రంప్ 2018లో తొలిసారి ఎన్నికైన సమయంలోనూ భారత స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచారు. 2023లో బైడెన్ వచ్చిన తర్వాత ఈ ఆందోళనను కొంత పరిష్కరించారు. ఆర్థిక సంవత్సరం 2023-24లో అమెరికా- భారత ద్వైపాక్షిక సరుకుల వాణిజ్యం 120 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత్ మిగులు వాణిజ్యం కలిగి ఉంది. ప్రస్తుతం ట్రంప్ టారిఫ్‌లపై భారత వాణిజ్య రంగంలో తీవ్ర ఆందోళనలు నెలకొనగా.. పరిస్థితులు ఎటు దారి తీస్తాయో..? వేచి చూడాలని నిపుణులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరిలో తెలంగాణ
కొత్త టూరిజం పాలసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ టూరిజం కొత్త పాలసీని ఫిబ్రవరి 10లోగా తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక శాఖపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల్లోని ఉత్తమ పాలసీలను అధ్యయనం చేసి పర్యాటకులను ఆకర్షించేలా విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. ఎకో, టెంపుల్ టూరిజంపై ఎక్కువగా దృష్టి పెట్టాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మ జాతర జరిగే సమయంలో భక్తులు, పర్యాటకులను ఆకర్షించేందుకు రెవెన్యూ, ఫారెస్ట్, టూరిజం విభాగాలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధ చేయాలని సూచించారు. జాతరతో పాటు సమీప పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను కలుపుతూ సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని అన్నారు. ఆదిలాబాద్, వరంగల్, నాగార్జున సాగర్ లాంటి ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయనీ, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కొత్త పర్యాటక ప్రాంతాల గుర్తింపు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య, ఎన్టీఆర్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి స్మితాసబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అది రాజ్యాంగ విరుద్ధం

న్యూఢిల్లీ : నివాస-ఆధారిత మెడికల్ కోటాను రద్దు చేస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పునిచ్చింది. వైద్యవిద్యలో రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువర్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉన్నది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. మనమందరం భారత భూభాగంలో నివసిస్తున్నాం. ఇందులో ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉన్నది. అలాగే చదువుకునే హక్కు కూడా. నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చు. అయితే అది అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) కోర్సుల వరకే. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. అది ఆర్టికల్ 14ను ఉల్లంఘించటమే అవుతుంది" అని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస-ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని వివరించింది. పీజీ మెడికల్ కోర్సులకు నివాస-ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని గతంలో పంజాబ్-హర్యానా కోర్టు తీర్పు ఇచ్చిన విషయం విదితమే. దీనిని పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ విషయంలో ఇద్దరు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం.. పంజాబ్-హర్యానా హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే, కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. దీంతో వైద్య విద్యలో నివాస-ఆధారిత కోటాపై విచారణ జరిపి.. కీలక తీర్పును వెలువర్చింది.

నింగిలోకి జీఎస్ఎల్‌వీ-ఎఫ్15

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడనుంది. వ్యవసాయంలో సాంకేతికత, విమానాల నిర్వహణ, మొబైల్ పరికరాల్లో లోకేషన్ ఆధారిత సేవలందించనుంది.

మైలురాయిగా వందో ప్రయోగం : ఇస్రో చైర్మెన్ నారాయణన్

ఇస్రో శాస్త్రవేత్తలకు చైర్మెన్ నారాయణన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతమైందని చెప్పారు. నావిగేషన్ శాటిలైట్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టినట్టు వివరించారు. ఈ వందో ప్రయోగం మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. "ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం పదేండ్ల పాటు సేవలందిస్తుంది. విక్రమ్ సారాబాయ్ హయాం నుంచి ఇస్రో విజయ పరంపర కొనసాగింది. ఇప్పటి వరకు 6 జనరేషన్ల లాంచ్ వెహికిల్స్ అభివృద్ధి చేశాం. 1979లో అబ్దుల్ కలాం నేతృత్వంలో తొలి లాంచ్ వెహికిల్ ప్రయోగం జరిగింది. ఇప్పటివరకు శ్రీహరికోట వేదికగా 100 ప్రయోగాలు జరిగాయి. 100 ప్రయోగాల్లో 548 శాటిలైట్లను కక్ష్యలోకి పంపాం. 3 చంద్రయాన్, మాస్ ఆర్బిటర్, ఆదిత్య, ఎస్ఆర్ఈ మిషన్లు చేపట్టాం." అని నారాయణన్ తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్యకు టీసీపీఎస్ఈఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు టీసీపీఎస్ఈఏ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కొమరయ్యను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ భాస్కర్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి మద్దతు లేఖను అందించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామంటూ హామీ ఇచ్చి ఏడాది గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని కొమరయ్య అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేసుకునే అవకాశం రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిందన్నారు. ఉద్యోగుల జీవితాలు భద్రత లేని సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, లేకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్..
ఇద్దరు మావోయిస్టులు మృతి

రాంచీ : జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సోనువా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఓ మహిళ సహా ఇద్దరు మావోయిస్టులు మరణించారు. ఘటనా స్థలం నుంచి రెండు ఐఎన్ఎస్ఎఎస్ రైఫిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు కొల్హాన్ రేంజ్ డీఐజీ మనోజ్ రతన్ ఛోటే తెలిపారు. ఈప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు.



జాన్‌వెస్లీ (రాష్ట్ర కార్యదర్శి)

జి.నాగయ్య, ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చుక్క రాములు, టి.జ్యోతి, పాలడుగు భాస్కర్

సీపీఐ(ఎం) నూతన రాష్ట్ర కార్యదర్శివర్గం

టి.సాగర్, ఎమ్‌డీ. అబ్బాస్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్

ప్రజాసమస్యలపై పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. విద్యవైద్యం వ్యాపారంగా మారిందనీ, సామాన్యులకు అందని ద్రాక్షగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. దావోస్ పర్యటనలో పెట్టుబడులు వచ్చాయంటూ రేవంత్‌రెడ్డి ఊదరగొడుతున్నారనీ, గతంలో కేటీఆర్ కూడా అదే చేశారని అన్నారు. ఫోర్త్ సిటీ రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. ఆ పెట్టుబడులతో స్థాపించే పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో అత్యధికమంది కార్మికులు, అసంఘటిత కార్మికు లున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 కూలి, ఏడాదికి 150 పని దినాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పట్టణ ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో సంపద సృష్టించే కార్మికులు, రైతులు, కూలీలు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, భూస్వాములకు ఉపయోగపడే విధానాలనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్నదని విమర్శించారు. శ్రామికవర్గ ప్రయోజనాల కోసం పోరాడేది కమ్యూనిస్టులు, సీపీఐ(ఎం) అని అన్నారు. ఈ వర్గాల పట్ల ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బట్టి తమ వైఖరి ఆధారపడి ఉంటుందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తే, ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ఏ ప్రభుత్వాన్నైనా ప్రతిఘటి స్తామని చెప్పారు.

బీజేపీ మతోన్మాదంపై ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తామని జాన్‌వెస్లీ అన్నారు. సామాజిక న్యాయానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ విధానాలను నిలువరించడమే తమ లక్ష్యమన్నారు. ఆ పార్టీ రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో లౌకికశక్తులు, సామాజిక శక్తులు కలిసి రావాలని కోరారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలని అన్నారు. పార్టీ సొంత శక్తిని పెంచుకోవడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామనీ, ఆ దిశగా కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తామని వివరించారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం కోసం పోరాడతామని అన్నారు. పార్టీ పునాదిని పెంచుకోవడంపై దృష్టిసారిస్తామని చెప్పారు. వామపక్ష శక్తులను ఐక్యం చేస్తామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల విధానాలన్నీ ఒక్కటేనని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయాలను ముందుకుతెస్తామన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, ప్రజలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను చేపడతామని చెప్పారు.

బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలి

దారిమళ్లుతున్న సబ్‌ప్లాన్ నిధులు

ఇంటి స్థలం లేకుండా సొంతిళ్లు లేకుండా లక్షలాది మంది పేదలు రాష్ట్రంలో ఉన్నారని జాన్‌వెస్లీ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఆచరణలో ఇప్పుడు అర్హులందరికీ ఇవ్వలేదని చెప్పారు. హైదరాబాద్ చుట్టూ ప్రభుత్వ భూములున్నాయని వివరించారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు సామాజిక అణచివేతకు గురవుతున్నారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా దారి మళ్లుతున్నాయని విమర్శించారు. దళితుల సంక్షేమం, దళిత వాడల అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల మెస్ చార్జీలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచడం లేదని అన్నారు. బీసీ కులగణన చేపట్టాలనీ, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల జనాభా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని కోరారు. సామాజిక వర్గాలకు, శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. శ్రామికుల ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు.

కమ్యూనిస్టు పార్టీలో కులాన్ని బట్టి పదవులుండవు


రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ చేయని పోరాటాలను సీపీఐ(ఎం) నిర్వహించిందని జాన్‌వెస్లీ అన్నారు. విలేకరులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిందని వివరించారు. రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల్లోకి ప్రవేశం, దళితులకు కటింగ్ చేయాలంటూ ప్రతిఘటనా పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. రాఘవులు సైకిల్ యాత్ర, తమ్మినేని మహాజన పాదయాత్ర చేశారని వివరించారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ సాధన కోసం, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ సాధన కోసం అనేక ఉద్యమాలను నిర్మించిందని అన్నారు. ఈ పోరాటాల ఫలితంగా దేశంలోనే మొదటి సారి సబ్‌ప్లాన్ చట్టం ఉమ్మడి ఏపీలో అమల్లోకి వచ్చిందన్నారు. దానివల్లే సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు వచ్చాయని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీలో ముఖ్యంగా సీపీఐ(ఎం)లో కులాన్ని బట్టి పదవులుండబోవని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు, పార్టీ నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలోనే ఈ బాధ్యతలను పార్టీ అప్పగించిందని చెప్పారు. దళితుడు కాబట్టి ఈ బాధ్యతలను పార్టీ ఇవ్వలేదన్నారు. పోరాటాన్ని నడిపేందుకు తాను కూడా ఈ బాధ్యతలను చేయగలుగుతాననే ఉద్దేశంతోనే ఇచ్చిందని వివరించారు. అయితే ఓ సామాజిక తరగతి నుంచి ఈ బాధ్యతల్లోకి రావడం ప్రత్యేక సందర్భమని అన్నారు. ఈ ఎన్నికతో మార్పు వస్తుందని అనుకోవడం లేదనీ, ప్రజా పోరాటాల ద్వారా మార్పు వస్తుందన్నారు. గద్దర్ గురించి స్పష్టమైన అవగాహన లేకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారని అన్నారు. గద్దర్‌కు ప్రజల్లో గుర్తింపు ఉంది, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పద్మశ్రీ అవసరం లేదన్నారు. మనువాద అహంకార ధోరణితో, మతోన్మాద వైఖరితో బండి సంజయ్ వ్యాఖ్యలున్నాయని విమర్శిం చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతామని చెప్పారు. షెడ్యూల్ ప్రకటిం చాక ఎత్తుగడలను, పార్టీ నిర్ణయాలను ప్రకటి స్తామని అన్నారు. ప్రజాపోరాటాల ద్వారానే ప్రజా పునాదిని పెంచుకుంటామ న్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాం గాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఇది తెలంగాణకు, ప్రజలకు తీవ్ర నష్టమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటున్నదని చెప్పారు. అధికారంలో ఎవరున్నా, ఏ పార్టీ ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేపడతామన్నారు. బీజేపీని సమర్థించే ఏ పార్టీ అయినా, సామాజిక సంఘ మైనా, నాయకుడైనా వ్యతిరేకిస్తామని అన్నారు. శ్రీలంకలో కమ్యూ నిస్టు పార్టీకి గత ఎన్నికల్లో మూడు శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చారని చెప్పారు. తాము ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగొచ్చని అన్నారు. కమ్యూనిస్టులు ఏకం కావాలని అన్నారు. అందుకోసం ఐక్య కార్యా చరణ, ఐక్య ఉద్యమాలను చేపట్టాలని కోరారు. ఎక్కడ అణచివేత, దోపిడీ, నిర్బంధం ఉంటుందో అక్కడ ప్రతిఘటన ఉంటుం దన్నారు. మావోయి స్టులను అంతమొందించినా వారి భావాలను అణచివే యలేరని అన్నారు. మరో రూపంలో పోరాటాలు ముందుకొస్తాయని చెప్పారు. అమిత్‌షా లాంటి వారు వంద మంది వచ్చినా తొక్కుకుంటూ విముక్తి పోరాటాలు జరుగుతాయని వివరించారు.



వర్గ పోరాటాలతోనే కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదల : తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

జరిగే సామాజిక పోరాటాలు.. ఈ మూడు విషయాల మేలు కలయికగా ఉంటాయని చెప్పారు. పలు ప్రశ్నలకు తమ్మినేని సమాధానమిచ్చారు. కమ్యూనిస్టు పార్టీలో కులాన్ని బట్టి ఎన్నికలుండబోవని స్పష్టం చేశారు. విప్లవ సామర్థ్యం ఉండాలన్నారు. విప్లవ పార్టీని ముందుకు తీసుకెళ్లాలంటే సైద్ధాంతిక సామర్థ్యం, రాజకీయ నైపుణ్యం, నిర్మాణ స్పష్టత ఉండాలని అన్నారు. ఇవి లేకుండా కార్యదర్శిగా ఎన్నిక కాబోరని చెప్పారు. జాన్‌వెస్లీ ఎస్సీ కావడంతోపాటు ఈ లక్షణాలన్నీ ఉన్నాయని వివరించారు. ఈ సామర్థ్యాలన్నీ చూసి జాన్‌వెస్లీ సరైన కార్యదర్శి అన్న నిర్ణయానికి వచ్చాకే ఎన్నుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, టి సాగర్, ఎండీ అబ్బాస్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా డిజి నరసింహారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా డిజి నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా వంగూరు రాములు, కె నరసమ్మ, మాటూరి బాలరాజుగౌడ్, ఎం వాసుదేవరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ వారిని ఎన్నుకుంది.

నవచిత్రం

రాజులమ్మ జాతరకి రంగం సిద్ధం



నాగ చైతన్య, సాయిపల్లవి

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు ఈ చిత్రాన్ని నిర్మించారు.

అల్లు అరవింద్ సమర్పణలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామాటాకీస్ రోడ్డులోని శ్రీరామ పిక్చర్ ప్యాలెస్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో మేకర్స్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా హీరో నాగచైతన్య మాట్లాడుతూ,' ఏడాదిన్నర నుంచి నా లైఫ్‌లో నిజమైన తండేల్ అల్లు అరవిందే. నేను జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటా. వైజాగ్ విషయానికి వస్తే .. ఏ సినిమా రిలీజ్ అయినా వైజాగ్ టాక్ ఏంటి అనేది కనుక్కుంటా. ఇక్కడ సినిమా ఆడిందంటే ప్రపంచంలో ఎక్కడైనా ఆడాల్సిందే. ఈసాలి యాట తప్పేదేలేదు. ఫిబ్రవరి 7న థియేటర్లలో రాజులమ్మ జాతరే' అని చెప్పారు.

'మేము ఎంత కష్టపడి తీసినా మీరు ఆదరించే స్థాయిలోనే మా ఆనందం ఉంటుంది. చందూ మొండేటి ఈ కథను అత్యద్భుతంగా మలిచి, చాలా బాగా తీశారు. సాయిపల్లవి అద్భుతంగా నటించారు. హీరో నాగచైతన్య ఏ సినిమాలోనూ ఇంతవరకు నటించని స్థాయిలో ఈ సినిమాలో నటించారు. కొన్ని సీన్స్ చూస్తే మన గుండె కరిగిపోయేలా నటించారు. ఈ సినిమాతో బెస్ట్ పెర్ఫార్మెన్స్ అనిపించుకుంటారు. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్‌ను చించిపడేశాడు. శ్రీకాకుళంలో ఒక చిన్న ఊళ్లో జరిగిన కథను సినిమాగా తీశాం. ఉత్తరాంధ్ర వాళ్లంతా ఈ సినిమా చూసి ఆనందిస్తారనే నమ్మకం ఉంది' అని అల్లు అరవింద్ చెప్పారు.

'సంహారం' మొదలైంది

గతంలో దాసరి, మోహన్ బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ తదితరుల వద్ద వందకు పైగా సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేసిన ధర్మ ఇప్పుడు మెగా ఫోన్ పట్టారు. రత్న మేఘన క్రియేషన్స్ పతాకంపై దర్శక, నిర్మాతగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'సంహారం'. ఆదిత్య, కవిత మహ హీరో, హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని



కవిత

ఈ నెల 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది.

దర్శక, నిర్మాత ధర్మ మాట్లాడుతూ, 'ఇదొక రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఒక అమ్మాయి తనకు, తన అక్కయ్యకి అనుకోని ఘటనలు ఎదురైనపుడు, తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌తో దుష్టులను ఎలా ఎదుర్కొంది అనే పాయింట్‌తో ఈ సినిమా తీశాను. తమను తాము కాపాడుకునేందుకు అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ చాలా అవసరం అని ఈ చిత్రంలో చూపించాం. సంగీత దర్శకుడు సాకేత్ సాయిరాం ఈ చిత్రంలో విలన్ పాత్ర పోషించడంతో పాటు మంచి సంగీతాన్ని అందించారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుం దనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

టీవీ కళాకారుల సంక్షేమమే మా లక్ష్యం

తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 31న జరగబోతున్నాయి.

ఈ సందర్భంగా ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో జీఎస్ హరి ప్యానెల్ సభ్యులు మేనిఫెస్టో విడుదల చేశారు.

తమ ప్యానెల్ గెలిస్తే.. తెలుగు టెలివిజన్ ఆర్టిస్టులకు పలు ప్రయోజనాలు అమలు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



భార్గవ్ గుత్తికొండ, జీఎస్ హరి

ఈ సందర్భంగా సీనియర్ నటుడు విజయ్ యాదవ్ మాట్లాడుతూ,'టెలివిజన్ కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా వినోద్ బాల ఆధ్వర్యంలో 27 ఏళ్ల క్రితం మా తెలుగు టెలిజవిన్ ఆర్టిస్టు అసోషియేషన్‌ను ప్రారంభించాం. వందలాది మంది ఆర్టిస్టుల సమస్యలు పరిష్కరించాం. మెడిక్లెయిమ్ చేయించాం. తెలుగు ఆర్టిస్టులకు మాత్రమే అవకాశాలు ఇవ్వాలనేదే మా ప్రయత్నం. సీరియల్ షూటింగ్ టైమింగ్ విషయాలపై మేము ఒకరికొకరు సపోర్ట్ చేసుకున్నాం. కరోనా సమయంలో చిరంజీవి ట్రస్ట్, అప్పటి మంత్రి శ్రీనివాస్ యాదవ్ సహకారంతో ఆర్టిస్టులందరికి సహాయం చేశాం. పేద కళాకారులకు పెన్షన్ ఇచ్చాం. సమర్థులైన జీఎస్ హరి ప్యానెల్ సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటే, టెలివిజన్ కళాకారుల సమస్యలు తీర్చుతూ, సంక్షేమంపై దృష్టిపెడతాం' అని అన్నారు.

'విజయ్ యాదవ్, వినోద్ బాల ఆధ్వర్యంలో నా మీద నమ్మకంతో నాకు అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. నాకు అన్నం పెట్టిన ఈ పరిశ్రమ సంక్షేమం కోసం నేను నిరంతరం ప్రయత్నిస్తాను' అని అధ్యక్ష అభ్యర్థి జీఎస్ హరి చెప్పారు.

ఆటలు

ధీనిధి జాతీయ రికార్డు బ్రేక్

ఫైనల్‌కు రమిత • 38వ జాతీయ క్రీడలు





దెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో తొలిరోజు ఒక జాతీయ రికార్డు బ్రేక్ కాగా.. కర్నాటకకు చెందిన ధీనిధి దేశింగు మూడు స్వర్ణ పతకాలతో సత్తా చాటింది. ఇక 10మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మహిళా షూటర్లు రమిత జిందాల్-తిలోత్తమ సేన్ జంట ఫైనల్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన 200మీ. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో ధీనిధి(కర్నాటక) ఒక 2నిమిషాల 03:24సెకన్లలో గమ్యానికి జాతీయ రికార్డును బ్రేక్ చేసింది. ఈ క్రమంలోనే స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే మహిళల 100మీ. బటర్‌ఫ్లైలో ధీనిధి ఒక నిమిషం 3:62 సెకన్లలో గమ్యానికి చేరి మరో బంగారు పతకాన్ని ఖాయం చేసింది. 200మీ. ఫ్రిస్టైల్‌లో భవ్య(ఢిల్లీ) 2నిమిషాల 8:68సెకన్లు, అదితి(మహారాష్ట్ర) 2నిమిషాల 09:74 రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. ఇక 100మీ. బటర్ ఫ్లై విభాగంలో నిషా శెట్టి(కర్నాటక) ఒక నిమిషం 4:81సెకన్లు, శ్రీసి ఉపాధ్యాయ(ఒడిషా) ఒక నిమిషం 5:20సెకన్ల రజత, కాంస్యాలను సాధించారు.

ఉషులో మణిపూర్ జట్లకు స్వర్ణం

ఇక ఉషులో మణిపూర్ స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకుంది. మహిళల విభాగంలో కె.లక్ష్మీదేవి, పురుషుల విభాగంలో బోనిష్ స్వర్ణ పతకాలను చేజిక్కించుకున్నారు.

పతకాల పట్టిక

రాష్ట్రం	స్వ	ర	కా	మొ
1. కర్నాటక	5	2	0	7
2. మణిపూర్	4	4	0	8
3. మహారాష్ట్ర	2	3	3	8
4. సర్వీసెస్	2	1	0	3
5. తమిళనాడు	1	1	2	4
6. ఢిల్లీ	0	2	1	3
7. మధ్యప్రదేశ్	0	1	1	2
8. కేరళ	0	0	2	2
9. ఒడిషా	0	0	1	1
10. ఉత్తరాఖండ్	0	0	1	1
11. బీహార్	0	0	1	1
12. గుజరాత్	0	0	1	1
13. ప.బెంగాల్	0	0	1	1

ఫైనల్లో మహబూబ్ నగర్, టీడీసీఏ ఎలెవన్

టీడీసీఏ అండర్-17 టీ20 టోర్నమెంట్



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహిస్తున్న అండర్-17 టీ20 టోర్నమెంట్‌లో మహబూబ్‌నగర్, టీడీసీఏ ఎలెవన్ సత్తా చాటాయి. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సెమీఫైనల్స్‌లో మహబూబ్ నగర్, టీడీసీఏ ఎలెవన్ విజయాలు సాధించి ఫైనల్లోకి ప్రవేశించాయి. తొలి సెమీఫైనల్లో తొలుత ఆదిలాబాద్ 20 ఓవర్లలో 116/10 పరుగులు చేయగా.. మహబూబ్‌నగర్ 15.1 ఓవర్లలోనే 117/2తో లక్ష్యాన్ని ఛేదించి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. రెండో సెమీఫైనల్లో రంగారెడ్డి 19.4 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌట్ కాగా.. టీడీసీఏ ఎలెవన్ 18.4 ఓవర్లలోనే 137/3 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నేడు జరిగే టైటిల్ పోరులో మహబూబ్ నగర్, టీడీసీఏ ఎలెవన్ తలపడతాయి.

అభినవ్ శతకం : టీడీసీఏ టోర్నమెంట్‌లో రంగారెడ్డి జిల్లా బ్యాటర్ అభినవ్ గౌడ్ తొలి శతకం నమోదు చేశాడు. నల్గొండతో క్వార్టర్‌ఫైనల్లో అభినవ్ 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 52 బంతుల్లోనే 112 పరుగులు సాధించాడు. మెరుపు శతకం సాధించిన అభినవ్‌ను టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (పెటా టిఎస్) అధ్యక్షులు రాఘవరెడ్డి అభినందించారు.

సలీమాకు పగ్గాలు

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌కు జట్టును ప్రకటించిన హాకీ ఇండియా



భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ లీగ్‌కు హాకీ ఇండియా(హెచ్) జట్టును ప్రకటించింది. 24మందితో కూడిన జట్టుకు సలీమా టేటే సారథ్యం వహించనుండగా.. వైస్ కెప్టెన్‌గా నవ్‌నీత్ కౌర్ ఎంపికైంది. ఫిబ్రవరి 15 నుంచి 25వరకు కళింగ హాకీ స్టేడియంలో ఎఫ్ఐహెచ్ హాకీ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫిబ్రవరి 15న ఇంగ్లండ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తన టైటిల్ వేటను కొనసాగించనుండగా... ఆ తర్వాత నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీలతో తలపడనుంది. ఒక్కో జట్టుతో రెండేసిసార్లు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. స్టాండ్‌బై ఆటగాళ్లుగా బన్వారీ సోలంకి, అక్షతా అబాసో ధాకలే, జ్యోతి సింంగ్, సాక్షి రాణా, అన్ను, సోనమ్ ఉన్నారు.

జట్టు...

గోల్‌కీపర్లు : సవిత, బిచ్చుదేవి ఖరిబమ్

డిఫెండర్లు: సుశీల, నిక్కి ప్రధాన్, ఉదిత, జ్యోతి ఇషికా, జ్యోతి

మిడ్‌ఫీల్డర్లు : వైష్ణవి, నేహా, మనీషా, సలీమా(కెప్టెన్), సునేలిటా, లాల్‌రెమిసిమి, బల్‌జీత్, షర్మిల

ఫార్వర్డ్స్ : నవ్‌నీత్ కౌర్(వైస్ కెప్టెన్), ముతాజ్, ప్రీతి, రుతుజ, బ్యూటీ, సంగీత, దీపిక, వందన.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

తగ్గిన ఇండియన్ బ్యాంక్ ఎన్‌పిఎలు

- క్యూ3లో రూ.2,852 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 34.58 శాతం వృద్ధితో రూ.2,852 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,119.35 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.5,814.19 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ3లో 10.32 శాతం పెరిగి రూ.6,414.72 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి 3.26 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది కాలానికి 4.47 శాతం జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్ధక ఆస్తులు 0.53 శాతం నుంచి 0.21 శాతానికి పరిమితమయ్యాయి. బుధవారం బిఎస్‌ఇలో ఇండియన్ బ్యాంక్ షేర్ 5.84 శాతం పెరిగి రూ.544.70 వద్ద ముగిసింది.

జనవరి 1 నుంచి ఆర్థిక సంవత్సరం..!



న్యూఢిల్లీ : ఆర్థిక సంవత్సరంలో మార్పులు చేయాలని కేంద్రం యోచిస్తోందని సమాచారం. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో దీనిపై నిర్ణయం వెలుపడొచ్చని అంచనాలు వెలుపడుతున్నాయి. జనవరి ఒక్కటి నుంచి డిసెంబర్ ముగింపు వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఇతర దేశాల్లో ఇదే విధానం కొనసాగుతోంది. ప్రస్తుతం ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తున్నారు. ఆర్థిక సంవత్సరాన్ని మార్చితే కొత్త పన్ను తేదీలకు అనుగుణంగా పన్ను చెల్లింపుదారులు, వ్యాపారులు తమ ప్రణాళికలను సర్దుబాటు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని నిపుణులు పేర్కొంటున్నారు.

శక్తి పంప్స్ లాభాల్లో 130 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ నికర లాభాలు 130.09 శాతం పెరిగి రూ.104 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.45.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.495.6 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో 31 శాతం పెరిగి రూ.648.8 కోట్లకు చేరింది. ఆర్డర్‌ల అమలు, కార్యాచరణ సామర్థ్యాల పెరుగుదల ద్వారా కంపెనీ బలమైన ఆర్థిక పనితీరును కనబర్చిందని ఆ కంపెనీ ఛైర్మన్ దినేష్ పాటిదార్ పేర్కొన్నారు.

ఉత్తమ ఎఐ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎస్25 : టిఎం రోహ్

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ అత్యుత్తమ ఎఐతో గెలాక్సీ ఎస్25 స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ మరియు మొబైల్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ హెడ్ టిఎం రోహ్ పేర్కొన్నారు. గెలాక్సీ ఎస్25 అనేది కెమెరా, బ్యాటరీ కోసం హార్డ్‌వేర్‌లో సాటిలేనిదన్నారు.. ఇది గెలాక్సీలో అత్యుత్తమ పనితీరు కలిగిన కస్టమైజ్డ్ ప్రాసెసర్‌ని కలిగి ఉందన్నారు. గెలాక్సీ ఎఐ తో, ఎఐ -ఆధారిత చిత్ర నాణ్యత, ఇమేజ్ ఎడిటింగ్ సామర్థ్యాలతో డిజైన్ చేశామన్నారు. దీని ప్రారంభ ధర రూ.80,999గా నిర్ణయించామన్నారు.

రీసైకిల్ పాదరక్షల బ్రాండ్‌గా గో ప్లానెట్ డి

న్యూఢిల్లీ : ప్రపంచంలోని తొలిసారి 100 శాతం పర్యావరణ అనుకూల, సర్క్యులర్ పాదరక్షల బ్రాండ్‌గా 'గో ప్లానెట్-డి బై డెబోంగో' అవతరించిందని ఆ సంస్థ పేర్కొంది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి, పాదరక్షల పరిశ్రమలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడానికి ఈ వ్యాపార నమూనాను స్వీకరిస్తున్నట్లు వికెసి ఎండి వికెసి రజాక్ పేర్కొన్నారు. ఇక తమ సంస్థ రీసెల్. రీసైకిల్. రెన్యూ అనే కొత్త వ్యాపార మంత్రాన్ని అనుసరిస్తుందన్నారు.

డ్రైవర్లకు ఎస్‌ఆర్‌టియు ప్రోత్సాహం

హైదరాబాద్ : డ్రైవర్స్‌ను డేను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల సంఘం (ఎఎస్‌ఆర్‌టియు) దేశ వ్యాప్తంగా డ్రైవర్లను గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపింది. ఇందులో భాగంగా సురక్షితమైన ప్రజా రవాణాలో అసాధారణ అంకితభావాన్ని ప్రదర్శించిన ఇద్దరు డ్రైవర్లకు రూ.5,000 చొప్పున బహుమతి అందించినట్లు ఎఎస్‌ఆర్‌టియు ఉపాధ్యక్షులు సిహెచ్ ద్వారకా తిరుమల రావు పేర్కొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో నుంచి కొత్త వైద్య బీమా

ముంబయి : హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ చౌక ధరలో 'ఆప్టిమా హెల్త్ ఇన్సూరెన్స్' ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది రూ.5-7.5 లక్షల బేస్ సమ్ అస్యూర్డ్‌తో లభిస్తుందని ఆ సంస్థ బుధవారం తెలిపింది. ఇది దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన బీమా పాలసీగా నిలువనుందని ఆ కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ప్లాన్‌లో అవయవదానం వ్యయాలు, హోమ్ హాస్పిటలైజేషన్, రోడ్, ఎయిర్ ఎమర్జెన్సీ అంబులెన్సీ సర్వీసెస్‌లను పొందవచ్చని ఆ కంపెనీ డైరెక్టర్ పార్థనిల్ ఘోష్ పేర్కొన్నారు. ఈ పాలసీపై ప్రతీ ఏడాది 10 శాతం బోనస్ జోడింపబడుతుందన్నారు.

మధ్యతరగతి కుదేలు

మోడీ సర్కారు విధానాలతో ఆర్థికంగా చితికిపోతున్న మిడిల్‌క్లాస్

- ఆదాయం తక్కువ.. ఖర్చులెక్కువ
- ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ : మోడీ పాలనలో దేశంలోని కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలు ఆకాశమే హద్దుగా ఎదిగిపోతున్నారు. ఇందుకు కేంద్రం తనవంతు సాయాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగానూ అందిస్తున్నది. అయితే, దేశ జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్న మధ్యతరగతి ప్రజల బతుకుల్లో మాత్రం వెలుగులు కనబడటం లేవు. మోడీ సర్కారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో వారి ఆదాయాల కంటే ఖర్చులే ఎక్కువవుతున్నాయి. పన్ను పోట్లు వీరికి గుదిబండగా మారుతున్నాయి.



దేశంలో పెట్రోల్, వంటగ్యాస్, నిత్యావసరాల ధరల పెరుగుదల మధ్యతరగతి పౌరుడి జేబుకు చిల్లు పెడుతున్నది. ఇంత జరుగుతున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. తాము ఏమి చేసినా.. దేశంలోని మధ్యతరగతి ప్రజలు నమ్ముతారనే అతి విశ్వాసం కేంద్రానికి ఉన్నదనీ, ప్రజలు ప్రశ్నించేతత్వాన్ని కోల్పోవటమూ ప్రభుత్వానికి

కేంద్ర మంత్రి నిర్మలా పన్ను పోటు

కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల పైనా తీవ్ర చర్చ నడుస్తున్నది. జీఎస్టీతో పాటు ఇతర పన్ను పోటుతో మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఆదాయాలపై విధించి పన్ను విషయంలోనూ దేశంలోని ఒక వర్గం ప్రజలు కేంద్ర మంత్రిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో కేంద్ర ఆర్థిక మంత్రిపై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. కొత్త వ్యాపారాలు ప్రారంభిద్దామనుకున్న యువతకు మోడీ సర్కారు విధానాలు గుదిబండగా మారాయని అంటున్నారు. దేశ జనాభాలో మధ్యతరగతి ప్రజలే అధికం. కాబట్టి, ఆర్థిక వ్యవస్థలో వీరిది కీలక పాత్ర. కానీ, ప్రభుత్వాలు మాత్రం వారి గురించి ఆలోచించటం లేవు. పైగా.. తిరోగమన చర్యలతో మిడిల్‌క్లాస్‌ను ఊపిరిసల్పనీయకుండా చేస్తున్నాయి. వచ్చే అతికొద్ది ఆదాయంలో ఆహారం, పిల్లల చదువులు, ఇళ్లు, ఆరోగ్యం.. ఇలా కనీస అవసరాలను తీర్చుకొనే విషయంలోనే మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా కష్టపడాల్సిన పరిస్థితులు దేశంలో ఉన్నాయి.

కలిసొచ్చిందని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంక సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ప్రపంచ సంస్థలు చేసిన అంచనాల ప్రకారం.. ఈ ఏడాది వృద్ధి రేటు దాదాపు 6.5 శాతంగా ఉంటుందని అంచనా. ఇక కేంద్రం ఆర్థిక విధానాలతో ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటున్న భారత్‌లోని మిలియనీర్లు దేశాన్ని విడిచి వెళ్తున్నారని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. హెన్లీ ప్రయివేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్ ప్రకారం ఇది గత రెండేండ్లకు పైగా సగటున 5వేలుగా ఉన్నది. వారు భారత్‌లో పెట్టుబడులు పెట్టటానికి అయిష్టతతో ఉన్న

ఏమి చేసినా చెల్లుతుందనే రీతిలో మోడీ సర్కారు

మధ్యతరగతి ప్రజల నుంచి పన్నులు ఇతర మార్గాల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని ఇతర పథకాల రూపంలో కేంద్రం తన ఎన్నికల ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇంత జరిగినా.. మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో తాము రాజకీయంగా బలంగా ఉన్నామనీ, అక్కడ ఎన్నికల్లోనూ వారి నుంచి ఓట్లను పెద్ద సంఖ్యలో రాబట్టుకుంటున్నామని కాషాయపార్టీ నాయకులు అంటున్నారు. అయితే, ఈ ధైర్యమే మోడీ సర్కారుకు ఆయుధంగా మారిందనీ, తిరిగి మధ్యతరగతి ప్రజలే తిప్పలు పడుతున్నారని విశ్లేషకులు చెప్తున్నారు.

కారణంగానే ఇతర దేశాలకు వెళ్తూ అక్కడ సెటిల్ అయ్యే ప్రయత్నాలను చేస్తున్నారని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఇందుకు విరుద్ధంగా బిలియనీర్లు మోడీ సర్కారును పొగిడే పనిలో ఉన్నారనీ, ఫలితంగా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మధ్యతరగతి ప్రజలకు దేశంలోనే ఉండి కష్టాలను ఎదుర్కోవటం తప్పితే మరొక అవకాశం కనిపించటంలేదని చెప్తున్నారు.

బీజేపీ భావోద్వేగ రాజకీయాలు.. ప్రశ్నించని మధ్యతరగతి పౌరుడు

హిందూత్వం, జాతీయవాదం అనే నినాదాలను వినిపిస్తూ మధ్యతరగతి ప్రజల ఆలోచనలను అటువైపు మళ్లించటంలో బీజేపీ సఫలమైంది. అలాగే, హిందూ-ముస్లిం అంటూ విభజన సిద్ధాంతాన్ని తీసకొచ్చి విజయవంతంగా ప్రయోగించింది. ఇలాంటి తరుణంలో ఆ వర్గం ప్రజలు బీజేపీ చెప్పే భావోద్వేగమైన నినాదాల, విషయాలను నమ్మి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్న ఆలోచనను చేయలేకపోతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించనితత్వం అభివృద్ధికి ఆటంకమనీ, ప్రజలు దీనిని గుర్తెరగాలని మేధావులు చెప్తున్నారు.

'జిహాద్' రాజకీయం

- ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి తీరు
- ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకుంటూ ప్రసంగాలు
- హిందువులలో భయాలను రేకెత్తించే చర్యలు
- ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బహిర్గతం



డెహ్రాడూన్ : వివాదాస్పద చట్టాలు, కార్యక్రమాలతో వార్తల్లో నిలిచే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి.. రాష్ట్రంలోని ఒక వర్గంవారిని లక్ష్యంగా చేసుకుంటూ పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వివాదాస్పద ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)ని తీసుకొచ్చారు. ఇప్పుడు ఒక వర్గంవారే టార్గెట్‌గా 'లవ్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్', 'థూక్ జిహాద్', మత మార్పిళ్లు అని మాట్లాడుతూ.. ప్రజల్లో భయాన్ని రేకెత్తిస్తున్నారు. ఆ వర్గాన్ని విలన్లుగా చూపెడుతూ.. హిందువుల ఓట్లను పొందే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో పలు సందర్భాలలో ఆయన ఈ వివాదాస్పద ప్రసంగాలు వినిపించారు. ఒక వర్గంపై పరోక్షంగా విపరీత వ్యతిరేక ప్రచారాన్ని నడిపారు.

ఉత్తరాఖండ్‌లోని జనాభాకు కలిగే ప్రమాదం గురించి ఆయన లేవనెత్తారు. "ఈ సమస్యకు ఒకే ఒక్క సమాధానం బీజేపీ. ఉత్తరాఖండ్ సంస్కృతిని కాషాయపార్టీ కాపాడుతుంది" అని పుష్కర్‌సింగ్ దామీ అన్నారు. మీడియా అంతా ఢిల్లీ ఎన్నికలపై దృష్టిని కేంద్రీకరించటంతో పుష్కర్‌సింగ్ ధమీ వ్యాఖ్యలు అంతగా హైలెట్ కాలేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 23న మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. ఓటర్ల పేర్లు తొలగించిందంటూ బీజేపీని ప్రతిపక్షం విమర్శించింది. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ఆయన తన ప్రతి ప్రసంగంలో 'ల్యాండ్ జిహాద్' గురించి మాట్లాడారు. "మన జనాభాను సురక్షితంగా ఉంచుకోవటానికి ఉత్తరాఖండ్ మతస్వేచ్ఛ(సవరణ) చట్టం అమలు చేశాం. అల్లర్లు, ల్యాండ్ జిహాద్, థూక్ జిహాద్ వంటి మనస్తత్వాన్ని ఆపటానికి చట్టాన్ని చేశాం. కఠిన దర్యాప్తును జరిపాం.." అని ఈనెల ఆరంభంలో ఆయన అన్నారు. దీనిని పుష్కర్‌సింగ్ దామి తన యూట్యూబ్ ఛానెల్‌లో సైతం అప్‌లోడ్ చేశారు. ఉత్తరాఖండ్‌లో భూమి అనేది ఒక వర్గం ప్రజల నుంచి ముప్పును ఎదర్కొంటున్నదనే భయాన్ని కలిగించే యత్నాన్ని ఆయన చేశారు. ఇక్కడ భూమిని కొన్నవారు, ల్యాండ్ బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నం చేశారనీ, వారికి వ్యతిరేకంగా తాము చర్యలు తీసుకోబోతున్నామని అన్నారు. ఉత్తరాఖండ్ జనాభా, భూమిలో జోక్యం చేసుకునేవారిని అడ్డుకునేలా ఒక కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. "ల్యాండ్ జిహాద్‌పై దర్యాప్తు జరిపాం. మన రాష్ట్రంలో 5వేల ఎకరాల భూమికి విముక్తిని కల్పించాం. కుట్రతో, మతం పేరుతో చెరబట్టిన అనేక భూములను సీజ్ చేశాం. దీనితో పాటు థూక్ జిహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నాం. ప్రజల్లో ఆ భయం ఉండాలి" అని ఈనెల 9న చేసిన మరొక ప్రసంగంలో పుష్కర్‌సింగ్ దామి అన్నారు. వాస్తవానికి 'ల్యాండ్, లవ్, జిహాద్' అనే పదాన్ని బీజేపీ, కొన్ని హిందూత్వ సంస్థలు.. ముస్లింలను టార్గెట్‌గా చేసుకోవటానికి ఉపయోగిస్తుంటాయి. అసలు ఈ పదాలకు చట్టంలో ఒక అర్థం ఇప్పటి వరకూ లేదు. ఈనెల 12న ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మతమార్పిడి నిరోధక చట్టం తీసుకురావాల్సిన అవసరం, కారణాన్ని వివరించారు. ఉత్తరాఖండ్ మూలస్వరూపాన్ని పాడు చేయొద్దన్న కారణంతో మత-మార్పిడి నిరోధక చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఆ తర్వాత డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ల్యాండ్ జిహాద్, లవ్ జిహాద్, అసహ్యకరమైన మనస్తత్వమైన థూక్ జిహాద్ పైన సీరియస్‌గా దర్యాప్తును ప్రారంభించామన్నారు. అలాగే, ప్రభుత్వాస్తులకు నష్టం కలిగించే అల్లర్లకు వ్యతిరేకంగానూ తాము చట్టాన్ని తెచ్చామని చెప్పారు. ఈనెల 17న మూడు వేర్వేరు ప్రదేశాల్లో ప్రసంగించారు. అందులోనూ మూడు జిహాద్‌లు, రాష్ట్రంలో జనాభా మార్పు విషయంలో మాట్లాడుతూ ప్రజల్లో భయాలు కలిగే విధంగా వ్యవహరించారు. దేశంలో యూసీసీని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. ఈ చట్టం రాష్ట్రంలో సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. యూసీసీ నిబంధనలను ఈనెల 20న రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. అయితే, ఈ వివాదాస్పద యూసీసీని తీసుకురావటానికి అంబేద్కర్ పేరును బీజేపీ ప్రభుత్వం వాడుకున్నది. యూసీసీకి అంబేద్కర్ అనుకూలమని ప్రచారం చేసింది. అయితే, ఇది నిజం కాదనీ, ముస్లింల విషయంలో దీనిని బలవంతంగా తీసుకురావొద్దని అంబేద్కర్ చెప్పినట్టు కొన్ని కథనాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో అన్ని సమస్యలకూ ఒక వర్గం వ్యక్తులనే విధంగా పరోక్షంగా వారిని టార్గెట్ చేయటం ఏమాత్రమూ సరికాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న ఆయన.. ఈ విధంగా వ్యవహరించకూడదని మేధావులు సూచిస్తున్నారు. బీజేపీ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ ఇలాంటి ద్వేషపూరితమైన రాజకీయాలు సర్వసాధారణమనీ, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని సామాజికవేత్తల, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఆ జెండా...మీ ఎజెండా

- మాదిగల ఓట్లను బీజేపీకి తాకట్టు పెడతావా?
- మందకృష్ణపై సతీష్ మాదిగ ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ వేసుకునే నల్ల కండువా కింద కాషాయ జెండా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీష్ మాదిగ విమర్శించారు. అదే ఆయన రాజకీయ ఎజెండా అని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదని ఒక ప్రకటనలో నిలదీశారు. నల్లకండువా వేసుకుని బీజేపీ ఎజెండాను అమలు చేస్తున్నారని విమర్శించారు. గద్దర్, మందకృష్ణ మావోయిస్టులే కానీ మీకు మాత్రమే పద్మశ్రీ అవార్డు రావడం వెనక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఆయన్ను అడ్డం పెట్టుకుని మాదిగల ఓట్లకు బీజేపీ గాలం వేస్తున్నదని గుర్తు చేశారు. ఈ చిన్న విషయం కూడా ఆయనకు అర్థం కావడం లేదని విమర్శించారు. వర్గీకరణను అమలు చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. దాన్ని మాల సామాజికవర్గానికి చెందిన నేతలు అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు. అనవసరంగా ఆరోపణలు చేయడం సరైంది కాదని సూచించారు. సీఎం రేవంత్‌ను బద్నాం చేయడం ద్వారా బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు ఆయన పని చేస్తున్నారని ఆరోపించారు. పక్క రాష్ట్రానికి పద్మశ్రీ, పద్మభూషణ్ కలిపి ఐదు అవార్డులు వచ్చాయనీ, తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ రేవంత్ వ్యాఖ్యలు చేయడం తప్పెలా అవుతుందని మందకృష్ణను ప్రశ్నించారు. రాష్ట్రానికి ఎక్కువ అవార్డులు రావద్దు...తనకు మాత్రమే అవార్డు రావాలనే అక్కసు ఆయనలో కనిపిస్తుందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. తప్పుడు ప్రచారం ద్వారా కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.

పేదలకు విద్య అందించే విద్యాధన్ ఫౌండేషన్ కు ప్రభుత్వ సహకారం

- మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలకు విద్యను అందిస్తున్న విద్యాధన్ ఫౌండేషన్ కు తమ ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో స్వచ్ఛంద సంస్థ విద్యాధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీవితంలో ఉత్తమమైనది విద్య అనీ, ఏ దశలోనూ విద్యాభ్యాసాన్ని ఆపవద్దనీ, తాను ఉన్నత స్థితిలో రావడానికి దోహదం చేసింది ఆ విద్యేనని సీతక్క చెప్పారు. ఎవరూ దోచుకోలేని విద్యను పంచుకుంటేనే విజ్ఞానం పెరుగుతుందని సూచించారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో విద్యా హక్కు చట్టం వచ్చిందనీ, తద్వారా 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ విద్య ప్రవేశపెట్టబడిందని గుర్తుచేశారు. 10వ తరగతి చదివిన తాను తర్వాత 10 ఏళ్ల అజ్ఞాత జీవితం గడిపాననీ, బయటికి వచ్చాక విద్యను కొనసాగించి ఎల్ఎల్ఎం, ఎంఎ, పీహెచ్ డీ పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. విద్య అభివద్ధిలో నేటికి అంతరాలు కొనసాగుతున్నాయని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మారిన పరిస్థితుల్లో మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలని కోరారు.

పామాయిల్ సాగులో మొదటి స్థానంలో ఉంచాలి

- మంత్రి తుమ్మల సూచన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పామాయిల్ సాగులో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పామాయిల్ సాగుపై మంత్రి సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. ఈ సంవత్సరంలో 16,729 ఎకరాల్లో పామాయిల్ సాగు చేపట్టామని తెలిపారు. మార్చిలోగా 19,271 ఎకరాలలో సాగయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను రైతులకు, పవర్ లూమ్ పరిశ్రమకు అందించాలని సెస్ అధికారులను ఆదేశించారు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచాలనీ, సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. మార్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నియమాల ప్రకారం సంస్థను నడిపించాలని సూచించారు. సంస్థ సిబ్బంది ప్రజాప్రతినిధులను కలుపుకొని వారి సూచనల మేరకు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. చేనేత అభయ హస్తం పథకంను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని కోరారు. మరమగ్గాల యూనిట్లకు విద్యుత్ సబ్సిడీ అమలు చేయాలని ఆదేశించారు. చేనేత సహకార సంఘాలకు, పవర్ లూమ్ సంఘాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, సహకారశాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాతోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీక్రెట్ కెమెరాలపై కౌంటర్ వేయండి

- కేంద్రానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీక్రెట్ కెమెరాల క్రయవిక్రయాలపై అడ్డుఅదుపు లేకుండా ఉందనీ, వాటిని దుర్వినియోగం చేస్తున్నారంటూ దాఖలైన పిల్‌లో కేంద్రం కౌంటర్ వేయకపోడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కౌంటరు దాఖలుకు ఇదే చివరి అవకాశమని తేల్చి చెప్పింది.ఈసారి కూడా కౌంటర్ వేయకపోతే తమ ముందున్న పత్రాల ఆధారంగా తీర్పు చెబుతామని హెచ్చరించింది. సీక్రెట్ కెమెరాల వల్ల నష్టాలు ఉన్నాయంటూ హెవెన్ హెూమ్స్ సొసైటీస్ హైదరాబాద్ 8 ఏళ్ల నాడు పిల్ వేస్తే ఇప్పటి వరకు కేంద్రం కౌంటర్ వేయలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 28లోగా కౌంటర్ వేయాల్సిందేనని చెప్పింది. తదుపరి విచారణను మార్చి 5వ తేదీకి వాయిదా వేసింది.



ఎస్వీఐటీ ఎడిట్ ఆప్షన్ ఇవ్వండి హైకోర్టు

ఎస్వీఐటీ కాలేజీకి చెందిన వివరాల సమర్పణకు అవకాశం ఇవ్వాలని జెఎన్‌టీయు, ఏఐసీటీఈలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ ఆదేశించారు. ఈమెయిల్‌తో సహా ఇతర వివరాలను మార్పుకు వీలు కల్పించాలన్నారు. ఈ అవకాశాన్ని ఇతర విధాలుగా వినియోగించరాదని కాలేజీలను ఆదేశించారు.చెరువులో చెత్త డంపింగ్

పిల్‌ను విచారించిన హైకోర్టు

నగరంలోని షేక్‌పేటలోని హమీద్ కుంట,అంతగాని కుంట, బంజారా చెరువులో చెత్తను వేస్తున్నారంటూ పిల్ దాఖలైంది. డాక్టర్ క్యూ హసన్ వేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. చెరువు సుందరీకరణ పేరుతో చెరువు మధ్యలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని పిటిషనర్ చెప్పారు. ఆఫీసర్లు తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ ఎలాంటి పనులు జరగడంలేదని పీసీబీ చెప్పింది. దీనిపై తాజా నివేదికను సమర్పించాలని పీసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లపై ఉత్తర్వులు

స్టేట్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల భర్తీ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు చెప్పింది. ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఉదహరించినట్టుగా దరఖాస్తుల చివరి తేదీనాటికి ఇన్‌కం సర్టిఫికెట్‌ను సమర్పించాలని సూచించింది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ తిరుపతి అనే వ్యక్తి వేసిన అప్పీల్ పిటిషన్‌లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టుగా కాకుండా ఏడాది తర్వాత ఆదాయపు సర్టిఫికెట్‌ను అనుమతించాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. హాస్టల్ సంక్షేమ అధికారి గ్రేడ్-2 పోస్టు అప్లికెంట్, సిద్ధిపేటకు చెందిన కె.తిరుపతి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోసం 2022-23, 2023-24 సంవత్సరాలకు సమర్పించారు. 20-21 ఏడాదికి సమర్పించలేదు. ఈ చర్యను సింగిల్ జడ్జి తప్పుపట్టారు. ఆ తీర్పును డివిజన్ బెంచ్ కూడా సమర్థిస్తూ తీర్పు చెప్పింది.

పార్కులో వాజ్‌పేయ్ విగ్రహం పిల్ కొట్టేసిన హైకోర్టు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని పబ్లిక్ గార్డెన్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలంటూ జె.ఉమేశ్వరరావు అనే వ్యక్తి వేసిన పిల్‌ను హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్‌చేసింది. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కుల,మతాలకు చెందిన విగ్రహాలను ఏర్పాటు చేయరాదని చెప్పింది. వాజ్‌పేయ్ విగ్రహం ఏర్పాటు చర్య సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధం కాదని తేల్చింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో..

తన సోదరి కూతురు పెండ్లి ఉన్నందున తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన రాధాకిషన్‌రావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం తీర్పు చెప్పనుంది. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2వరకు మధ్యంతర బెయిలు మంజూరు చేయాలని రాధాకిషన్‌రావు పిటిషన్ వేశారు. ఇదే కేసులో రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు పూర్తయ్యాయి. దీనిపై తీర్పును వాయిదా వేసింది. మరోవైపు ఇదే కేసులో ఇంకో నిందితుడు భుజంగరావుపై గురువారం హైకోర్టు చెప్పనుంది.

ఇస్రో శాస్త్రవేత్తలకు హరీశ్‌రావు అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశ వందవ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. "100వ రాకెట్ ప్రయోగం దేశానికి గర్వకారణం. దేశ అంతరిక్ష పరిశోధన రంగం మరింత అభివృద్ధి చెందాలి" అని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

కేంద్రం ఓబీసీ కులగణన చేపట్టాలి

- మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్
- అంబేద్కర్ సమాధి చైత్యభూమిని సందర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముంబై దాదర్లోని అంబేద్కర్ సమాధి చైత్యభూమిని బుధవారం మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ సందర్శిం చారు. బాబాసాహెబ్‌కు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళి అర్పించా రు. ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాల ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కుల గణన జరిపించాలనీ, చట్ట సభల్లో కుల దామాషా ప్రకారం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముంబై ప్రధాన కార్యదర్శి శివరాజ్ బొల్లె, కురుమ సంఘం నేత జెట్టా కృష్ణ, రజక సంఘం నేత తడకపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నా ఫ్రెండే రూ.15.5 కోట్లు పోగొట్టుకున్నాడు

వివిధ రాష్ట్రాల్లో స్పెషల్ ఆపరేషన్

- పలు కేసుల్లో బ్యాంకు మేనేజర్ సహా 52 మంది అరెస్ట్
- కష్టంగా మారుతున్న నగదు రికవరీ : సీపీ సీవీ ఆనంద్
- సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

సైబర్ నేరాలను అరికట్టేందుకు ఏడు బృందాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరస్తులు తాజాగా డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్ పేరుతో రెచ్చిపోతున్నారు. డిజిట్ అరెస్టు, విచారణ పేరుతో అప్పటికప్పుడు లక్షల్లో బ్యాంక్‌లకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. ఇదే అనుభవం హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ స్నేహితునికి ఎదురైంది. డిజిటల్ పేరుతో తన స్నేహితుడే రూ.15.5కోట్లు పోగొట్టుకున్నాడని స్వయంగా సీపీ తెలిపారు. బుధవారం సీసీసీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

ఉన్నత చదువులు చదువుకున్న వారు కూడా సైబర్ నేరస్తుల మాటలను నమ్మి మోసపోతున్నారని చెప్పారు. పట్టుకున్న సైబర్ నిందితులపై దేశవ్యాప్తంగా 576 కేసులు నమోదు కాగా, తెలంగాణలోనే 74 కేసులున్నాయని వివరించారు. హైదరాబాద్ నగరంలో 33 కేసులు నమోదైనట్టు తెలిపారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా రూ.88.3 కోట్ల మేరకు బాధితులు పోగొట్టుకున్నారని, రూ.2.87కోట్లను ఫ్రీజ్ చేశామని చెప్పారు. చీఫ్ జస్టిస్ సుప్రీంకోర్టు పేరుతో ఫేక్ ఆర్డర్‌ను తయారు చేసిన నిందితులు పలువురిని మోసం చేశారని తెలిపారు. కాజేసిన డబ్బులను క్రిప్టో కరెన్సీగా మారుస్తున్నారని చెప్పారు. ఇదే తరహాలో ముగ్గురు డాక్టర్లను మోసం చేసిన నిందితులు 'మీ కేసు క్లోజ్ చేస్తామని' బాధితుల నుంచి మూడు కోట్ల ఎఫ్‌డీలను కాజేశారని వివరించారు.

డిజిటల్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాలను అరెస్టు చేసినట్టు సీవీ ఆనంద్ తెలిపారు. 33 మేజర్ కేసులను ఛేదించిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు బ్యాంకు మేనేజర్ సహా 52 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల నుంచి భారీగా చెక్‌బుక్‌లు, సెల్‌ఫోన్లు, రబ్బర్ స్టాంపులు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో వాటిని అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో స్పెషల్ ఆపరేషన్ చేపట్టామన్నారు. గుజరాత్, కర్నాటక, న్యూఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాళ్, బీహార్‌తోపాటు హైదరాబాద్‌లో ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. నిందితులు మూడు రకాల సైబర్ క్రైమ్ మోసాలకు పాల్పడ్డారని వివరించారు. నిందితుల్లో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు సైతం ఉన్నారని తెలిపారు. ఫేస్‌బుక్ బ్రౌజింగ్, వాట్సప్ గ్రూప్స్ ద్వారా అమాయక ప్రజలను నిందితులు ఆకర్షిస్తున్నారని వివరించారు.

ట్రేడింగ్ పేరుతో రూ.93 లక్షలు స్వాహా..

నేపాల్, చైనా కేంద్రంగా ట్రేడింగ్ మోసాలు అధిక సంఖ్యలో కొనసాగుతున్నయని సీపీ తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల ద్వారా నగరానికి చెందిన ఓ బాధితుడిని లక్ష్యంగా చేసుకొని ట్రేడింగ్ పేరుతో రూ.93 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. సీ1505, బ్లాక్ రాక్ క్యాపిటల్ స్టాక్ మానిటరింగ్ గ్రూప్' పేరుతో నమ్మించారు. మ్యూల్ ఖాతాను తెరిపించి బ్యాంక్ అధికారుల సహకారంతో మోసాలకు పాల్పడుతున్నట్టు దర్యాప్తులో గుర్తించారు. బెంగళూర్ ఆర్‌బీఎల్ బ్యాంక్ బ్రాంచ్‌కు చెందిన డిప్యూటీ మేనేజర్ సుభమ్ కుమార్ జాతోపాటు అదే రాష్ట్రానికి చెందిన యాక్సెస్ బ్యాంక్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ హరూన్, వ్యాపారి ఆర్.మోహన్‌ను సైబర్ క్రైమ్ బృందాలు అరెస్టు చేశాయన్నారు. 20 కేసుల్లో నిందితులుగా ఉన్న వీరు రూ.23కోట్లను వివిధ బ్యాంక్‌లకు ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు.

గుర్తుతెలియని గ్రూపుల్లో జాయిన్ కావొద్దు

ప్రజలెవరూ గుర్తుతెలియని యాప్స్, వాట్సప్ గ్రూప్స్‌లో జాయిన్ కావొద్దని సీపీ సూచించారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులపై జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. చదువుకున్న వ్యక్తులు కూడా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారని, గతేడాది రూ.3,500 కోట్లు సైబర్ క్రైమ్ ద్వారా కాజేశారని, వాటిల్లో 13 శాతం మాత్రమే రికవరీ చేశామన్నారు. ఈ కేసుల్లో నగదు రికవరీ చాలా కష్టంగా మారిందని, నిందితులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వ్యక్తులు కావడంతో దర్యాప్తు ఆలస్యమవుతోందని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై సీపీ అవగాహన కల్పించారు.

ప్రపంచస్థాయి సదుపాయాలతో ఉస్మానియా ఆస్పత్రి

- 30 లక్షల చదరపు అడుగుల సామర్థ్యంతో
- స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక భవనాలు
- అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- హాస్పిటల్ నిర్మాణంపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక టెక్నాలజీతో కొత్త ఉస్మానియా హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, కోట్ల మంది ప్రజలు కొత్త ఉస్మానియా కోసం దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్నారనీ, వారందరి కలను నెరవేర్చుకునే సమయం వచ్చిందన్నారు. హాస్పిటల్ నిర్మాణంలో ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని అధికారులకు మంత్రి సూచించారు. తమకున్న 38 ఎకరాల స్థలంలో, 26.30 ఎకరాలను హాస్పిటల్ కోసం ఇచ్చిన పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు, గోషామహల్ ప్రజలకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన స్థలంలో పోలీసులు తమ కార్యకలాపాలను యథావిధిగా నిర్వహించుకోవచ్చునని మంత్రి సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హాస్పిటల్‌కు వేదిక అవుతున్న గోషామహల్ ప్రజలు ఎంతో అదృష్టవంతులనీ, ఈ ప్రాంతం పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు వాకిట్లోనే అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 26.30 ఎకరాల విస్తీర్ణంలో, 32 లక్షల స్క్వేర్ ఫీట్ సామర్థ్యంతో విశాలమైన హాస్పిటల్ భవనాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ హాస్పిటల్ మొత్తం 2 వేల పడకలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా హాస్పిటల్‌లో 22 డిపార్ట్‌మెంట్లు ఉండగా, అదనంగా మరో 8 డిపార్ట్‌మెంట్లు కొత్త ఉస్మానియాలో ప్రారంభిస్తామని తెలిపారు.

హాస్పిటల్‌లో ప్రతి గదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా హాస్పిటల్ భవనాలను డిజైన్ చేయించామని మంత్రి చెప్పారు. హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్లకు, స్థానికులకు ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ఆస్పత్రికి నలువైపులా విశాలమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులను డిజైన్ చేశామనీ, దేశంలోనే అత్యంత విశాలమైన పార్కింగ్ వ్యవస్థ కలిగిన హాస్పిటల్‌గా ఉస్మానియా రికార్డుల్లోకి ఎక్కబోతున్నదని తెలిపారు. పేషెంట్లకు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా, గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక టెక్నాలజీ, వసతులతో కూడిన మార్చురీని నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రోగుల సౌకర్యార్థం అన్ని రకాల డయాగ్నసిస్ సేవలను ఒకే చోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఓపీ సేవలు అందించాలని సూచించారు. పేషెంట్ల కోసం విశాలమైన వెయిటింగ్ హాల్స్ ఉండాలనీ, కనీసం రోజూ 3 వేల నుంచి 5 వేల మంది పేషెంట్లు వచ్చే అవకాశం ఉన్నందున, ఇందుకు అనుగుణంగా ఓపీ కౌంటర్లు ఉండాలని సూచించారు. ఓపీ కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడే ప్రసక్తే ఉండకూడదన్నారు. కొత్త ఉస్మానియాలో నర్సింగ్, డెంటల్, ఫిజియో థెరపీ కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి ప్రకటించారు. స్టూడెంట్ల కోసం హాస్పిటల్ ఆవరణలోనే హాస్టల్స్‌ను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. 750 సీట్లతో కూడిన భారీ ఆడిటోరియం అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ప్రతి డిపార్ట్‌మెంట్ కోసం స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఐసీయూ వార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. కిడ్నీ, లివర్, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం కొత్త ఉస్మానియాలో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. పేషెంట్ల సహాయకుల కోసం ఆస్పత్రి ఆవరణలోనే ధర్మశాలను నిర్మించబోతున్నామని మంత్రి తెలిపారు. అక్కడ ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. హాస్పిటల్ సానిటేషన్, టాయిలెట్ల నిర్వాహణ కోసం ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామనీ, కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో కొత్త ఉస్మానియా ఉంటుందని చెప్పారు. ఫైర్ స్టేషన్, పోలీస్ అవుట్ పోస్ట్ కూడా కొత్త ఉస్మానియాలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా నియమాకం..

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31న ప్రస్తుత డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పదవీవిరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో హరీశ్‌కుమార్ గుప్తాను తదుపరి డీజీపీగా నియమించారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో హరీశ్ గుప్తాను ఎన్నికల సంఘం డీజీపీగా నియమించింది. దీంతో కొన్నిరోజుల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరుమలరావును డీజీపీగా నియమించింది.

వర్షాధార వ్యవసాయ ఉత్పాదకతను పెంచాలి


- ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వర్షాధార వ్యవసాయంలో తగిన ఉత్పాదకతను పెంపొందించాలని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ సూచించారు. వర్షాధార వ్యవసాయానికి తగిన ప్రాధాన్యతను తీసుకరావడానికి కృషి చేసిన పలువురు పరిశోధకులను ఆయన అభినందించారు. వర్షాధార వ్యవసాయం ఉత్పాదకత, కొత్త విస్తరణ పద్ధతులను అభివృద్ధి చేయడంలో పరిశోధకులు మరింత కృషి చేయాల్సిన అవసరముందని సూచించారు. బుధవారం హైదరబాద్‌లోని ఐసీఏఆర్, క్రిడ కేంద్రంలో వర్షాధార వ్యవసాయంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠక్ మాట్లాడుతూ స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఐఎస్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ వీకే సింగ్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థకు వర్షాధార వ్యవసాయమనేది ఎంతో కీలకమైందని తెలిపారు. పరిశోధకులకు, రైతులకు అవగాహన కల్పించడమే సదస్సు ఉద్దేశమని చెప్పారు. ఎన్జీవోలు, వ్యవసాయ నిపుణులు, ప్రయివేటు సంస్థలు, రైతులను ఒకేతాటిపైకి తీసుకరావడం సమాజానికి ఎంతో ఉపయోగమని చెప్పారు. డాక్టర్ ఎస్‌కే చౌదరి మాట్లాడుతూ వర్షాధార వ్యవసాయంలో అభివృద్ధి దాని ప్రాముఖ్యతను తెలిపారు. వర్షాధార వ్యవసాయంలో ఎదురవుతున్న వివిధ ఒత్తిళ్లను, సమస్యలను అధిగమించాలని సూచించారు. ఇక్రిశాట్ డీజీ డాక్టర్ స్టాన్‌ఫోర్డు బ్లేడ్ సాగు యోగ్యం కానీ నేలలపై దృష్టి సారించాలని కోరారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ జేవీఎన్ఎస్ ప్రసాద్ ప్రతినిధులకు స్వాగతం పలికారు. డ్రైలాండ్ అగ్రికల్చర్‌కు చెందిన ప్రముఖులకు అవార్డుల ప్రదానం చేశారు. ఐఎస్‌డీఏ కోశాధికారి డా.పి.కె.పంకజ్ ఉన్నారు. వివిధ దేశాలకు చెందిన 750 మందికి పైగా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంద సంస్థ అధికారులు, ప్రయివేటు సంస్థలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం కష్టతరం

- ప్యాకేజీని స్టీల్‌ప్లాంట్ సద్వినియోగం చేసుకోవాలి
- కార్మికులతో చర్చించే ప్యాకేజీ ప్రకటించాం : కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సెయిల్‌లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కష్టతరమని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీని స్టీల్‌ప్లాంట్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామితో కలిసి నేడు (గురువారం) వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శిస్తామన్నారు. ప్రధాని మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు సంకల్పంతో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సాధ్యమైందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ కార్మికులతో చర్చించి కేంద్ర పెద్దలను ఒప్పించి ప్యాకేజీ తీసుకొచ్చామన్నారు. కార్మికులు సమిష్టిగా పనిచేసి స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావాలని తెలిపారు. స్టీల్ ఉత్పత్తిని పెంచాలన్న మోడీ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

మూడు నెలలుగా ఉన్న వేతన బకాయిలని చెల్లించే అంశంపై కేంద్రమంత్రి కుమార స్వామి, తాను ఆలోచన చేస్తున్నామని అన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని, ప్రైయివేటు పరం చేస్తారన్న ఆలోచన ఎవరూ చేయొద్దని తెలిపారు. ఆంధ్రుల ఉద్యమ ఫలితంగా స్టీల్ ప్లాంట్ వచ్చిందనీ, స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకునే బాధ్యత అందరి పైనా ఉన్నదని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను ముందుకు తీసుకువెళ్తామని అన్నారు.

ప్యాకేజీ కావాలని అడిగిన వారే, ప్యాకేజీ ఇచ్చిన తర్వాత అదొక మోసమంటూ వ్యాఖ్యలు చేయడం బాధ్యతా రాహిత్యమని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరుగుతుందని ఎవరు చెప్పినా నమ్మొద్దన్నారు. స్టీల్ ప్లాంట్‌కి రూ.35 వేల కోట్లు బకాయిలున్నాయనీ, అందులో రూ.18 వేల కోట్లు బ్యాంకులకు, మెటీరియల్ సప్లై చేసిన వారికి రూ. 17 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. రూ.11,440 కోట్లతో స్టీల్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకువచ్చి నష్టాలు పూడ్చే పని మొదలు పెట్టాలన్నారు.

తొలిత ప్లాంట్ గాడిన పడాలని తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యం పెరిగి, నష్టాల నుంచి బయటకు వచ్చిన తర్వాత ఏం చేయాలో కేంద్రం ఆలోచన చేస్తుందన్నారు. నష్టాల నుంచి బయటకు వచ్చిన తర్వాత విలీనాన్ని పరిశీలిస్తామని సెయిల్ అధికారులు చెప్పారని తెలిపారు. సెయిల్‌లో విలీన ప్రక్రియకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. సెయిల్‌లో స్టీల్ ప్లాంట్ విలీనానికి తాము వ్యతిరేకం కాదని చెప్పారు.

పథకాలు ప్రకటించడం, విస్మరించడం బీఆర్ఎస్ నైజం

- కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ముందు పథకాలు ప్రకటించడం, ఆ తర్వాత విస్మరించడం బీఆర్ఎస్ నైజమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. నల్లగొండలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు రైతుబంధు, హుజూరాబాద్ ఉప ఎన్నికల కోసం దళితబంధు, జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు ఇంటికి రూ.పది వేలు, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ బంధు, మైనారిటీ బంధు పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని విమర్శించారు. ఇంట్లో కూర్చొని లబ్దిదారుల జాబితాను సిద్ధం చేస్తేనే కేసీఆర్‌ను ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తుచేశారు. ప్రజల సమక్షంలో పథకాల అర్హులను ఎంపిక చేస్తుంటే తట్టుకోలేక అమాయకులను ఆత్మహత్యలు చేసుకునేలా ప్రోత్సహించి రాజకీయాలు చేస్తోంది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మరుపులు..అధికారం పోగానే అరుపులు అన్నట్టుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 జూన్, జులై మాసాల్లో వేయాల్సిన రైతు బంధు నిధులను.. నవంబర్‌లో ఎన్నికల రోజు వేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పిందని గుర్తు చేశారు. ఎక్కడ ఉప ఎన్నికలు జరిగితే అక్కడే రైతుబంధు నిధులు విడుదల చేసిన ఘనత బీఆర్ఎస్‌దని విమర్శించారు. అధికారం దూరం కావడాన్ని జీర్ణించుకోలేక కేటీఆర్ నోరు పారేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉచిత ఎరువులు, పంట బోనస్ హామీలను విస్మరించిదెవరని ప్రశ్నించారు.

భారత్‌పర్వ్‌లో అలరించిన గరగ నృత్యం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ బుధవారం ఏర్పాటు చేసిన భారత్ పర్వ్‌లో ఏపీకి చెందిన గరగ నృత్యం ప్రేక్షకులను అలరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ ఈ నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కోనసీమ జిల్లాకు చెందిన పి.బాబా సత్య వెంకట కుమార్ బృందం గరగ నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ పర్యాటక సమాచార కేంద్రం (ఏపీటీఐసీ) అధికారి వీరేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల గురించి ఢిల్లీ ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత్ పర్వ్‌లో ఏపీ టూరిజం పెవిలియన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 31 వరకు జరిగే భారత్ పర్వ్‌లో భాగంగా గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ వారు ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య కార్యక్రమం జరగనున్నది.

మూడో స్థానంలో ఏపీ శకటం

- మొదటి రెండు స్థానాల్లో యూపీ, త్రిపుర శకటాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మలు - పర్యావరణ అనుకూల చెక్క బొమ్మలతో కూడిన ఆంధ్రప్రదేశ్ శకటం మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, త్రిపుర రాష్ట్రాలకు చెందిన శకటాలు నిలిచాయి. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రి శాఖ గణతంత్ర దినోత్సవ పరేడ్-2025లోని అత్యుత్తమ కవాతు దళాల, శకటాల ఫలితాలను వెల్లడించింది. త్రివిధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్-సీఏపీఎఫ్), ఇతర అనుబంధ బలగాలకు చెందిన కవాతు దళాలతోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ), కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌ల శకటాల ప్రదర్శనను అంచనా వేసేందుకు న్యాయనిర్ణేతలతో కూడిన మూడు ప్యానల్స్‌ను రక్షణ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఆయా ప్యానల్స్ అందజేసిన ఫలితాలను రక్షణ శాఖ విడుదల చేసింది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కేటగిరీలో అగ్రగామి శకటాలు

1. ఉత్తరప్రదేశ్ (మహాకుంభ్ 2025 - స్వర్ణిమ్ భారత్ : విరాసత్ అవుర్ వికాస్)
2. త్రిపుర (ఇటర్నల్ రివరెన్స్ : త్రిపురలో 14 దేవీ దేవతల ఆరాధన - ఖర్చీ పూజ)
3. ఆంధ్రప్రదేశ్ (ఏటికొప్పాక బొమ్మలు - పర్యావరణ అనుకూల చెక్క బొమ్మలు)

సర్వీసెస్ కేటగిరీలో అత్యుత్తమ మార్చింగ్ కంటింజెంట్ - జమ్మూ కాశ్మీర్ రైఫిల్స్ కంటింజెంట్, సీఏపీఎఫ్, ఇతర సహాయక బలగాలలో అత్యుత్తమ మార్చింగ్ కంటింజెంట్ - ఢిల్లీ పోలీస్ మార్చింగ్ కంటింజెంట్ నిలిచాయి.

కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల కేటగిరీలో అత్యుత్తమ శకటంగా గిరిజన వ్యవహారాల శాఖ (జన్‌జాతీయ గౌరవ్ వర్ష్) అగ్రగామిగా నిలిచింది. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) భారత రాజ్యాంగానికి 75 సంవత్సరాలు, 'జయతి జయ మమ భారతం' నాట్య బృందానికి ప్రత్యేక బహుమతులు వచ్చాయి.

వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత

జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం : శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

- వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన స్పీకర్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ప్రభుత్వం వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, వడ్లకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి ఎన్నో పథకాలని అమలు చేస్తున్నట్టు వివరించారు. ఏడాదికి వ్యవసాయ రంగానికి సుమారు 50 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బుధవారం స్పీకర్ సందర్శించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో ప్రసంగించారు.

తన సొంత జిల్లాలో ఉన్న ఈ విశ్వవిద్యాలయం అంటే తనకెంతో అభిమానం అన్నారు. తన జిల్లా పరిధిలోని తాండూర్ కందికి భౌగోళిక గుర్తింపు లభించి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించడం సంతోషదాయకం అన్నారు. ఈ గుర్తింపు వెనక ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ కృషి ఎంతో ఉందన్నారు. సమర్థులు, మేధావి అయిన ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నేతృత్వంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం మరింత ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం భూములు, ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. విశ్వవిద్యాలయానికి సంబంధించి నిధులు, నియామకాలు, బోధన బోధనేతర సమస్యల గురించి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఉపకులపతిని తీసుకొని ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. గత పాలకుల అస్తవ్యస్త పరిపాలన వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. గత పాలకులు చేసిన అప్పులు, వడ్డీలు ప్రస్తుత ప్రభుత్వానికి తలకు మించిన భారం అయిందన్నారు. అయినా అన్నిటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రైతులకు అధిక మొత్తం నిధులు కేటాయిస్తూ, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందిస్తున్నామన్నారు.

ఉపకులపతిగా నియమితులైన కొన్ని నెలల్లోనే అల్దాస్ జానయ్య విశ్వవిద్యాలయ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారని స్థానిక శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అభినందించారు. సవాళ్లను అధిగమిస్తూ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.

అందరి సహకారం తో ఈ మధ్యనే విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్స వాలను ఘనంగా నిర్వహించామని ఉపకులపతి అల్దాస్ జానయ్య అన్నారు. స్కిల్ యూనివర్సిటీతో భాగ స్వామ్యం కుదుర్చుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి నిధులు పెంచాలని, నియామకాలు చేపట్టాలని, కొత్త వసతి గృహాలు నిర్మించాలని విద్యార్థులు కోరారు. అలాగే పరిశోధనలకి నిధులు అత్యధికంగా కేటాయించాలని, ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలని, హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని బోధన, బోధ నేతర సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సామా ఇంద్రపాల్ రెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఊపందుకున్న ప్రచారం

- కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల
- కులగణన, మహిళలకు నెలకు రూ.2,500



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఆప్, ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్‌లు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ బుధవారం తన మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. పూర్వాంచలీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, రూ.500 ధరకు ఎల్‌పిజి గ్యాస్ సిలెండర్ వంటి హామీలు ఇచ్చింది. రూ 25 లక్షల వరకూ ఉచిత ఆరోగ్య భీమా, ఉచిత రేషన్ కిట్లు కూడా పార్టీ హామీల్లో ఉన్నాయి. 22 ఫోకస్ ఏరియాలుగా విభజించిన ఈ మేనిఫెస్టోను ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేష్ కూడా పాల్గొన్నారు. విద్యాధికులైన నిరుద్యోగులకు నెలకు రూ 8,500 ఒక ఏడాది పాటు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. రూ.5 కే భోజనం పెట్టే ఇందిరా క్యాంటీన్లను ఢిల్లీ వ్యాప్తంగా వంద ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా జైరాం రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో కాలుష్య సమస్యను పరిష్కరించడంలో రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు.

పాపులను ఢిల్లీ క్షమించదు : ప్రధాని మోడీ

పాపులను ఢిల్లీ క్షమించదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. యమునా నదిలో హర్యానాలోని బిజెపి ప్రభుత్వం విషం కలుపుతోందని ఆప్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'హర్యానా ప్రజలపై ఒక మాజీ ముఖ్యమంత్రి (కేజ్రీవాల్) దురుద్దేశపూరిత ఆరోపణలు చేస్తున్నారు. ఓటమి భయంతో ఆప్ నాయకులు నిరాశకు గురవుతున్నారు. హర్యానాకు ఢిల్లీ వేరు కాదు. ఢిల్లీలోనూ హర్యానా ప్రజలకు బంధు వులు ఉన్నారు. హర్యానా ప్రజలు తమ సొంత వ్యక్తులపై విషం కలుపుతారా?' అని కేజ్రీవాల్‌ను ఉద్దేశిస్తూ మోడీ విమర్శలు చేశారు. కర్తార్ నగర్‌లో జరిగిన బిజెపి ఎన్నికల సభలో మాట్లా డుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ నాయకులను సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్‌తో పోల్చారు. 'శీష్ మహల్ నిర్మించినవాళ్లు, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వాళ్లు పేదల సంక్షేమం గురించి ఎన్నడూ ఆలోచించలేదు' అని మోడీ అన్నారు. ఈసారి బిజెపికి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.

కుటుంబ పోషణకు అప్పులు

- నిరసనలకు ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధం
- ఫిబ్రవరి 12 వరకు వరుసగా వివిధ రూపాల్లో ఆందోళనలు
- ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మె నోటీసు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రభావం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా జీతాలివ్వట్లేదు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నామని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. జీతభత్యాలతో పాటు ఇతర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి 15 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. అప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని ఉపాధి సిబ్బంది హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ సమస్యల పరిష్కారం కోసం కొట్లాడినా పరిష్కారం కాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెండింగ్ సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా 13 నెలలు అవుతున్నా ఏ చిన్న సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో 32 జిల్లాల్లో 528 మండలాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద 12,499 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 7561 మంది ఫీల్డ్ అసిస్టెంట్స్, 1831 మంది టెక్నికల్ అసిసెంట్లు, 849 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 378 మంది అసిస్టెంట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, 257 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 150 మంది, మెదక్ జిల్లాలో 154 మంది, సిద్దిపేట జిల్లాలో 475 మంది ఉపాధి సిబ్బంది ఉన్నారు. ఈ సిబ్బందికి ప్రభుత్వం నుంచి మూడు నెలలుగా జీతాలందడం లేదు. టీఏలకు మాత్రమే మెటీరియల్ కాంపొనెంట్స్ బడ్జెట్‌లోంచే జీతాలిస్తున్నారు. మిగతా సిబ్బంది అంతా జీతాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు రాకపోయే సరికి అనేక మంది అప్పులు చేసి కుటుంబాల్ని నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ఇతర సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి సిబ్బంది 15 రోజుల నిరసన కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 12 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓలకు వినతి పత్రాలిచ్చారు. 30న తహసీల్దార్లకు వినతి పత్రాలివ్వనున్నారు. ఫిబ్రవరి 1న పెన్‌డౌన్ కార్యక్రమం, 2న జాతీయ ఉపాధి హామీ పథకం ఆవిర్భవ రోజున ప్రజా ప్రతినిధులు, 3న ఎమ్మెల్యేలకు, 4న కలెక్టర్లకు వినతి పత్రాలివ్వనున్నారు. 5న కలెక్టరేట్ల ఎదుట శాంతయుత నిరసన, 6న టీఎన్జీఓ, టీజీఓ సంఘాల నేతలకు వినతి పత్రాలివ్వడం, 7న ప్రగతిభవన్‌కు వెళ్లి వినతిపత్రమివ్వడం, 8న హైదరాబాద్‌లోని పీఆర్ అండ్ సీడీఆర్ కమిషనర్‌కు వినతి, 9, 10 తేదీల్లో మంత్రుల కార్యాలయాల ముందు, 11న పీఆర్ అండ్ సీడీఆర్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేసిన తర్వాత 12న కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చేందుకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.

ఇబ్బందుల్లేకుడా చూస్తాం: జ్యోతి, పీడీ

ఉపాధి సిబ్బంది విధులకు రాని పక్షంలో చట్టం అమల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయం చూస్తాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉపాధి జాతరకు ఇబ్బందులేమీ ఉండవు. కలెక్టర్ మార్గదర్శకాల మేరకు నడుచుకుంటాం. జీతాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పై ప్రభావం

ఉపాధి హామీ చట్టం లో పనిచేస్తున్న సిబ్బంది తమ పోరాటాన్ని ఉధృతం చేస్తే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుపై తీవ్ర ప్రభావం చూపుతుందని పలువురు ఎంపీడీఓలు చెబుతున్నారు. ఈ నెల 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని పేదలకు రూ.6 వేల చొప్పున ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం ప్రటించింది. ఉపాధి హామీ పథకంలో 100 రోజులు, 70, 80, 90 రోజుల పాటు ఎవరెవరు పని చేశారనే వివరాల్ని సేకరిస్తున్నారు. సిబ్బంది సమ్మెకు పోతే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియకు ఇబ్బందులు తప్పవంటున్నారు. మరో పక్క మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున 2024-25 సంవత్సరంలో మంజూరిచ్చిన పనులన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉపాధి పనుల జాతరకు పిలుపు నిచ్చింది.

ఇది కూడా సిబ్బంది లేకపోతే ముందుకు సాగదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిపొందాలంటే ఈజీఎస్‌లో పని చేయాలి. అందుకే కూలీలు కూడా ఫిబ్రవరి నుంచి ఎక్కువ సంఖ్యలో పనులకు వచ్చే అవకాశముంది. ప్రభుత్వం స్పందించి జీతాలివ్వడమే కాకుండా ఇతర సమస్యల్ని పరిష్కరించాలని ఎపీఓ మధుసూదన్ కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కేటగిరిని రద్దు చేయాలి

ఉపాధి హామీలో క్షేత్ర స్థాయిలో కూలీలతో పనిచేయించడం, కొలతలు, హాజరు నమోదు చేయడం వంటి కీలకమైన పనుల్ని ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తారు. వారికి కూడా జీతాలివ్వట్లేదు. పైగా పనిదినాలను టార్గెట్‌గా పెట్టి మూడు క్యాటగిరీలుగా విభజించారు. 6 వేల పనిదినాలు కల్పించిన ఫీల్డ్ అసిస్టెంట్లను ఎ క్యాటగిరిగా 5 వేల పనిదినాలు కల్పిస్తే బి క్యాటగిరి, 2 వేల లోపు పని దినాలు కల్పిస్తే సీ క్యాటగిరిగా విభజించారు. సీ క్యాటగిరిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలివ్వట్లేదు. పని దినాలను బట్టి కూలి మాత్రమే చెల్లిస్తారు. ఎ క్యాటగిరి వారికి రూ.12 వేలు, బి క్యాటగిరి వారికి రూ.8 వేల జీతమే ఇస్తున్నారు. 2006 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నప్పటికీ రూ.12 వేల లోపే వేతనాలివ్వడం వల్ల కుటుంబాల్ని పోషించుకోవడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కచ్చితంగా నిర్దేశించిన పని దినాలు కల్పించాలంటూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కరోనా సమయంలో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒకరికి పనితో పాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మూడు నెలలుగా జీతాల్లేక ఉపాధి సిబ్బంది తిప్పలు

క్యాటగిరీలను రద్దు చేయాలి: ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉపాధి చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లను మూడు క్యాటగిరీలుగా విభజించడం సరైంది కాదు. పనిదినాలు పెంచుతూ టార్గెట్ పెట్టిన ప్రభుత్వం క్యాటగిరీలు చేసి వేతనాలు ఎగవేతకు పూనుకుంది. ఫీల్డ్ అసిస్టెంట్లందర్నీ ఒకే క్యాటగిరిగా చూడాలి. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.నేరం జరిగిన 24 గంటల్లో సమాచారమిస్తే ఫలితం ఉంటుంది. 14సీ ఆధ్వర్యంలో నడిచే హెల్ప్‌లైన్, పోర్టల్ రాష్ట్రాల విభాగాలతో అనుసంధానమై ఉంటుంది. దీని ద్వారా 300 ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, వాలెట్లకు కూడా సమాచారం అందుతుంది. బ్యాంకులు, పేమెంట్ వాలెట్లకు 14సీ నుంచి హెచ్చరికలు వెళ్లడంతో ఆయా ఖాతాలను స్తంభింపజేస్తారు.



కేంద్రంలో కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వం


- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా

విశాఖ : ఇంద్రంలో ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వం నడుస్తోందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా విమర్శించారు. 'ఆధునిక భారత నిర్మాణంలో సిపిఐ పాత్ర - భవిష్యత్తు సవాళు ' అంశంపై సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.. లౌకిక రాజ్యం విధానానికి తూట్లు పొడుస్తూ.. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తోందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ దేశంలో హిందు, ముస్లిముల మధ్య ఐక్యతను కోరుకున్నారని తెలిపారు. గాంధీని చంపిన గాడ్సేను దేశభక్తుడని ఆర్ఎస్ఎస్, బిజెపిలు పేర్కొంటున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర పోషించకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం బిజెపి నేడు అధికారంలో ఉండడం దురదృష్టకరమన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన తొలి రాజకీయ పార్టీ సిపిఐ అని, స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది నాయకులు, కార్యకర్తలు రక్తం, స్వేదం చిందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తరువాత దేశ సమైక్యత, భాషా రాష్ట్రాలు, ఫెడరల్ వ్యవస్థ కోసం కృషి చేసిందని తెలిపారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరిగిన తరువాత దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొనడాన్ని ఖండించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేంద్రంలో బిజెపికి సొంతంగా పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, రావుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'సింహాచలం'భూముల సమస్యకు

త్వరలో పరిష్కారం

- 12,149 ఇళ్లు క్రమబద్ధీకరణ
- ప్రత్యామ్నాయంగా ఆలయానికి 610 ఎకరాల భూమి :సిఎం సమీక్షలో నిర్ణయం



అమరావతి : సింహాచలం పంచగ్రామాల భూముల సమస్యకు త్వరలో పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచగ్రామాల్లోని 12,149 ఇళ్ళను క్రమబద్ధీకరిం చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

దీనికి ప్రత్యామ్నాయంగా సుమారు రూ.5,300 కోట్లు విలువ జేసే 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచలం దేవస్థానానికి ఇవ్వనున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విశాఖ ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి మీడియాకు వివరించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు. ఈ సమస్యకు సంబంధించి గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓపై పలువురు కోర్టుకు వెళ్లారని, ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ కేసులను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు జీఓ నెంబరు 338,296ల కింద విశాఖలో 70వేల మంది క్రమబద్ధీకరణకు కింద దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ జీఓల ప్రకారం రెండేళ్ల కాల వ్యవధిలో ఆ భూములపై లబ్దిదారులకు అన్ని హక్కులు సంప్రాప్తమయ్యే విధంగా కన్వేయన్స్ డీడ్ కూడా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు సాగు చేసుకునే భూములు, ఖాళీ స్థలాలకు సంబంధించి కోర్టులో పలు కేసులు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించేందుకు దశల వారీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గాజువాక ఇనాం భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తమ ప్రభుత్వం 2018లో జీఓ నెంబరు 310ను జారీ చేసిందని, ఆ జీఓ ప్రకారం దాదాపు 7వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ ప్రక్రియ అసంపూర్తిగా ఉండటంతో ఆ జీఓను కూడా సవరించి నూతన మార్గదర్శకాలతో మళ్లీ జీఓను జారీ చేయనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మీడియా సమావేశంలో విశాఖ ఎంపి ఎం.భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖట్టణం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ, పిజివి ఆర్ నాయుడు(గణబాబు), విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ, ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుండి వాట్సాప్ పాలన

రాష్ట్రంలో గురువారం నుండి వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కానుంది. మొదటి విడతలో 161 రకాల సేవలను అందించనున్నారు. దీనిపై బుధవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. సేవలకు సంబంధించిన అంశంపై ముఖ్యమంత్రికి అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రజలు ఎలా వినియోగించుకోవాలనే అంశంపై వివరణ ఇచ్చారు. మొదటి విడతలో దేవాదాయ, ఎనర్జీ, ఎపిఎస్ఆర్‌టిసి, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సిఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల్లో సేవలు అందించనున్నారు. దీనిపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశంలో మొదటిసారి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని, ధ్రువపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని అన్నారు. అదే సమయంలో పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు అందకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆ దిశగా అధికారులు సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని ఆదేశించారు. వాట్సాప్ ద్వారా సేవలందించేందుకు ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. గురువారం ఈ సేవలను ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నారు. . సిఎం సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టం రైతులకు వరం

- రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం
- చివరి ఎకరా వరకు రైతు భరోసా
- భూ చట్టాలపై రైతులకు అవగాహన ఉండాలి : రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ సమితి చైర్మెన్ కోదండరెడ్డి
- భూభారతి చట్టంపై పాలకుర్తిలో అవగాహన సదస్సు



నవతెలంగాణ-పాలకుర్తి

ధరణి చట్టంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతాంగానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం వరం లాంటిదని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ సమితి చైర్మెన్ కోదండరెడ్డి అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో లిఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'భూభారతి చట్టం'పై రైతులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో కోదండరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటుపడుతోంన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం.. భూమిపై పూర్తి హక్కును కలిగి ఉండే విధంగా 2025 ఆర్ఓఆర్ భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన చివరి ఎకరా వరకు రైతుభరోసా అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. 2025 ఆర్ఓఆర్ భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు.

భూస్వాముల కోసమే ధరణి చట్టం : ఎమ్మెల్సీ కోదండరామ్



భూస్వాముల భూములను కాపాడుకునేందుకే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. భూమిపై సాధారణ రైతులకు ఒక కోణం, రియల్టర్లు, భూస్వాములకు మరో కోణం ఉంటుందని వివరించారు. ధరణితో కొత్తగా భూ సమస్యలు తలెత్తాయి తప్ప, పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారాన్ని ఉపయోగించాలి తప్ప స్వప్రయోజనాలకు కాదని స్పష్టం చేశారు. మార్పు కోసమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూ చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని భూభారతి రూపకర్త భూమి సునీల్ కుమార్ రైతులకు సూచించారు. ధరణి చట్టంతో భూ సమస్యలు తలెత్తాయని చెప్పారు. ధరణి సమస్యలపై 21 లక్షల మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. భూ సమస్యలపై రైతులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరించే విధంగా చట్టాలను రూపొందించా మన్నారు. అప్పటి ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలకు భిన్నంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. భూ సమస్యలను పరిష్కరించి రైతులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. భూములు మింగే అనకొండ లాగా గత ప్రభుత్వం ధరణి చట్టాన్ని రూపొందించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణితో గ్రామాల్లో రైతుల కు ఎలాంటి సమస్యలూ లేవని నిరూపించేందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. భూ సమస్యల రహిత నియోజకవర్గంగా పాలకుర్తి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, రైతు కమిషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

షాకిచ్చిన స్మార్ట్ మీటర్!



కర్నూలు: కర్నూలు కార్పొరేషన్ పరిధిలో స్మార్ట్ మీటర్ల బిల్లుల మోతతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. మాకొద్దీ స్మార్ట్ మీటర్లు అని అంటున్నారు. కర్నూలు 45వ వార్డులో అజీముద్దీన్ నగర్‌లోని వెల్డింగ్ షాపు యజమాని జెఎండి ఉస్మాన్ బాష 2.12.2024 నుంచి 2.1.2025 వరకూ 242 యూనిట్ల విద్యుత్ వినియోగించారు. ఇందుకుగానూ ఆయనకు మొత్తం రూ.30,758 బిల్లును విద్యుత్ సంస్థ అధికారులు ఇచ్చారు. పాత మీటరు స్థానే కొత్తగా స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసిన తర్వాత వచ్చిన ఈ బిల్లును చూసి ఆయన షాకయ్యారు. ఈ బిల్లులో ఎనర్జీ ఛార్జీలుగా రూ.29,107.90, ఫిక్స్‌డ్ ఛార్జీలుగా రూ.750, కస్టమర్ ఛార్జిగా రూ.45, ఎలక్ట్రిసిటీ డ్యూటీగా రూ.242, ఎఫ్‌పిపిసిఎ (2022-05)గా రూ.157, ఎఫ్‌పిపిసిఎ (2023-05)గా రూ.93.60, ఎఫ్‌పిపిసిఎ (2024-12)గా రూ.263.60, ట్రూ అప్ ఛార్జీలుగా రూ.98.05 విద్యుత్ శాఖాధికారులు చూపారు. దీంతో, ఇంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మీటరు ఉన్నప్పుడు 2.10.2024 నుంచి 2.11.2024 వరకూ 256 యూనిట్ల వినియోగించారు. మొత్తం బిల్లు 3,380 మాత్రమే వచ్చింది. కొత్త బిల్లులో విద్యుత్ వినియోగ యూనిట్లు 12 తగ్గినప్పటికీ బిల్లు గుబేలుమనిపించింది. పాత బిల్లులో ఎనర్జీ ఛార్జీలుగా రూ.2,335.80 మాత్రమే ఉండగా, కొత్త బిల్లులో రూ,29,107 చూపడంతో ఆ మేరకు బిల్లు అధికంగా వచ్చింది. దీనిపై విద్యుత్ శాఖాధికారులను సంప్రదించానని, బిల్లు తగ్గించేది లేదని, మొత్తం కట్టాల్సిందేనని తేల్చి చెప్పారని 'ప్రజాశక్తి'కి ఉస్మాన్ బాష తెలిపారు.

బిల్లు తగ్గించి అదనపు భారం ప్రభుత్వం భరించాలి : టి.రాముడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

స్మార్ట్ మీటరు బిగించాక రూ.30,758 బిల్లు రావడం దారుణం. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు, అదనపు భారాలు మోపబోమని ఎన్నికలకు ముందు టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చి గద్దెనెక్కాక మాట తప్పారు. ప్రజల అనుమతి తీసుకోకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. వెంటనే స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలి. స్మార్ట్ మీటర్లు బిగించిన ఇళ్లకు ఈ నెల కరెంటు బిల్లులు చూస్తే చుక్కలు కనపడుతున్నాయి. భారీగా వచ్చిన కరెంటు బిల్లు తగ్గించాలని ఎస్ఇని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా ఉంది.

నిర్వాసితులను నట్టేట ముంచేయాలని చూస్తే

గిరిజనులు బాణాలై ఎదుర్కొంటారు

- న్యాయం జరిగే వరకూ పోరాటం
- పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతాలో పి మధు
- సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా నిర్వహణ



పోలవరం నిర్వాసితుల పతాకయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న పి.మధు

చింతూరు :గిరిజన ముంపు మండలాలను వరద నీటిలో ముంచి పోలవరం డ్యాం కడతామంటే ఊరుకోబోరని, ముంపు ప్రాంత గిరిజనులు పోరు బాణాలై ఎదుర్కొంటారని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు హెచ్చరించారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా పార్టీ ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం బొజ్జరాయిగూడెంలో పోలవరం నిర్వాసితుల పతాక జాతాను జెండా ఊపి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, పోలవరం పేరుతో ఈ ప్రాంత ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోదావరిలో ముంచుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, నిర్వాసితుల నిర్వాసితులకు న్యాయం జరగడం లేదన్నారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలూ కల్పించిన తర్వాతే ప్రాజెక్టులు కట్టాల్సి ఉందని, పోలవరం విషయంలో ఇందుకు భిన్నంగా జరుగుఓతందని అన్నారు. ఎకరాకు రూ.1.15 లక్షలు కంటిపుడుపుగా ఇచ్చి ప్రభుత్వాలు చేతులు దులుపేసుకుంటే కుదరదని,రూ.50 లక్షలు చొప్పున ఇవ్వాల్సిదేనని ఆయన డిమాండ్ చేశారు. పునరావాస కల్పనలో ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పునరావాస కాలనీలు వరదలకు మునుగుతున్నాయని గుర్తు చేశారు. లైడార్ సర్వే పేరుతో ముంపు ప్రాంత ప్రజలను ఏటా ఇబ్బంది పెడుతున్నారన్నారు. బిజెపికి టిడిపి, జనసేన తొత్తుగా వ్యవహరిస్తూ గిరిజనుల మనుగడకు ప్రమాదం తెస్తున్నాయని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత గ్రామాలు ఏటా నీటి ముంపునకు, వరదలకు గురవుతున్నాయని, దీనివల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. బాధితులను పాలకులు ఆదుకోవడం లేదని, పప్పు, ఉల్లిపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని వివరించారు. సర్వేల పేరుతో ముంపువాసులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సరైన సర్వే జరిపి త్వరితగతిన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ బైక్ జాతా కూనవరం మండలం నుంచి చింతూరు, విఆర్.పురం మీదుగా సాగి మళ్లీ కూనవరం చేరుకొంది. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మర్లపాటి నాగేశ్వరావు, సున్నం రాజులు, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, మడకం నాగమణి, పులి సంతోష్, మేకల నాగేశ్వరరావు, కూనవరం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, చింతూరు మండల కార్యదర్శి పల్లపు వెంకట్, యర్రంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.